ఈనాడు

కుమురం భీం

సోమవారం 21 ఆగస్టు 2017 | 16 పేజీలు

బాల్యం.. బలహీనం

- రేపటి పౌరులు.. రుగ్మతలతో విలవిల
- ఆందోళన కలిగిస్తున్న గణాంకాలు
- జిల్లా కేంద్రంలో డీఈఐసీ ఏర్పాటు చేస్తే మేలు



విద్యార్థులను పరీక్షిస్తున్న ఆర్‌బీఎస్‌కే వైద్యుడు నరేందర్, సిబ్బంది

బాల్యం బలహీనమవుతోంది. చురుగ్గా ఉండాల్సిన బాలలు చతికిల పడుతున్నారు. ఎగిరి చిందులేయాల్సిన వారు నీరసిస్తున్నారు. రేపటి పౌరులుగా ఎదగాల్సిన వారు రుగ్మతల చట్రంలో చిక్కుతున్నారు. పోషకాహార లోపం బాలలను కుంగదీస్తోంది. బంగారు భవిత కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్ని పథకాలు అమలు చేస్తున్నా క్షేత్ర స్థాయిలో భిన్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. బాలలకు మెరుగైన ఆరోగ్యం అందించే ఉద్దేశంతో గతేడాది నుంచి ప్రారంభించిన రాష్ట్రీయ బాల స్వస్థ్ కార్యక్రమం(ఆర్‌బీఎస్‌కె)లో ఈ చేదు నిజాలు వెల్లడయ్యాయి. జిల్లాలో బాలల ఆరోగ్య పరిస్థితులపై కథనం.

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే

రాష్ట్రీయ బాల స్వస్థ్ కార్యక్రమం(ఆర్‌బీఎస్‌కె)లో వైద్యులు అన్ని ప్రభుత్వ యాజమాన్యాల పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. ఆరోగ్య సమస్యలున్న వారికి మెరుగైన వైద్యం కోసం ఆదిలాబాద్ రిమ్స్‌లో ఉన్న డీఈఐసీ (డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్‌వెన్షన్ సెంటర్)కి పంపిస్తారు. గతేడాది సెప్టెంబర్ నుంచి జులై వరకు జిల్లాలోని అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలు, ఆశ్రమాలు, గురుకుల, వసతి గృహాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించిన వైద్య పరీక్షల్లో 5155 మంది బాలలు వివిధ రుగ్మతలతో బాధపడుతుండటం ఆందోళన కలిగిస్తోంది.

త్వరలో భర్తీ కానున్న ఖాళీలు..

జిల్లాలో ఆర్‌బీఎస్‌కే కింద ఏర్పాటు చేసిన పది వైద్య బృందాల్లో 20 మంది వైద్యులు ఉండాలి. కానీ 12 మంది పని చేస్తున్నారు. 8 వైద్య పోస్టులు, ఒక ఫార్మాసిస్ట్ ఖాళీ ఉంది. ఉన్న వారిలో అందరూ ఆయూష్ వైద్యులే. ఈ బృందాలే సర్దుకుపోయి పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. రెండు రోజుల క్రితం ఉమ్మడి జిల్లా కేంద్రంలో కొత్త వైద్య సిబ్బంది నియామకాలు జరిగినట్లు అధికారులు చెబుతున్నారు. దీంతో త్వరలో ఖాళీ పోస్టులు భర్తీ అయ్యే అవకాశం ఏర్పడింది. దీంతో విద్యార్థులకు మరింత మెరుగైన వైద్య సేవలు అందే వీలు కలుగుతుంది.

బాలలపై వ్యాధుల పంజా..

నేటి బాలలే రేపటి పౌరులంటారు. రేపటి తరం ఆరోగ్యంగా ఉంటేనే భవిష్యత్తు సమాజం ఆరోగ్యంగా ఉంటుంది. పుట్టుకతో పాటు కాలానుగుణంగా కూడా వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుంది. వీటిని నివారించి ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం కోసం ఇది వరకు జవహర్ బాల ఆరోగ్య రక్ష కార్యక్రమం కొనసాగేది. దీనిలో వైద్యులు నెలకోసారి పాఠశాలలకు వెళ్లి విద్యార్థులను పరీక్షించి వైద్య సేవలందించేవారు. పర్యవేక్షణ లోపం, ఇతరాత్ర కారణాలతో ఆశించిన మేర ఫలితమివ్వలేదు. దీని స్థానంలో కేంద్రం జాతీయ ఆరోగ్య మండలి ఆర్థిక సహకారంతో గతేడాది నుంచి రాష్ట్రీయ బాల స్వస్థ్ కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. ఇందుకు కుమురం భీం జిల్లాలో 15 మండలాల్లో అయిదు క్లస్టర్‌లను విభజించి 10 వైద్య బృందాలను ఏర్పాటు చేశారు. ఒక్కో క్లస్టర్‌కు రెండు వైద్య బృందాలను నియమించారు. ఒక్కో బృందంలో మహిళ, పురుష వైద్యులు ఒక ఎంబీబీఎస్, ఒక ఆయుష్, ఒక ఫార్మాసిస్ట్, ఒక ఏఎన్ఎంలు ఉంటారు. ఒక్కో క్లస్టర్‌లో వైద్య బృందం తిరిగేందుకు ఒక వాహనాన్ని కేటాయించారు. వీరు జిల్లాలోని ప్రతి పాఠశాలను ఏడాదిలో ఒక సారి అంగన్‌వాడీ కేంద్రాన్ని ఏడాదిలో రెండు సార్లు సందర్శించి విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించాలి. ఆరోగ్య సమస్యలను గుర్తించి చిన్న చికిత్సలకు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలు అందేలా చూడాలి. పెద్ద సమస్యలుంటే ఆదిలాబాద్ రిమ్స్‌లోని డీఈఐసీ కేంద్రానికి రిఫర్ చేస్తారు.

పౌష్టికాహారం అమలు చేస్తున్నా..

పాఠశాలల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు, చిన్నారులకు పౌష్టికాహారం అందించేలా ప్రభుత్వం మధ్యాహ్న భోజనం అమలు చేస్తుంది. జిల్లాలో 1026 ప్రభుత్వ పాఠశాలల్లో 62,414 మంది విద్యార్థులు, 973 అంగన్‌వాడీ కేంద్రాల్లోని వేల సంఖ్యలో చిన్నారులు భోజనాలు చేస్తున్నారు. కానీ వారిలో చాలా మంది రక్తహీనత, చర్మ, దంత, కంటి పలురకాల ఆరోగ్య సమస్యలతో బాధపడుతుండడం విస్మయాన్ని కలిగిస్తోంది. భోజనంలో విద్యార్థులకు కావాల్సిన పోషకాలు ఉంటున్నాయా అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

వివిధ రుగ్మతలతో 5215 మంది విద్యార్థులు..

జిల్లాలో గతేడాది సెప్టెంబర్ నుంచి గత నెల జులై వరకు ఈ వైద్య బృందాలు 905 పాఠశాలలు, 855 అంగన్‌వాడీ కేంద్రాల్లో వైద్య (మిగతా 7లో)

ఆర్‌బీఎస్‌కే పరీక్షల ఫలితాలివీ..

- జిల్లాలో 855 అంగన్‌వాడీ కేంద్రాలు, 905 పాఠశాలల్లో 76,775 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించగా 5215 మంది వివిధ రుగ్మతలతో బాధపడుతున్నట్లు వెల్లడైంది. వీటిలో..

రక్తహీనత	1964
చర్మ సంబంధ వ్యాధులు	1750
దంత సమస్యలు	987
కంటి సమస్యలు	235
చెవులో చీముకారడం ఇతర సమస్యలు	127
నరాల సమస్యలు	122
గ్రహణంమొర్రి	18
గుండె సమస్యలు	12



మోవాడ్ కేంద్రంలో పరీక్ష రాస్తున్న అభ్యాసకులు

అక్షరానికి పరీక్ష

- జిల్లాలో ఎన్ఐఓఎస్ పరీక్షకు 2600 మంది హాజరు..?
- పక్కా సమాచారం లేక ఇబ్బందులు

ఆసిఫాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: వయోజనులను విద్యావంతులుగా తీర్చిదిద్దడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన సాక్షర భారత్ కేంద్రాలు మిథ్యగా మారాయి. వారి సామర్థ్యాలను పరీక్షించే పరీక్షను ఆదివారం నిర్వహించారు. కానీ ఎన్ఐఓఎస్ పరీక్షకు ఎంత మంది వయోజనులు హాజరయ్యారో రాత్రి వరకు కూడా స్పష్టమైన సంఖ్యను సంబంధిత అధికారులు ప్రకటించలేక పోవడం విచారకరం. పరీక్షకు 2600 మంది హాజరయ్యారని నోటి లెక్కగా చెబుతున్నారు. వివిధ మండలాల నుంచి సరైన సమాచారం లేకపోవడంతో ఉన్నతాధికారులు స్పష్టంగా చెప్పలేకపోతున్నారు. ఆది నుంచి సాక్షర భారత్ సమస్యల వలయంగానే సాగింది. అర్హత పరీక్ష అంతంతమాత్రంగానే జరిగింది.

నిరక్షరాస్యులైన వయోజనులకు సాయంత్రం వేళల్లో అక్షరాభ్యాసం కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన సాక్షర భారత్ కార్యక్రమం బాలారిష్టాల నుంచి బయట పడలేదు. సంపూర్ణ అక్షరాస్య సాధన లక్ష్యంగా చేపట్టిన ఈ కార్యక్రమం నిర్వహణలో చిత్తశుద్ధి లోపించింది. గ్రామాల్లో సాక్షర భారత్ కేంద్రాల నిర్వహణకు వసతులు కరవు, అభ్యాసకులకు నోటు పుస్తకాలు, పెన్సిల్లు, రబ్బర్లు లాంటి అభ్యసన సామాగ్రి లేక పోవడం, వీరికి అక్షరాలు నేర్పించే సమన్వయకర్తలకు ఏడాది కాలంగా వేతనాలు అందక పోవడంతో ఈ కార్యక్రమం ఆర్భాటానికే పరిమితమైంది. ఆశించిన ప్రయోజనం కల్పించడం (మిగతా 7లో)

వసతులు కరవు.. సమస్యల దరువు



ఫుట్ ఓవర్ వంతెన లేక పట్టాలపై నుంచి నడుచుకుంటూ వెళ్తున్న ప్రయాణికులు

రెబ్బెన, న్యూస్‌టుడే

దశాబ్దాలు గడుస్తున్నాయి.. పాలకులు వస్తున్నారు.. పోతున్నారు.. ఎన్నికల సమయంలో హామీలు గుప్పిస్తున్నారు. ఇలా ఏళ్లు గడుస్తున్నప్పటికీ సౌకర్యాలు కల్పించడంలో నిర్లక్ష్యం జరుగుతూనే ఉంది. బల్లార్షా-కాజీపేట్ రైల్వే ట్రాక్ ఏర్పాటు చేసి 90 ఏళ్లు కావొస్తున్నా, ఇప్పటికీ సరైన వసతులు లేక ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కుమురం భీం జిల్లా ప్రజలు రైల్వే ప్రయాణం కోరుకున్నప్పటికీ పూర్తి స్థాయిలో రైల్వే సేవలు అందడం లేదు. సింగరేణి కార్మికులు, ఇతరులు ఇక్కడికి నిత్యం ప్రయాణాలు సాగిస్తుంటారు. ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలుపుదల చేస్తామని ఇచ్చిన హామీలు నీటి మూటలుగానే మారాయి. ఆసిఫాబాద్ రోడ్ రైల్వే స్టేషన్ సమస్యలపై 'న్యూస్‌టుడే' కథనం..

- ఏళ్లు గడుస్తున్నా కానరాని సౌకర్యాలు
- అవస్థలతో కునారిల్లుతున్న వైనం
- ఇది ఆసిఫాబాద్ రోడ్ రైల్వే స్టేషన్ దుస్థితి

జిల్లా పరిధిలో మూడు రైల్వే స్టేషన్లు ఉన్నప్పటికీ రెండు స్టేషన్లలో ప్రయాణికులు సమస్యలతో సతమతమవుతున్నారు. కేవలం కుమురం భీం జిల్లా పరిధిలో 35 కిలోమీటర్ల దూరం మాత్రమే రైల్వే ప్రయాణం సాగుతుంది. జిల్లాలో ఉన్న మూడు స్టేషన్లలో ఆసిఫాబాద్ రోడ్ స్టేషన్ సమస్యలతో సతమతమవుతోంది. నూతన జిల్లా కేంద్రం, ఆసిఫాబాద్ నియోజక వర్గానికి ఏకైక దిక్కు అయిన ఆసిఫాబాద్ రోడ్ రైల్వే స్టేషన్ చరిత్ర ఘనం.. వర్తమానం అగమ్యగోచరంగా తయారైంది. పాలకుల హామీలు ఆచరణకు నోచుకోవడం లేదు. రెబ్బెన మండల కేంద్రంలోని ఆసిఫాబాద్ రోడ్ రైల్వే స్టేషన్ నిత్యం ప్రయాణికులతో కళకళలాడుతున్న అధికారులు వసతులు కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నట్లు ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఈ స్టేషన్‌లో నవాజ్ సర్ మీర్ ఉస్మాన్ అలీఖాన్ బహుదూర్ పతే జంగ్ 1928 డిసెంబర్ 16న బల్లార్షా- కాజీపేట్ రైల్వే ట్రాక్ ఏర్పాటుకు ఇక్కడే శిలాఫలకం ఆవిష్కరించారు. ఇక్కడ (మిగతా 7లో)

'ఎస్సార్పీ-3'లో ప్రమాదం

టబ్బులు మీదపడి కార్మికుడి మృతి ✱ యాజమాన్యం బాధ్యత వహించాలని సంఘాల డిమాండు



రత్న రాజయ్య మృతదేహం

శ్రీరాంపూర్ గ్రామీణం, న్యూస్‌టుడే: శ్రీరాంపూర్ ఏరియాలోని ఎస్సార్పీ-3 గనిలో ఆదివారం ఉదయం జరిగిన ప్రమాదంలో కోల్‌ఫిల్లర్ కార్మికుడు రత్న రాజయ్య(57) మృతి చెందారు. తోటి కార్మికులు, గని అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. చెన్నూరులోని ఎల్లక్కపేట గ్రామానికి చెందిన రత్న రాజయ్య శ్రీరాంపూర్‌లోని ఎస్సార్పీ-3 గనిలో కోల్‌ఫిల్లర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. శనివారం రాత్రి గని వద్దకు చేరుకున్న రాజయ్య యాక్టింగ్ ట్రామర్‌గా విధుల్లోకి వెళ్లారు. ఆయన గని అంతర్భాగంలో 6వ సీమ్ 17 లెవల్ 20 డిప్ 16 క్రాస్ కట్ వద్ద జంక్షన్ ట్రామర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. విధుల్లో భాగంగా ఆదివారం తెల్లవారుజామున సుమారు 4:30 నుంచి 5 గంటల ప్రాంతంలో పై నుంచి వచ్చే భర్తీ టబ్బులను కింది ఖాళీ టబ్బులను జతచేసి లైను మార్చే క్రమంలో ఆ టబ్బులు రాజయ్యపై పడ్డాయి. ఈ ప్రమాదంలో రాజయ్య తలకు, ఛాతికి, పొట్టకు తీవ్ర గాయాలయ్యాయి. కొద్ది సేపటి తర్వాత ఆ మార్గంలో వచ్చిన అండర్ మేనేజర్.. రాజయ్య కిందపడటాన్ని గమనించి అతన్ని తోటి కార్మికుల సహాయంలో హుటాహుటీన రామకృష్ణాపూర్‌లోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. రాజయ్యను పరిశీలించిన వైద్యులు ఆయన అప్పటికే చనిపోయినట్లు నిర్ధరించారు. ఎస్సార్పీ-3 గనిలో రాజయ్య పనిచేసే చోట మ్యాన్‌హోల్స్, హ్యాండు లివర్లు, టబ్బు స్ప్రేషర్లు లేకపోవడం వల్ల ప్రమాదం జరిగి ఆయన చనిపోయారని తోటి కార్మికులు తెలిపారు. అధికారులు ఉత్పత్తిపై చూపిస్తున్న శ్రద్ధ కార్మికుల రక్షణపై చూపడం లేదని, సీనియర్ కార్మికులు చేయాల్సిన పనులను అనుభవం లేని యాక్టింగ్ కార్మికులతో చేయించడం వల్ల గనుల్లో ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయని తెలిపారు. ఏరియా ఆసుపత్రి నుంచి రాజయ్య మృతదేహాన్ని మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి సింగరేణి అధికారులు ప్రయత్నిస్తుండగా అతని కుటుంబసభ్యులు అడ్డుకున్నారు. కార్మికుడి మరణానికి కారణంపై యాజమాన్యం రాసిన రిపోర్టును చూపించిన తర్వాతనే మృతదేహాన్ని తరలించాలని అతని డిమాండు చేశారు. కొద్ది సేపటి తర్వాత రాజయ్య మృతిపై యాజమాన్యం రిపోర్టులో గని ప్రమాదంగా రాయడంతో వారు మృతదేహం తరలింపునకు అంగీకరించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం అధికారులు రాజయ్య మృతదేహాన్ని మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కార్మికుడి మరణవార్త తెలుసుకొని ఏరియా జీఎం సుభాని, ఎస్ఓటు జీఎం పీవీ సత్యనారాయణ, డీజీఎం(పీ) చిత్తరంజన్‌కుమార్, ఏజెంట్ విజయభాస్కర్‌రెడ్డి, ఎస్సార్పీ-3 సంక్షేమాధికారి రాజు, తెబొగకాసం ఏరియా ఉపాధ్యక్షుడు కె.సురేందర్‌రెడ్డి, నాయకులు బంటు సారయ్య, బండి రమేష్, మహిపాల్‌రెడ్డి, రాఘవరెడ్డి, సత్తయ్య, సదయ్య, ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య, నాయకులు పి.భానుదాసు, ముస్కె సమ్మయ్య, ల్యాగల శ్రీనివాస్, కొట్టె కిషన్‌రావు, హన్మంతు, వీరమల్లు, హెచ్చెమ్మెస్ ఏరియా ఉపాధ్యక్షుడు పేరం రమేష్, నాయకులు కరీముల్లా, అశోక్‌కుమార్, గోల్ల సత్యనారాయణ, నూనేటి శ్రీనివాస్ తదితరులు ఏరియా ఆసుపత్రికి చేరుకొని రాజయ్య మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. కాగా రత్న రాజయ్యకు భార్య రాజేశ్వరి, కుమారులు సత్యనారాయణ, సంతోష్, కూతురు సౌందర్య ఉన్నారు.

రాజయ్య మృతికి యాజమాన్యం బాధ్యత తీసుకోవాలి

ఎస్సార్పీ-3 గనిలో ఆదివారం తెల్లవారు జామున జరిగిన గని ప్రమాదంలో రత్న రాజయ్య చనిపోవడంపై గని యాజమాన్యం బాధ్యత తీసుకోవాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండు చేశారు. అధికారుల నిర్లక్ష్యంగా కారణంగా గని ప్రమాదానికి గురై చనిపోయిన రాజయ్య కుటుంబానికి రూ.50 లక్షలు నష్టపరిహారం చెల్లించాలని డిమాండు చేశారు. ఉత్పత్తే ధ్యేయంగా పనిచేస్తున్న అధికారులు గనుల్లో కార్మికుల రక్షణను పట్టించుకోవడం లేదన్నారు. ఇలాంటి ప్రమాదాలు భవిష్యత్తులో జరగకుండా యాజమాన్యం రక్షణ చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఏరియా జీఎం కార్మికుల రక్షణ విషయంలో ఏమాత్రం జాగ్రత్తలు తీసుకోవడం లేదని ఆరోపించారు. సింగరేణిలో గుర్తింపు సంఘం విఫలమైన తర్వాతనే గనుల్లో ప్రమాదాల సంఖ్య పెరుగుతోందన్నారు. ఎస్సార్పీ-3 గని ప్రమాదంపై డీజీఎంఎస్ అధికారులు పూర్తి విచారణ జరిపి బాధ్యులైన అధికారులపై క్రిమినల్ కేసులు నమోదుచేయాలని డిమాండు చేశారు.

మాజీ ఎమ్మెల్సీ పరామర్శ

రత్న రాజయ్య మృతదేహం మంచిర్యాల ప్రభుత్వాసుపత్రికి చేరుకున్న తర్వాత మాజీ ఎమ్మెల్సీ ప్రేంసాగర్‌రావు, ఐఎన్టీయూసీ నాయకులు బాబురావు, కోండ్ర లింగయ్య, ఇతర కాంగ్రెస్ నాయకులు అక్కడికి వచ్చి మృతదేహాన్ని సందర్శించి, అతని కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ మాట్లాడుతూ సింగరేణి అధికారుల తప్పిదాల వల్లనే ప్రమాదాలు జరిగి కార్మికులు మృత్యువాత పడుతున్నారన్నారు. గని ప్రమాదాలు జరిగినప్పుడు సమగ్ర విచారణ జరిపి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకున్నప్పుడే భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగవని పేర్కొన్నారు.



ప్రభుత్వాసుపత్రిలో రాజయ్య మృతదేహం వద్ద కాంగ్రెస్ నేతలు



ఏరియా ఆసుపత్రికి చేరుకున్న అధికారులు, కార్మికులు

నేటి నుంచి నవోదయ క్లస్టర్ స్థాయి అథ్లెటిక్స్ పోటీలు

ముస్తాబైన క్రీడామైదానం

కాగజ్‌నగర్ : కుమురంభీం జిల్లా కాగజ్‌నగర్ జవహర్ నవోదయ విద్యాలయంలో సోమవారం, మంగళవారం రెండ్రోజుల పాటు క్లస్టర్ స్థాయి అథ్లెటిక్స్ అండ్ ఎగ్జిబిషన్ 2017-18 నిర్వహించనున్నారు. ఈ మేరకు విద్యాలయం ప్రిన్సిపల్ బి.చక్రపాణి, వ్యాయమ ఉపాధ్యాయులు మోహన్‌రావు, శైలజ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. రాష్ట్రంలోని పాత జిల్లాలైన కరీంనగర్, రంగారెడ్డి, నిజామాబాద్, మెదక్, మహబూబ్‌నగర్, వరంగల్, ఖమ్మం, నల్గొండ, ఆదిలాబాద్ జిల్లాలకు చెందిన విద్యాలయం అథ్లెటిక్స్ క్రీడాకారులు హాజరుకానున్నారు. పోటీల ప్రారంభోత్సవానికి జిల్లా పాలనాధికారి చంపాలాల్, ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి శ్రీనివాస్, లయన్స్ క్లబ్ జోనల్ ఛైర్మన్ డాక్టర్ శ్రీనివాస్, కాగజ్‌నగర్ డీఎస్పీ హబీబ్‌ఖాన్, తదితరులు హాజరవుతున్నట్లు ప్రిన్సిపల్ తెలిపారు. స్థానిక విద్యాలయంలో అథ్లెటిక్స్ మినహా మిగతా క్రీడల క్రీడాకారులు కరీంనగర్, మెదక్ విద్యాలయాల్లో జరిగే క్లస్టర్ స్థాయి పోటీలకు ఆదివారం బయలుదేరారు. రాష్ట్రంలోని ఇతర విద్యాలయంలోని అథ్లెటిక్స్ క్రీడాకారులు ఆదివారం సాయంత్రం వరకు కాగజ్‌నగర్ విద్యాలయానికి చేరుకున్నారు. ఇతర విద్యాలయాల నుంచి వచ్చిన విద్యార్థులకు విద్యాలయం సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

మద్యం దుకాణంలో దొంగలు

నిఘా కెమెరాలు ఉన్నా చోరీ

జైపూర్, న్యూస్‌టుడే: జైపూర్ మండలం ఇందారంలో గల వినాయక మద్యం దుకాణంలో శనివారం రాత్రి దొంగతనం జరిగింది. దుకాణం అమ్మకందారుడు తెలిపిన వివరాల ప్రకారం... శనివారం రాత్రి ఆయన దుకాణం మూసివేసి ఇంటికి వెళ్లారు. ఆదివారం ఉదయం దుకాణం తెరిచిచూసే సరికి పైకప్పు రేకులు తెరిచి ఉన్నాయి.. ఈ చోరీలో రూ.5 వేల విలువ గల చిల్లర నగదు, పలు మద్యం సీసాలు అపహరణకు గురయ్యాయి. దొంగకు సంబంధించిన కదలికలు దుకాణంలో ఏర్పాటు చేసిన నిఘా కెమెరాల్లో నిక్షిప్తం అయ్యాయి. ఈ సందర్భంగా నిర్వాహకుల ఫిర్యాదు మేరకు పోలీసులు దుకాణాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకున్నారు.



ధ్వంసం అయిన దుకాణం పైకప్పు

పురుగుల మందు ప్రభావంతో వ్యక్తి మృతి

ఇచ్చోడ, న్యూస్‌టుడే: మండలంలోని అడెగామ(కె) గ్రామంలో ఈ నెల 16న పత్తికి పురుగుల మందును పిచికారీ చేస్తుండగా గాలి గంగయ్య(40) తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. దీంతో ఆయనను ఇచ్చోడలోని ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడ నుంచి ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. అతడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉత్సాహంగా జిల్లాస్థాయి క్రీడా ఎంపిక పోటీలు

ఆదిలాబాద్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఆదివారం ఆదిలాబాద్‌లో ఉమ్మడి జిల్లాస్థాయి అండర్-14, 17 టెబుల్‌టెన్నిస్, జిల్లాస్థాయి అండర్-17 క్రికెట్ ఎంపిక పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ఈ ఎంపిక పోటీలకు విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించింది.

టెబుల్‌టెన్నిస్: స్థానిక ఆర్యభట్ట ఇంటర్‌నేషనల్ పాఠశాలలో జరిగిన ఉమ్మడి జిల్లాస్థాయి బాలబాలికల అండర్-14, 17 టెబుల్ టెన్నిస్ ఎంపిక పోటీలకు 60 మంది బాలబాలికలు హాజరయ్యారు. ప్రారంభోత్సవానికి గతంలో ఆదిలాబాద్‌లో పని చేసిన జిల్లా యువజన క్రీడల అధికారి ఎన్.సుధాకర్‌రావు, పెటా సంఘం జిల్లా అధ్యక్షుడు కోరెడ్డి పార్థసారథి హాజరై మాట్లాడారు. ఈ ఆటను తీవ్రంగా తీసుకోవాలని, మరింత సాధన చేసి జోనల్‌స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం ఉమ్మడి జిల్లా టెబుల్ టెన్నిస్ జట్టును ఎంపిక చేశారు. కార్యక్రమంలో జిల్లా పాఠశాల సమాఖ్య నిర్వాహక కార్యదర్శి జక్కుల శ్రీనివాస్, పెటా సంఘం జిల్లా కార్యదర్శి ఎన్.హరిచరణ్, పోటీల నిర్వాహకుడు రాష్ట్రపాల్, టెబుల్ టెన్నిస్ సంఘం జిల్లా కార్యదర్శి శ్రీవర్ధన్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు సాయికుమార్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.


జిల్లా బాలబాలికల జట్టు: అండర్-14 బాలురుల్లో ఓం, ప్రణీత్, నర్సింహా, సుశాంత్, ప్రీతం, బాలికల్లో రత్న అమృత, రాజేశ్వరీ, మౌనిక, స్నేహ, ప్రణస్వీలు ఆర్యభట్ట ఇంటర్‌నేషనల్ పాఠశాల ఆదిలాబాద్‌కు చెందినవారు. అండర్-17 బాలురుల్లో సాయి పటాస్కర్, అన్వేష్(లిటిల్‌ఫ్లవర్ ఉన్నత పాఠశాల ఆదిలాబాద్), ఓం.సాయి(మైనార్టీ గురుకులం గుడిహత్నూర్)

క్రికెట్: స్థానిక లిటిల్ ఫ్లవర్ ఉన్నత పాఠశాలలో బాలుర అండర్-17 క్రికెట్ జిల్లాస్థాయి ఎంపిక పోటీలకు 92 మంది విద్యార్థులు హాజరయ్యారు. బ్యాటింగ్, బౌలింగ్, ఫిల్డింగ్, కీపింగ్ తదితర అంశాల్లో ప్రతిభ కనబర్చిన వారిని ఎంపిక చేశారు. ప్రారంభోత్సవానికి ఒలింపిక్ సంఘం జిల్లా అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్‌రెడ్డి, పెటా సంఘం జిల్లా అధ్యక్షుడు కోరెడ్డి పార్థసారథి హాజరై మాట్లాడారు. క్రమశిక్షణ, పట్టుదల, నిత్య సాధనతో ఆటల్లో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని, ఈ గుణాలు అలవర్చుకొని జోనల్‌స్థాయిలో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య నిర్వాహక కార్యదర్శి జక్కుల శ్రీనివాస్, పోటీల నిర్వాహకుడు జయేంద్ర పటాస్కర్, వ్యాయామ ఉపాధ్యాయులు రాష్ట్రపాల్, సాయికుమార్, నిరటి విఠల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎంపికైన అడర్-14, 17 టెబుల్ టెన్నిస్ ఉమ్మడి జిల్లా జట్టు

జిల్లా జట్టు: పి.ఈశ్వర్. రెహాన్ (బంగారుగూడ మోడెల్ స్కూల్ ఆదిలాబాద్), తరుణ్, సిద్ధు(ప్రతిమ ఉన్నత పాఠశాల ఇంద్రవెల్లి), ఎం.రాజగౌతమ్(ఎం.ఎస్. ఆదిలాబాద్), తుషార్, రాజేశ్(ఆదర్శ పాఠశాల, జైనథ్), మనోజ్(అరుణోదయ స్కూల్ ఆదిలాబాద్), ఉజర్, పి.శ్రీనివాస్(లిటిల్‌ఫ్లవర్ పాఠశాల ఆదిలాబాద్), మణి(జడ్పీహెచ్ఎస్ మావల), ఎం.డి.ఖాషిఫ్(సన్‌షైన్ స్కూల్ ఉట్నూరు), అబ్బాస్‌ఖాన్(ఆదర్శ పాఠశాల, గుడిహత్నూర్), గజానంద్(జడ్పీహెచ్ఎస్ మన్నూరు), ఆర్.వెంకటసాయి(కేటీఎస్ ఆదిలాబాద్), రవికిరణ్(జడ్పీహెచ్ఎస్, దీపాయిగూడ. స్టాండ్‌బైలుగా హరిష్(జడ్పీహెచ్ఎస్ మన్నూరు), తబ్రేజ్(మోడెల్‌స్కూల్ జైనథ్), అతీఖ్(జడ్పీహెచ్ఎస్ మావల).



అండర్-17 క్రికెట్ బాలుర జట్టు

మనస్తాపంతో ఎంపీటీసీ సభ్యుని మృతి



హన్మంత్‌రావు మృతదేహం

సిర్పూర్(యు), న్యూస్‌టుడే : కట్టుకున్న భార్య మతిస్థిమితం కోల్పోయి తన ముందే పిచ్చిగా ప్రవర్తించడం చూడలేక మనస్తాపం చెందిన నేట్నూర్ ఎంపీటీసీ సభ్యుడు ఉర్వేత హన్మంత్‌రావు ఆదివారం తెల్లవారు జామున ఉరివేసుకొని మృతి చెందారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. హన్మంత్‌రావు భార్య వచ్చులబాయి మతిస్థిమితాన్ని కోల్పోయి కొన్ని రోజులుగా వింతగా ప్రవర్తిస్తోంది. భార్య పరిస్థితిని చూడలేక ఆయన తాగుడుకు బానిసయ్యాడు. ఈ నేపథ్యంలో ఆత్మహత్యకు పాల్పడ్డారు. విషయం తెలుసుకున్న పలువురు నాయకులు ఆయన కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిర్పూర్(యు) ఎస్ఐ రామారావు తెలిపారు.

కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటాం..

హన్మంత్‌రావు మృతి చెందటం చాలా బాధాకరమని జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ కనక యాదవ్‌రావు అన్నారు. తమతో కలిసి చురుగ్గా కార్యక్రమాల్లో పాల్గొనే ఒక మంచి మనిషిని కోల్పోయామన్నారు. ప్రభుత్వం తరపున కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామన్నారు. ఆయన వెంట నాయకులు భగవంత్‌రావు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు ఉన్నారు.

డివైడర్‌ను ఢీకొన్న ద్విచక్ర వాహనం

రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ మృతి

ఆదిలాబాద్ గ్రామీణం, నేరవిభాగం, ఉట్నూరు గ్రామీణం: మావల మండలంలోని జాతీయ రహదారిపై ఉన్న డివైడర్‌ను ద్విచక్ర వాహనం ఢీకొని రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ మృతి చెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. మావల ఎస్సై ఎల్.రాజు తెలిపిన వివరాల ప్రకారం... ఉట్నూర్ మండలం హస్నాపూర్ పంచాయతీ శంకర్‌నాయక్ తాండకు చెందిన రాఠోడ్ వసంత్‌రావు(48) రెండో పట్టణ పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. ప్రస్తుతం మావల పంచాయతీలోని సుభాష్‌నగర్‌లో నివాసం ఉంటున్నారు. కాగా శనివారం సాయంత్రం విధులు ముగించుకుని తన ద్విచక్రవాహనంపై ఒక్కడే స్వగ్రామంకు పని నిమిత్తం బయలుదేరారు. దేవాపూర్ చెక్‌పోస్టు సమీపంలో జాతీయ రహదారిపై ఉన్న డివైడర్‌ను ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఢీకొంది. ఈ ప్రమాదంలో వసంత్‌రావుకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు హుటాహుటీన రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాత్రి 11 గంటల ప్రాంతంలో మృతి చెందారు. అతడికి ఇద్దరు కుమారులు, కూతుళ్లు ఉన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.



వసంత్‌రావు మృతదేహం

పరామర్శించిన జిల్లా ఎస్పీ ఎం.శ్రీనివాస్

ప్రమాద సంఘటన గురించి తెలుసుకున్న పట్టణ సీఐ వి.సురేష్ జిల్లా ఎస్పీకి విషయాన్ని చరవాణిలో వివరించారు. వెంటనే స్పందించిన జిల్లా ఎస్పీ ఎం.శ్రీనివాస్ శనివారం రాత్రి రిమ్స్‌కు చేరుకోని మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతి చెందిన కానిస్టేబుల్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలుపుతూ వారి కుటుంబాన్ని అన్నివిధాలా ఆదుకుంటామని పేర్కొన్నారు. ఆదివారం అంత్యక్రియలలో జిల్లా పోలీస్ అసోషియేషన్ అధ్యక్షుడు పెంచాల వెంకటేశ్వర్లు, పోలీసులు శివాజీచౌహాన్, సత్యనారాయణ, అడెల్లు, తదితరులు పాల్గొన్నారు.



జవహర్ నవోదయ విద్యాలయం

క్రీడా రత్నాలు

- జాతీయస్థాయి పోటీల్లో రాణిస్తూ..
- చదువుల్లోనూ మేటిగా నిలుస్తూ..
- జవహర్ నవోదయ విద్యాలయ విద్యార్థుల ప్రతిభ

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే : గ్రామీణ ప్రాంతాలకు చెందిన నిరుపేద విద్యార్థులు. ప్రతిభ ఆధారంగా ఎంపికై విద్యాలయంలో చదువుకుంటున్నారు. అయితే చదువుతోపాటు వారు ఏ అంశాల్లో ప్రతిభ కనబరుస్తున్నారో గుర్తించి విద్యాలయం ఉపాధ్యాయులు తర్ఫీదు నివ్వడంతో చిరు దివ్వెలుగా వెలుగొందుతున్నారు. ఉమ్మడి జిల్లాలోనే ఏకైక విద్యాలయం కుమురం భీం జిల్లా కాగజ్‌నగర్‌లో ఉంది. సోమవారం, మంగళవారం స్థానిక విద్యాలయంలో 'క్లస్టరు స్థాయి అథ్లెటిక్స్ - ఎగ్జిబిషన్ 2017-18 నిర్వహించనున్నారు. విద్యాలయంలోని పలువురు విద్యార్థులు వివిధ క్రీడల్లో జాతీయస్థాయి పోటీల్లోనూ అత్యంత ప్రతిభ సాధించి జిల్లాకే పేరు ప్రతిష్ఠలు తెస్తున్నారు. ప్రస్తుతం క్లస్టర్ స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లోనూ పాల్గొని, విజయం సాధించేందుకు కసరత్తు చేస్తున్నారు. ఈ విద్యార్థులపై స్ఫూర్తిదాయక కథనం.


పరుగు పోటీల్లో పాల్గొనేందుకు విద్యార్థినుల తర్ఫీదు


పరుగుపై కసరత్తు చేస్తున్న విద్యార్థులు

70 శాతం గ్రామీణ ప్రాంతం

స్థానిక జవహర్ నవోదయ విద్యాలయంలో అత్యధిక శాతం గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులే. వివిధ క్రీడలపై ఆసక్తి ఉన్న విద్యార్థులను గుర్తించి ప్రతి రోజు సాధన చేయిస్తే క్రీడారత్నాలుగా తయారవుతున్నారు. ప్రతి రోజు సాయంత్రం విద్యాలయంలోని క్రీడా మైదానంలో వివిధ ఆటలపై ఉన్న క్రీడాకారులు సాధన చేస్తుంటారు.

అంతర్జాతీయంగా రాణించడమే లక్ష్యం..



కాగజ్‌నగర్ మండలం అందెవెల్లి నివాసి ఎ.కార్తీక్ స్థానిక విద్యాలయంలో 11వ తరగతి చదువుతున్నారు. చిన్నప్పటి నుంచే ఎ.కార్తీక్‌కు క్రీడలంటే అమితమైన ఇష్టం. విద్యాలయ వ్యాయమ ఉపాధ్యాయుల వద్ద తనకు ఇష్టమైన ఖోఖో ఆటపై మంచిపట్టు సాధించారు. 2014-15లో జాతీయస్థాయిలో కర్ణాటకలో జరిగిన ఖోఖో పోటీల్లో పాల్గొని, ఆలౌరౌండర్‌గా ప్రతిభ సాధించారు. 2016-17లో కర్ణాటకలో జరిగిన ప్రాంతీయ స్థాయి పోటీల్లో పాల్గొని రన్నర్‌గా నిలిచారు. ప్రస్తుతం స్థానిక విద్యాలయంలో జరగనున్న క్లస్టర్ స్థాయిలో 5 కిలోమీటర్ల, 1500 పరుగు పందెంలో పాల్గొననున్నాడు. అయితే క్లస్టర్ స్థాయిలోనూ ప్రతిభ సాధించి, అంతర్జాతీయ స్థాయి ఖోఖోలో స్థానం సాధించడమే తమ లక్ష్యమంటున్నాడు కార్తీక్.

ఎస్‌జీఎఫ్‌ఐలో ప్రతిభ

- మెంచు అనిల్, IIవ తరగతి, కుభీర్



కుభీర్ మండలం జామ్‌గాం గ్రామ నివాసి మెంచు అనిల్ స్థానిక విద్యాలయంలో 11వ తరగతి చదువుతున్నారు. చదువుతో పాటు, క్రీడల్లోనూ రాణిస్తున్నారు. 2014-15లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్‌జీఎఫ్‌ఐ)లో జాతీయస్థాయి పోటీలు కరీంనగర్‌లో జరిగాయి. అయితే ఖోఖో పోటీల్లో అల్‌రౌండరుగా ప్రతిభ సాధించి, ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. 2016-17లో కర్ణాటకలో జరిగిన జాతీయస్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొని విన్నర్‌గా నిలిచారు. ప్రస్తుతం విద్యాలయంలో జరగనున్న క్లస్టర్ స్థాయి పోటీల్లో 200, 400 మీటర్ల పరుగు పందెంలో పాల్గొనున్నారు. చదువుతోపాటు, క్రీడకల్లో రాణిస్తూ ఉన్నత స్థాయి ఉద్యోగమే తమ లక్ష్యమంటున్నారు.

క్రికెట్‌లో సత్తా చాటుతా..



మంచిర్యాల జిల్లా వేమన్‌పల్లి మండలం జక్కుపల్లి నివాసి పి.అనిల్‌కుమార్ స్థానిక విద్యాలయంలో 9వ తరగతి చదువుకుంటున్నారు. క్రికెట్ ఆట అంటే అమితమైన ఇష్టం. అయితే స్థానిక విద్యాలయం వ్యాయమ ఉపాధ్యాయుల వద్ద తర్ఫీదు తీసుకొని 2016-17లో వైజాగ్‌లో జరిగిన జాతీయస్థాయి క్రికెట్ పోటీల్లో పాల్గొని, అల్‌రౌండర్‌గా రాణించారు. ఇటూ బ్యాటింగ్, ఆటు బౌలింగ్‌లోనూ ప్రతిభ సాధించడంతో పలువురి నుంచి ప్రశంసలందున్నారు. ప్రస్తుతం అంతర్జాతీయస్థాయి పోటీల్లో చోటు కోసం కృషి చేస్తున్నారు. 200, 400 మీటర్ల పరుగుపందెంలో పాల్గొని, అవార్డు సాధించేందుకు కసరత్తు చేస్తున్నారు. అథ్లెటిక్‌తోపాటు, క్రికెట్‌లో అంతర్జాతీయస్థాయిలో ప్రతిభ సాధిస్తానంటూ ధీమా వ్యక్తం చేస్తున్నారు.

హ్యాండ్‌బాల్‌లో జాతీయస్థాయిలో పురస్కారం



ఆదిలాబాద్ నివాసి దుర్గాకార్తీక్ స్థానిక విద్యాలయంలో 8వ తరగతి చదువుతున్నారు. తనకు ఇష్టమైన హ్యాండ్‌బాల్ క్రీడపై విద్యాలయంలో ప్రత్యేక శిక్షణ తీసుకున్నాడు. గతేడాది హరియానాలో జరిగిన జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొని, పురస్కారం అందుకున్నాడు. హ్యాండ్‌బాల్‌లో మరింత తర్ఫీదు తీసుకొని, అంతర్జాతీయ స్థాయిలో రాణించేందుకు ఇప్పటి నుంచి కసరత్తు చేస్తున్నట్టు చెబుతున్నారు. ప్రస్తుతం విద్యాలయంలో క్లస్టర్ స్థాయి పోటీల్లో 400, 600 మీటర్ల పరుగు పందెంలో పాల్గొంటున్నారు.

పరుగుల 'నవ్య'



మంచిర్యాల జిల్లా జన్నారం మండలం నివాసి నవ్య స్థానిక విద్యాలయంలో 9వ తరగతి చదువుతున్నారు. చిన్నప్పటి నుంచి పరుగుపందెం ఆటపై మక్కువతో స్థానిక విద్యాలయంలో నిత్యం ఉదయం..సాయంత్రం క్రీడామైదానంలో కసరత్తు చేస్తున్నారు. గతేడాది చిత్తూరులో జరిగిన జాతీయస్థాయి 200, 400 మీటర్ల పరుగు పందెంలో పాల్గొని, పురస్కారం సాధించారు. అదే ఏడాది మెదక్‌లోనూ రీజనల్ స్థాయిలో 200 మీటర్ల పరుగుపందెంలో పాల్గొని, విజేతగా నిలిచారు. ప్రస్తుతం విద్యాలయంలో జరగనున్న క్లస్టర్ స్థాయి పోటీలో షాట్‌పుట్ క్రీడలో పాల్గొని, పురస్కారం సాధించేందుకు తర్ఫీదు తీసుకుంటున్నారు.

లాంగ్‌జంప్‌లో ప్రతిభ



ముథోల్ నివాసి మనీష స్థానిక విద్యాలయంలో 10వ తరగతి చదువుతున్నారు. చదువుతోపాటు, అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొని, పురస్కారాలు అందుకున్నారు. 2015-16 రంగారెడ్డిలో జరిగిన క్లస్టర్ స్థాయిలో 400 మీటర్ల బంగారు పతకం, లాంగ్‌జంప్‌లో ద్వితీయ స్థానం సాధించారు. గతేడాది నిజామాబాద్‌లో జరిగిన రీజనల్ స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో 400 మీటర్ల పరుగు పందెంలో వెండి పతకం, లాంగ్‌జంప్‌లో తృతీయస్థానం సాధించారు. ప్రస్తుతం 400, 200 పరుగుపెందెం, లాంగ్‌జంప్ పోటీల్లో పాల్గొంటున్నారు. ఈ పోటీల్లోనూ అవార్డులు సాధిస్తానంటున్నారు.

విద్యతో పాటు, క్రీడల్లోనూ రాణింపు

- బి.చక్రపాణి, ప్రిన్సిపల్

ఇక్కడి విద్యార్థులు విద్యతో పాటు, క్రీడల్లోనూ రాణిస్తున్నారు. విద్యార్థుల ఆసక్తిని బట్టి క్రీడల్లో తర్ఫీదునిస్తాం. రెండ్రోజుల పాటు స్థానిక విద్యాలయంలో క్లస్టరు స్థాయి అథ్లెటిక్స్ పోటీలు జరగనున్నాయి. మెదక్, కరీంనగర్ విద్యాలయాల్లోనూ క్లస్టర్ స్థాయి హ్యాండ్‌బాల్, ఇతర పోటీలు నిర్వహిస్తాం.

సాంకేతికతలో ప్రతిభ చాటిన పోలీసుకు ప్రోత్సాహకం

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : సాంకేతికతను వినియోగించుకోవడంలో ప్రతిభ చాటిన పోలీసుకు జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ ప్రోత్సాహకాలు అందజేశారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పంపిణీ చేశారు. జిల్లాలో సీసీటీఎన్ఎస్‌ను ప్రవేశ పెట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు దాని వినియోగం, నమోదు వంటి అంశాలను ఎస్పీ పరిశీలించారు. అందులో భాగంగా ఈజ్గాం పోలీస్ స్టేషన్ నుంచి బబ్బెర శేఖర్ కానిస్టేబుల్ దీనిని ఎక్కువగా వినియోగించుకోవడంతో ఆయనకు రూ.వెయ్యి నగదు ప్రోత్సాహాన్ని అందజేసి అభినందించారు. ప్రతి నెల ఈ సాంకేతిక వినియోగాన్ని పరిశీలిస్తామన్నారు. దీనిని ప్రతి పోలీస్ స్టేషన్‌లో సద్వినియోగం చేసుకుంటే కేసుల పురోగతికి అవకాశం ఏర్పడుతుందన్నారు. ప్రజలకు సేవలు సరళతరం అవుతాయన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ హబీబ్‌ఖాన్, జిల్లాలోని సీఐలు, ఎస్ఐలు, ఐటీకోర్ సిబ్బంది జే.శ్రీనివాస్, మానిక్‌రావు, రమేశ్, కార్యాలయం ఉన్నత శ్రేణి సహాయకుడు సూర్యకాంత్, యండీ.ఇంతియాజ్, పాస్‌పోర్ట్ కార్యాలయ అధికారి మురళి, ఫింగర్ ప్రింట్ విభాగం అధికారి ఏ.తిరుపతి, పీఆర్ఓ మనోహర్‌లు పాల్గొన్నారు.


నగదు పురస్కారం అందిస్తున్న ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్

మొక్కలను దత్తత తీసుకోవాలి

ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్ పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన తెలంగాణకు హరితహారం కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ మొక్కలను దత్తత తీసుకోవాలని ఎమ్మెల్యే కోవలక్ష్మి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని అంకుసాపూర్ గ్రామ శివారులోని మినీ శ్మశాన వాటికలో హరితహారంలో భాగంగా ఎంపీపీ తారాబాయి, గ్రామ సర్పంచి కపూరీబాయితో కలిసి ఎమ్మెల్యే 200 మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చెట్లు భావితరాలకు మెట్లన్నారు. చెట్లు లేకపోతే జీవకోటి మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటడంతో భాగస్వాములై పచ్చదనాన్ని నింపి పర్యావరణాన్ని కాపాడుకుందామని పిలుపునిచ్చారు. మొక్కలు నాటడమే కాకుండా వారి సంరక్షణ కూడా చేపట్టాలని సూచించారు. మినీ శ్మశానవాటికలో నీటి వసతి కోసం చేతి పంపు ఏర్పాటు చేసి చుట్టు ప్రహరీ నిర్మిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు రేగుంట కేశవరావ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో సింగిల్‌విండో ఛైర్మన్ అలీ బిన్ అహ్మద్, నాయకులు ఇందులాల్, రాంచందర్, యశోద, శంకర్, మోతిలాల్, సుశీల, కళావతి, చిన్నక్క, బీమయ్య, రాధ తదితరులు పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే కోవలక్ష్మి, ఎంపీపీ తారాబాయి, తదితరులు

ఆసిఫాబాద్

ఘనంగా రాజీవ్‌గాంధీ జయంతి

తిర్యాణి, న్యూస్‌టుడే: మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతిని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు రాజీవ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దేశానికి రాజీవ్‌గాంధీ చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సింగిల్‌విండో అధ్యక్షుడు చుంచు శ్రీనివాస్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంకం గౌరయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటేశం, నాయకులు బాపు, బ్రహ్మం, వెంటేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



అనార్‌పల్లిలో శివలింగం ప్రతిష్ఠాపన చేస్తున్న పురోహితుడు, గ్రామస్థులు

వైభవంగా శివలింగం ప్రతిష్ఠాపన

కెరమెరి, న్యూస్‌టుడే: మండలంలోని అనార్‌పల్లిలో ఆదివారం వైభవంగా శివలింగం ప్రతిష్ఠాపన కార్యక్రమం జరిగింది. పూరోహితులు వేద మంత్రాల మధ్య ప్రత్యేక పూజలు చేస్తూ విగ్రహ ప్రతిష్ఠాపన చేశారు. దంపతులు హోమాలు నిర్వహించారు. భక్తులు భక్తి శ్రద్ధలతో మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఉప ఎంపీపీ గోవింద్‌నాయక్ శివలింగానికి దాతగా ఉన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు గోపానాయక్, వెంకట్‌రాం, బలరాం, లాల్‌సింగ్, హరిలాల్, వస్త్రాం, రాందాష్, పూజారి కిషన్, తదితరులు పాల్గొన్నారు.

24 లోపు దరఖాస్తులు చేసుకోవాలి

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే: జిల్లాలోని కస్తూర్బాతో పాటు జిల్లా కేంద్రంలోని పట్టణ గురుకులంలో ఖాళీగా ఉన్న సీట్ల కోసం ఈ నెల 24 లోపు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా విద్యాధికారి ఎం.ఎ. రఫీక్ పేర్కొన్నారు. తెలుగు మాధ్యమంలో కొనసాగుతున్న 12 మండలాల్లోని పాత కస్తూర్బాల్లో 6 నుంచి 10వ తరగతి వరకు, నూతన మండలాలు చింతలమానెపల్లి, పెంచికల్‌పేట, లింగాపూర్‌లలోని ఆంగ్లమాధ్యమాల్లో 6, 7వ తరగతుల్లో, పట్టణ గురుకులం తెలుగు మాధ్యమంలో 6, 7 తరగతుల్లో సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఆసక్తి, అర్హులైన విద్యార్థులు గడువులోగా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. మధ్యలో బడి మానేసిన, నిరుపేద పిల్లలకు మొదటి ప్రాధాన్యం ఉంటుందన్నారు.

ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

ఆసిఫాబాద్ పట్టణం, న్యూస్‌టుడే : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని పట్టణానికి చెందిన ఆర్యవైశ్యులు పేర్కొన్నారు. ఆదివారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల అభివృద్ధి కోసం పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఆర్యవైశ్యులను మాత్రం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్య వైశ్యుల్లో నిరుపేదలు ఉన్నారని వారి సంక్షేమం కోసం కొత్తగా కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఏటా రూ. వెయ్యి కోట్లు కేటాయించాలని కోరారు. సమావేశంలో స్థానిక ఆర్యవైశ్యులు జగదీష్, ప్రమోద్, వేణుగోపాల్, శ్రీనివాస్, రవీందర్, సంతోష్, సతీశ్, ప్రదీప్ తదితరులు ఉన్నారు.

భాజపాలోకి పలువురి చేరిక

ఆసిఫాబాద్ పట్టణం, న్యూస్‌టుడే : వివిధ పార్టీల నుంచి, కుల సంఘాల నుంచి పలువురు భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుడు ఖాండ్రే విశాల్ సమక్షంలో ఆ పార్టీలో చేరారు. ఆదివారం మండల పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పట్టణంలోని బజారువాడీకి చెందిన మైనార్టీ నాయకులు, వివిధ సంఘాల నాయకులకు పార్టీ అధ్యక్షుడు కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పలు సంక్షేమ పథకాలకు ఆకర్షితులై స్వచ్ఛందంగా పార్టీలో చేరుతున్నారన్నారు. 2019 విజయమే లక్ష్యంగా భాజపా ముందుకు సాగుతుందన్నారు. కార్యక్రమంలో ఆసిఫాబాద్ మండల ఇన్‌ఛార్జి సాయికృష్ణ, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి నిర్మల, ఉపాధ్యక్షుడు గణపతి, కార్యదర్శులు రాజన్న, మొండన్న, పట్టణ అధ్యక్షుడు రాజు, బీజేవైఎం మండల అధ్యక్షుడు రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎన్ఐఓఎస్ పరీక్ష

రెబ్బెన, న్యూస్‌టుడే : రెబ్బెన మండలంలోని 12 సాక్షర భారత్ వయోజన విద్య కేంద్రాల్లో ఆదివారం నిర్వహించిన జాతీయ సార్వత్రిక పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఇందులో అమ్మనాన్నకు చదువు, సాక్షర భారత్ కేంద్రాల్లో అక్షరాలు నేర్చుకున్న వారితో పాటు ఉపాధి హామీ, ఐకేపీ, మధ్యలో చదువు మానేసిన వారు పరీక్షకు హాజరయ్యారు. మొత్తం 186 మంది పరీక్షకు హాజరైనట్లు సాక్షర భారత్ సమన్వయకర్త గందార్ల సాయిబాబా తెలిపారు. నంబాలలో సాక్షర భారత్ కేంద్రాన్ని ఎంఈవో వెంకటేశ్వర స్వామి, తక్కళ్లపల్లిలో ఈవోపీఆర్డీ, మిగిత కేంద్రాల్లో కార్యదర్శులు పరిశీలించారు. ఈ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు గ్రేడ్ల వారీగా ధ్రువీకరణ పత్రాలు అందజేస్తామని సాయిబాబా తెలిపారు.



గోలేటిలో పరీక్ష రాస్తున్న వయోజనులు

సజావుగా జాతీయ సార్వత్రిక పరీక్ష

ఆసిఫాబాద్: జిల్లాలో వయోజనుల కోసం నిర్వహించిన జాతీయ సార్వత్రిక పరీక్ష సజావుగా సాగింది. జిల్లాలోని 173 గ్రామ పంచాయతీల్లో 3 వేల మంది వయోజనులు పరీక్ష రాయాల్సిన లక్ష్యం నిర్దేశించారు. కానీ ఆదివారం జరిగిన పరీక్షలో ఎంత మంది హాజరయ్యారో జిల్లా అధికారుల వద్ద సమాచారం లేకపోవడం పరీక్ష నిర్వహణ తీరుపై వారి చిత్తశుద్ధి స్పష్టం అవుతుంది. ఆసిఫాబాద్ మండలంలో మాత్రం 14 పంచాయతీల్లో 240 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 228 మంది పరీక్ష రాశారు. మండలంలోని కొన్ని పరీక్ష కేంద్రాలను రాష్ట్ర పరిశీలకులు సురేందర్, శ్యామల, ఏపీఓ శ్రీనివాస్‌రెడ్డి, మండల సమన్వయకర్త ప్రతాప్ కుమార్‌లు పరిశీలించారు.



నంబాల పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో వెంకటేశ్వరస్వామి

ఎన్ఐఓఎస్ పరీక్ష

తిర్యాణి : మండలంలో జాతీయ సార్వత్రిక విద్య పరీక్ష ఆదివారం 13 పరీక్ష కేంద్రాల్లో జరిగాయి ఇందులో భాగంగా 198 మంది అభ్యాసకులు పరీక్షకు హాజరైనట్లు మండల సాక్షర భారత్ మండల సమన్వయకర్త రమేశ్‌బాబు తెలిపారు. వారికి గ్రేడ్‌ల వారీగా ధ్రువీకరణ పత్రాలు అందజేస్తామని ఆయన పేర్కొన్నారు.

ఆదర్శ కళాశాలలో ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నార్నూర్, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల - కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరడానికి విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ చిన్నప్పరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఎంపీసీలో రెండు సీట్లు, ఎంఈసీలో 40 సీట్లు, సీఈసీలో 40 సీట్లు ఖాళీగా ఉన్నాయని ఆయన అన్నారు. పదో తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ నెల 23 వరకు తమ ధ్రువీకరణ పత్రాలతో పాఠశాల కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించుకోవాలి

జైనూరు, న్యూస్‌టుడే : అన్ని కులాలు, మతాల వారు సోదరభావంతో గణేష్, బక్రీద్ ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలని సీఐ నాగేంద్ర పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని సీఐ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన శాంతి కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కులమతాలకతీతంగా ఎవరి మనోభావాలు దెబ్బతినకుండా పండుగలను నిర్వహించి శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా బాధ్యత వహించాలన్నారు. ఉత్సవాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. గణేష్ మండపాల నిర్వాహకులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని సూచించారు. త్వరలో విధివిధానాలు రూపొందించి మండపాల నిర్వాహకులతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తామని నిబంధనలు ఉల్లంఘిస్తే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ జాదవ్‌ం రాంధన్, వైస్ ఎంపీపీ షేక్ రశీద్, గ్రామ పెద్దలు కొడప హాన్నుపటేల్, మాజీ ఎంపీపీ కొడప ధర్మరావు, జుగాదిరావు, ఎంపీటీసీ సభ్యుడు లక్యానాయక్, ఫాజిల్, సయ్యాద్ అబ్బుతాలీబ్, చాంద్, ఆసన్, ముత్యప్‌వార్ రమేశ్, మున్నా, గోపాల్, ఉత్తం, బుట్టోఖాన్, సుబుర్‌ఖాన్, అక్తర్, అసద్‌ఆలీ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ నాగేంద్ర



సమావేశంలో పాల్గొన్న గ్రామపెద్దలు

26న కవి సమ్మేళనం

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : ఆచార్య జయశంకర్, కాళోజీల జయంతి పురస్కరించుకొని తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ఈ నెల 26న సాయంత్రం 4.00 గంటలకు డా. రాజేంద్రప్రసాద్ బీఈడీ కళాశాలలో నిర్వహించే కవి సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని జాగృతి జిల్లా కన్వీనర్ పర్శ చంద్రశేఖర్ కోరారు. ఆదివారం స్థానికంగా నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కవిత నేతృత్వంలో కవి సమ్మేళనం నిర్వహించబోతున్నట్లు పేర్కొన్నారు. తెలంగాణం(ఊరు, బాల్యం, జీవన విధానం, వృత్తులు, భాష, సంస్కృతి, కళలు, ప్రకృతి వంటి) కవితాంశం ఉండాలన్నారు. తెలుగు భాషలోనే కవితలు రాయాలన్నారు. కవిత శుద్ధప్రతిని సమర్పించాలని, దానిపై ఒక పాస్‌పోర్టు సైజు ఫొటో అతికించి చిరునామా రాయాలన్నారు. కవిత ఒక పేజీకి మించరాదన్నారు. వచనకవిత, గేయం, పద్యం కవితా పఠనం మూడు నిమిషాలకు మించరాదన్నారు. జిల్లాలో ఆసక్తిగల కవులు సమ్మేళనంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ నెల 24 లోపు పూర్తి వివరాలతో చరవాణి నెం 97015 54070 లో సంప్రదించాలన్నారు. ఎస్ఎంఎస్ ద్వారా కూడా పేర్లు నమోదు చేసుకోవచ్చన్నారు. సమావేశంలో విద్యార్థి విభాగం నియోజకవర్గ కన్వీనర్ తణుకు సాయిశ్రావన్, సభ్యులు మనీష్, రవి, నవీన్, సమీర్, కార్తీక్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చంద్రశేఖర్



మాట్లాడుతున్న లక్ష్మణ్

అక్రమ డిప్యూటేషన్‌లు రద్దు చేయాలి

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : గిరిజన సంక్షేమ శాఖలో చేపట్టిన అక్రమ డిప్యూటేషన్‌లను రద్దు చేయాలని ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తలండి లక్ష్మణ్ డిమాండు చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని రాయిసెంటర్‌లో నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. గిరిజన సంక్షేమ శాఖలో కొందరు అధికారులు అక్రమ డిప్యూటేషన్‌లను ప్రోత్సహిస్తున్నారన్నారు. వీటిని వెంటనే రద్దు చేసి అక్రమ డిప్యూటేషన్‌లను ఇచ్చిన అధికారులను సస్పెండ్ చేయాలన్నారు. ఐటీడీఏలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను ఆదివాసీ అభ్యర్థులతో వెంటనే భర్తీ చేయాలన్నారు. ఏజెన్సీ ప్రాంతాలలో జీఓ నెం.03 అనుసరించి ఉద్యోగాలు భర్తీ చేయాలన్నారు. 2004 నుంచి నియామకమైన ఉద్యోగులకు వర్తింప చేస్తున్న సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పింఛను విధానం అమలు చేయాలన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్నాక వెంకట్‌రావు, సభ్యులు ఆత్రం భగవంతరావు, రాజరాం, సెడ్మెకి వెంకటేశ్, కొట్నాక సుధాకర్, దేవ్‌రావు, దాదాజీ, రాజేశ్వర్, తిరుపతి, పార్వతి, రమేశ్, జంగు, జగన్నాథ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బా విద్యాలయంలో ప్రవేశాల కోసం దరఖాస్తులు చేసుకోవాలి

సిర్పూర్(యు) న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలో 6, 7, 8, 9వ తరగతులలో మొత్తం 40 సీట్లు ఖాళీగా ఉన్నాయని పాఠశాల ఎస్‌వో అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన వారు పాఠశాలలో దరఖాస్తులు అందించాలన్నారు. లింగాపూర్ మండల కేంద్రంలోని కస్తూర్బా విద్యాలయంలో 8, 9 తరగతులలో కూడా సీట్లు ఖాళీగా ఉన్నందున్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని బడి మధ్యలో మానేసిన, తల్లితండ్రులు లేని పిల్లలను పాఠశాలలో చేర్పించాలని కోరారు.

ఆసిఫాబాద్

22న రుణాల కోసం ముఖాముఖి

తిర్యాణి, న్యూస్‌టుడే : మండలంలోని ఎస్సీ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న నిరుద్యోగ యువతకు ఈ నెల 22న ఆయా గ్రామపంచాయతీ కార్యాలయాల్లో ముఖాముఖి(ఇంటార్వ్యూ) నిర్వహించనున్నట్లు ఇన్‌ఛార్జి ఎంపీడీఓ రఫీక్ అహ్మద్ తెలపారు. తిర్యాణి తెలంగాణ బ్యాంకు పరిధిలో 5 యూనిట్లు మంజూరైనట్లు పేర్కొన్నారు. సూంగపూర్, గడలపల్లి, తిర్యాణి, గంభీరావుపేట గ్రామపంచాయతీ కార్యాలయంలో ముఖాముఖి ఉంటుందని, సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని సూచించారు.

భారీ వర్షం..

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : కుమురం భీం జిల్లాలో శనివారం రాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు భారీ వర్షం కురిసింది. ఎన్నాళ్లుగానో ఎదురు చూస్తున్న రైతులకు ఈ వర్షం కాస్త ఊరటనిచ్చింది. జిల్లా వ్యాప్తంగా 387.6 మి.మీ వర్షపాతం నమోదైంది. అత్యధికంగా ఆసిఫాబాద్ మండలంలో 90.2 మి.మీ. నమోదు కాగా అత్యల్పంగా తిర్యాణిలో 9.4 మి.మీ. నమోదైంది. జైనూర్‌లో 37.6 మి.మీ. సిర్పూర్(యు)లో 20.8 మి.మీ. రెబ్బెనలో 9.8 మి.మీ. కెరమెరిలో 35.2 మి.మీ. వాంకిడిలో 25 మి.మీ. కాగజ్‌నగర్‌లో 20.2 మి.మీ. సిర్పూర్(టి)లో 21.2 మి.మీ. కౌటాలలో 30.4 మి.మీ. బెజ్జూర్‌లో 31 మి.మీ. దహెగాంలో 56.8 మి.మీ. వర్షపాతం నమోదైంది.

మండల కేంద్రంలోని పలు కాలనీలు జలమయం

మండలంలో శనివారం రాత్రి నుంచి కురిసిన భారీ వర్షంతో పలు కాలనీలు జలమయంగా మారాయి. పట్టణంలోని కంఠకాలనీ, హడ్కో కాలనీలోని పలు లోతట్టు ప్రాంతాల్లో, ఇళ్లలోకి నీరు చేరి తీవ్ర ఇబ్బందులకు గురిచేసింది. కొందరి ఇళ్లలో వర్షపు నీరు చేరడంతో వస్తువులు తడిచిపోయాయి. రోడ్లపై నీరు చేరి చెరువుల్ని తలపించాయి. మురుగు కాలువ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో నీరంతా రోడ్లపై, ఇండ్ల మధ్యలో చేరినట్లు కాలనీవాసులు చెబుతున్నారు. ఇవే కాకుండా టీఆర్ నగర్, సందీప్‌నగర్, చెక్‌పోస్టు కాలనీల్లో పలు చోట్ల రోడ్లపై భారీగా వర్షపు నీరు చేరి ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేసింది.



కంఠకాలనీలో చేరిన వరద నీరు



చెరువును తలపిస్తున్న పట్టణంలోని జడ్పీఎస్ఎస్ ఉన్నత పాఠశాల ప్రాంగణం



పైకాజినగర్‌లో వర్షం నీరు

నీట మునిగింది..

ఆసిఫాబాద్ పట్టణం: ఎన్నో ప్రత్యేకతలు ఉన్న పట్టణంలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ఏ మాత్రం చిన్న వర్షం వచ్చినా పాఠశాల ఆవరణ చెరువును తలపిస్తుంది. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బురదలోంచి నడిచి తరగతి గదుల్లోకి రావడంతో గదులు బురదమయంగా తయారవుతున్నాయి. పాఠశాల ప్రాంగణాన్ని మట్టితో లోతట్టుగా ఉన్న ప్రాంతం ఎత్తు పెంచి వర్షపు నీరు బయటకు వెళ్లేందుకు చిన్న కాలువ కడితే విద్యార్థులకు సౌకర్యంగా ఉంటుంది. ఒక్కసారి వర్షం వస్తే దాదాపు వారం రోజుల పాటు నీరు నిలుస్తోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు పాఠశాలపై ప్రత్యేక చొరవ చూపి చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు.

నేడు మున్నూరు కాపు సంఘం సమావేశం

రెబ్బెన, న్యూస్‌టుడే : రెబ్బెన మండలం గోలేటిలోని వారసంత ఆవరణలో సోమవారం సాయంత్రం 4 గంటలకు గోలేటి గ్రామ మున్నూరు కాపు సంఘం సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం ఉపాధ్యక్షుడు కొండు సత్తయ్య, ప్రచార కార్యదర్శి గంగిశెట్టి శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా పాత కమిటీ రద్దు అయినందున మళ్లీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరుగుతుందన్నారు. గోలేటి గ్రామ పంచాయతీ పరిధిలోని సంఘం కులస్థులందరూ సకాలంలో హాజరుకావాలని కోరారు.



ప్రాణాయామం చేస్తున్న విద్యార్థులు

ముగిసిన యోగా శిబిరం

వాంకిడి, న్యూస్‌టుడే : మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో నిర్వహిస్తున్న యోగా శిబిరం ఆదివారంతో ముగిసింది. పతాంజలి యోగా ప్రచారక్ డొడ్డాజీ మాట్లాడుతూ మూడు రోజులుగా శిబిరంలో నేర్చుకున్న యోగాసనాలు, ప్రాణాయామం, సూర్య నమస్కారాలు, కపాలబాత్ నిత్యం సాధన చేయాలని సూచించారు. తద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చన్నారు. విద్యార్థి దశలోనే ఆసనాలు సాధనం చేయడం సులభంగా ఉంటుందన్నారు. ప్రాణాయామం చేయడం మూలంగా మానసికంగా ప్రశాంతతో పాటు, జ్ఞాపకశక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో వసతిగృహ వార్డెన్ తిరుపతి, విద్యార్థులు పాల్గొన్నారు.



రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

రోగులకు పండ్ల పంపిణీ

వాంకిడి, న్యూస్‌టుడే : మాజీ ప్రధాన మంత్రి దివంగత రాజీవ్ గాంధీ 73వ జయంతిని ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు గుర్నులే నారాయణ, నాయకులు షఫీక్, అన్సార్, సమీర్, తదితరులు పాల్గొన్నారు.

నవరాత్రులను శాంతియుతంగా నిర్వహించాలి

వాంకిడి, న్యూస్‌టుడే : గణేశ్ నవరాత్రి ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించాలని సీఐ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో గణేశ్ మండళ్ల నిర్వాహకులతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నవరాత్రులు అయిపోయే వరకు నిర్వాహకులు ప్రతి రోజు రాత్రి మండపాల వద్ద నిద్రించాలన్నారు. ఇతరులకు ఇబ్బంది కలగకుండా ఉదయం, సాయంత్రం నిర్ణయించిన వేళల్లోనే భక్తి పాటలు వేయాలన్నారు. మూడు ఫీట్ల కన్నా ఎక్కువ విగ్రహాలు పెడితే అనుమతి తీసుకోవాలన్నారు.



శాంతి కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాస్



శిథిలావస్థకు చేరిన ఇంధాని పంచాయతీ భవనం

అది అలా.. ఇది ఇలా

వాంకిడి, న్యూస్‌టుడే : మండలంలోని ఇంధాని గ్రామ పంచాయతీ భవనం శిథిలావస్థకు చేరుకొని నిర్వహణకు ఆటంకంగా మారింది. కూలిన గోడలు, పైకప్పు వర్షం వస్తే చాలు భవనంలో ఉండలేని స్థితి. కార్యాలయ దస్త్రాలకు భద్రత లేకపోగా, సమావేశాలు, కార్యాలయ నిర్వహణకు ఇబ్బందిగా మారింది. ఇదిలా ఉండగా పక్కనే 2010లో నూతన భవనం నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరు అయ్యాయి. సదరు గుత్తేదారు లెంటల్ లెవల్ వరకు నిర్మించి వదిలేశాడు. ఉన్నతాధికారులు ఎవరు పట్టించుకోక పోవటంతో నిర్మాణ దశను వీడడం లేదు. దీంతో పాతది శిథిలావస్థకు చేరుకుని, నూతన భవనం పూర్తికాక గ్రామపంచాయతీ నిర్వహణకు ఇబ్బందులు తప్పడం లేదు.



ఏడేళ్లుగా అసంపూర్తిగా నూతన భవనం

చెలిమల వాగు ఆయకట్టు కింద వరినాట్లు

తిర్యాణి, న్యూస్‌టుడే : మండలంలోని చెలిమల వాగు ప్రాజెక్టు(ఎన్టీఆర్ సాగర్) ఆయకట్టు రైతులు వరినాట్లు ప్రారంభించారు. ప్రస్తుతం గంభీరావుపేట, గంగాపూర్, చెలిమల, చింతపల్లి, ఇర్కపల్లి తదితర గ్రామాల రైతులు వరినాటు పనుల్లో నిమగ్నమయ్యారు. ఈ ప్రాంతంలో ఒక్క భారీ వర్షం కూడా కురువలేదు. చిన్నపాటి వర్షాలే తప్ప చెలిమల వాగు ప్రాజెక్టు వరద నీరు వచ్చేంత వర్షాలు కురవలేదు. చెలిమల వాగు ప్రాజెక్టు నీటి సామర్థ్యం 322.20 మీటర్లు కాగా, 326.30 మీటర్లు నీటి మట్టం వస్తే మత్తడి నుంచి నీరు దొర్లుతాయి. ప్రస్తుతం 322.25 మీటర్ల మాత్రమే నీరు వచ్చి చేరింది. గత మూడు రోజులుగా చిన్నపాటి వర్షాలే కురిశాయి. ఆయకట్టు రైతులు వర్షాలు పడితాయనే నమ్మకంతో ఆయకట్టు రైతులు వరినాట్లు వేస్తున్నారు. రైతుల ప్రస్తుత పరిస్థితి ముందు నుయ్యి.... వెనుక గొయ్యిగా మారింది. రైతులు వరినారు మళ్లు తయారు చేసుకోగా అప్పటి ఎండలకు నారు మాడిపోయింది. ప్రస్తుతం ఎకరం కోసం వరినారు తయారు చేస్తే, అర ఎకరం కూడా నారు సరిపోవడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు.



చెలిమల వాగు ఆయకట్టు కింద ట్రాక్టర్ విల్స్‌తో నాటుకు సిద్ధం చేస్తున్న రైతన్న

పొలాల అమావాస్య పూజలకు సిద్ధమైన బసవన్నలు

నార్నూర్, న్యూస్‌టుడే : పొలాల అమావాస్యకు నార్నూర్, గాదిగూడ మండలాల రైతులు తమ ఎద్దులను అందంగా అలంకరించారు. సోమవారం ఉదయం తమ ఎద్దులను వాగుల వద్దకు తీసుకొని పోయి వాటికి స్నానాలు చేయించారు. దినమంతా ఎద్దులను అలంకరించారు. సాయంత్రం పూట ఎద్దులకు ప్రత్యేక పూజలు నిర్వహించి వాటికి నైవేద్యాలను తినిపిస్తారు. సోమవారం సాయంత్రం పొలాల అమావాస్య పండుగ సందర్భంగా ఎద్దులను అంజనేయస్వామి మందిరానికి తీసుకొని వెళ్లి ప్రదక్షిణలు చేస్తారు. అనంతరం రైతులు తమ ఎద్దులను ఇతర రైతుల ఇంట్లోకి తీసుకొని వెళ్తారు. వారు ప్రత్యేకంగా పూజలు చేసి నైవేద్యాలను తినిపిస్తారు. రైతులకు ఇనాం రూపంలో నగదు ఇస్తారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ రాఠోడ్ రమేశ్ తమ సొంతూరు అయిన తాడిహత్నూర్ గ్రామంలో ఆదివారం తమ ఎద్దులను అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.



తాడిహత్నూర్‌లో అలంకరించిన తమ ఎద్దుల జతతో మాజీ ఎంపీ రాఠోడ్ రమేశ్

చేతిపంపునకు ప్లాట్‌ఫాం నిర్మాణం

తిర్యాణి, న్యూస్‌టుడే: తిర్యాణి గ్రామ పంచాయతీ చింతపల్లిలోని చేతి పంపు వద్ద ప్లాట్‌ఫాం గ్రామ పంచాయతీ అధికారులు నూతనంగా నిర్మించారు. జూన్ 18న ఈనాడులో మినిలో ప్రచురితమైన 'దిమ్మె శిథిలం....నీరు కలుషితం' కథనానికి గ్రామ పంచాయతీ అధికారులు స్పందించారు. నూతనంగా ప్లాట్‌ఫాం నిర్మించారు. మిషన్ భగీరథ పైప్‌లైన్ కోసం తవ్విన కాలువలో వర్షం నీరు నిలిచి చేతిపంపులోకి చేరి కలుషితమయ్యే ప్రమాదం ఉండేది. చేతి పంపును అనుకొనే పెద్ద గుంత ఉండేది. వాటిని తొలగించి చుట్టూ మొరం పోసి, వర్షానికి కొట్టుకపోకుండా ఖాళీ సంచుల్లో ఇసుక నింపి చుట్టూ పేర్చారు.

ఈనాడుకు వందనం



చేతిపంపు వద్ద నూతనంగా నిర్మించిన ప్లాట్‌ఫాం ఇదే..

గిరిజనులకు సేవ చేయడంలో సంతృప్తి

- వాసవీక్లబ్ అంతర్జాతీయ అధ్యక్షుడు అతికేశవన్

ఆసిఫాబాద్ అర్బన్, న్యూస్‌టుడే : కుమురం భీం జిల్లాలోని షేకన్‌గొందిలాంటి మారుమూల గిరిజన గూడేల వారికి సేవ చేయడంలోనే సార్థకత ఉందని వాసవిక్లబ్ అంతర్జాతీయ అధ్యక్షులు తమిళనాడుకు చెందిన సౌభాగ్యం వి.అతికేశవన్ పేర్కొన్నారు. ఆదివారం జిల్లాలోని మారుమూల గిరిజన గ్రామం షాకన్‌గొంది గ్రామంలో వాసవీక్లబ్ వారు నిర్వహించిన సేవా కార్యక్రమంలో ఆయన పాల్గొని అక్కడి గిరిజనులతో ఆడిపాడారు. వారికి వస్త్రాలు, విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. గ్రామస్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన వాసవీక్లబ్ సేవల్ని ఇలాంటి మారుమూల గిరిజన గ్రామాలకు విస్తరించాలని సూచించారు. తన పదవీ కాలంలో 350 వాసవీ క్లబ్‌లను సందర్శించాననని తెలుపుతూ ఇంతటి సేవానుభూతి ఎక్కడా కలుగలేదని ఉద్వేగభరితంగా తెలిపారు. ఇక్కడి గిరిజనులకు శాశ్వత పథకం కింద తాగునీటి వసతి కోసం చేతిపంపును క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసేందుకు నిధులను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. గ్రామస్థులు ఆయనను గుస్సాడీ నృత్యాలతో, ప్రేమానురాగాలతో స్వాగతం పలికిన తీరుకు ఆయన ముగ్ధుడయ్యారు. ఈ కార్యక్రమంలో వాసవీ క్లబ్ గవర్నర్ ముక్త శ్రీనివాస్, డిప్యూటీ గవర్నర్ వేణుగోపాల్, ఇంటర్నేషనల్ క్లబ్ మెంబర్ రేణికుంట్ల శ్రీనివాస్, కటకం హరీష్, జోన్ ఛైర్‌పర్సన్ గుండ ప్రమోద్, క్యాబినెట్ ట్రెజరర్ ఎకిరాల శ్రీనివాస్, చార్టర్ ప్రెసిడెంట్ వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షులు గంధం శ్రీనివాస్, ఆసిఫాబాద్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ముక్త విలాస్, కొడిపాక రవీందర్, కోశాధికారి గుండ సతీష్, క్లబ్ ప్రముఖులు రావుల మురళీధర్, వెంకటేశ్వర్, ముప్పశేఖర్, పిన్నవివేక్, గుండ సంతోష్, గ్రామ సర్పంచి తిరుపతి, సింగల్ విండో అధ్యక్షులు అలీబిన్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.



గిరిజనులకు దుస్తులు పంపిణీ చేస్తున్న అతికేశవన్, ఇతర ప్రతినిధులు


అతికేశవన్‌కు పూలమాలలు వేసి స్వాతగం పలుకుతున్న గిరిజనులు

పేదలకు మెరుగైన వైద్యం

- పాలనాధికారి చంపాలాల్

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : సామాజిక బాధ్యతతో వైద్య శిబిరం నిర్వహించడంతో పేదలకు మెరుగైన వైద్య సేవలు అందే వీలు కలుగుతుందని పాలనాధికారి చంపాలాల్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ముస్లిం మైనారిటీ ఫంక్షన్ హాల్లో డా.సంగీత పాండురంగ్ నాయక్ మెమోరియల్ సొసైటీ సహకారంతో సేవ్ హ్యాండ్స్ సోషల్ ఆర్గనైజేషన్, లెక్కల కృష్ణారెడ్డి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరంలో పాల్గొని మాట్లాడారు. వైద్య శిబిరాలే కాకుండా పేదలకు అవసరమైన ఇతరాత్ర వాటిపై కూడా దృష్టి సారించి సేవలందించాలన్నారు. అత్యధిక సమస్యలున్న ప్రాంతాల్లో ఏర్పాటు చేసేలా చూడాలన్నారు. ఉచిత వైద్యంతో పాటు మందులు పంపిణీ చేసే వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సామాజిక సేవలో సంఘాలు మరింత ముందుకు రావాలన్నారు. ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ మాట్లాడుతూ జిల్లాగా ఏర్పడినా ఈ ప్రాంతం అన్ని రంగాల్లో వెనుకబడి ఉందన్నారు. మెరుగైన వైద్యం కోసం ఈ ప్రాంతం వారు కరీంనగర్, హైదరాబాద్, మహారాష్ట్రకు వెళ్లాల్సి వస్తోందన్నారు. ఇలాంటి చోట వైద్య శిబిరం నిర్వహించడంతో పేదలకు మేలు జరుగుతుందన్నారు. రవాణా శాఖ సంయుక్త కార్యదర్శి పాండురంగ్ నాయక్ మాట్లాడుతూ వైద్యురాలైన తన భార్య జ్ఞాపకార్థం సేవా కార్యక్రమాలు చేపట్టాలన్న ఉద్దేశంతో వైద్య శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. భవిష్యత్తులో పేద ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని సామాజిక సేవ కార్యక్రమాలు చేపడతామన్నారు. అనంతరం మయూరి మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రికి చెందిన వైద్యులు జోగేందర్, సుమంత్ సిబ్బంది పేదలను పరీక్షించి అవసరమున్న వారికి మందులు పంపిణీ చేశారు. మొదట పాలనాధికారి, ఎస్పీ, జేటీసీలకు పరీక్షలు చేశారు. కార్యక్రమంలో సేవ్ హ్యాండ్స్ ప్రతినిధి రవి, సభ్యులు చంద్రమోహన్, సునీల్‌కుమార్, రీక్యాప్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి వెంకట్, ఆసుపత్రి మేనేజర్ సుదర్శన్‌రెడ్డి, తాజ్ ఫౌండేషన్ ప్రతినిధి సహేరా బాను, వివిధ సేవ సంస్థల సిబ్బంది పాల్గొన్నారు.


మందులు పంపిణీ చేస్తున్న పాలనాధికారి చంపాలాల్, ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్


కూలిన దుర్గం లక్ష్మి షెడ్డు

వర్షానికి కూలిన షెడ్డు

దహెగాం, న్యూస్‌టుడే: మండలంలోని బీబ్రా గ్రామంలో దుర్గం లక్ష్మికి చెందిన షెడ్డు కుప్పకూలిపోయింది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం శనివారం రాత్రి కురిసిన వర్షానికి ఒక్కసారిగా పడిపోయిందని తెలిపారు. ఇందులో వంట చేసుకుంటామని ఇందులో ఉన్న సామగ్రి తడిసిపోయిందని తెలిపారు. షెడ్డు కూలిందని తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో సెమిస్టర్ విధానం

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో 2017-18 సంవత్సరం నుంచి సెమిస్టర్ విధానం అమలు చేస్తున్నారని ఆసిఫాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల అంబేడ్కర్ అధ్యయన కేంద్రం సమన్వయకర్త నాయిని శ్రీనివాస్ పేర్కొన్నారు. నూతన విధానం విద్యార్థులకు ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. ప్రభుత్వం యునివర్శిటి గ్రాంట్స్ కమిషన్ జారీ చేసిన ఉత్తర్వుల మేరకు అంబేడ్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయంలో సీబీసీఎస్ విధానానికి శ్రీకారం చుట్టిందన్నారు. 2017-18లో డిగ్రీ కోర్సులో చేరే విద్యార్థులు ఛాయస్ బెస్ట్ క్రెడిట్ సిస్టమ్ కిందే సబ్జెక్టుల్ని ఎంపిక చేసుకోవాలని సూచించారు. గతానికి భిన్నంగా డిగ్రీ మొదటి సంవత్సరంలోనే బీఏ, బీకాం, బీఎస్సీ సబ్జెక్టుల్ని ఎంచుకోవాల్సి ఉంటుందన్నారు. వీటి ఎంపికలో విద్యార్థికి పూర్తి స్వేచ్ఛ ఉంటుందన్నారు. ఈ విధానంలో విద్యార్థిపై సిలబస్ భారం తగ్గుతుందన్నారు. ఏడాదికి బదులు ఆరు నెలలకోసారి పరీక్షలకు హాజరు కావాల్సి ఉంటుందన్నారు. తద్వారా ఎప్పటికప్పుడు సబ్జెక్టులను సులువుగా పూర్తి చేసుకునే అవకాశం ఏర్పడుతుందన్నారు.

24 వరకు ప్రవేశాలకు గడువు..

డా.బీ.ఆర్.అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో అన్ని డిగ్రీ, పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు ఈ నెల 24 వరకు చివరి గడువు ఉందన్నారు. డిగ్రీ(బీ.ఏ, బీ.కాం, బీ.ఎస్సీ), ఎం.ఏ, ఎం.కాం, ఎం.ఎస్సీ, ఎంబీఏ పలు డిప్లమో సర్టిఫికెట్ కోర్సులకు ప్రవేశాలు జరుగుతున్నాయన్నారు. ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

ఎన్ఐఓఎస్ పరీక్ష కేంద్రాలను పరిశీలించిన రాష్ట్ర బృందం

జైనూరు, న్యూస్‌టుడే : మండలంలో సాక్షర భారత్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న (ఎన్ఐఓ) వయోజనుల స్థాయి నిర్ధరణ పరీక్ష కేంద్రాలను సాక్షర భారత్ రాష్ట్ర పరిశీలన బృందం సభ్యులు శ్యామల, సుదర్శన్‌లు పరిశీలించారు. ఆదివారం మండలంలోని దబోలి, ఉషేగాం, జంగాం కేంద్రాలను సందర్శించి ఎన్ఐఓ పరీక్షలకు పరిశీలించారు. మండల వ్యాప్తంగా నిర్దేశిత లక్ష్యం మేరకు 200 మంది వయోజనులు పూర్తి స్థాయిలో పరీక్షలకు హాజరు కావడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. సాక్షర భారత్ కేంద్రాలను పకడ్బందీగా నిర్వహించి అక్షరాస్యత పెంపునకు మరింత కృషి చేయాలని గ్రామసమన్వకర్తలకు సూచించారు. బృందం సభ్యుల వెంట కుమురంభీం జిల్లా సాక్షరభారత్ ఏపీఓ శ్రీనివాస్‌రెడ్డి, మండల సమన్వయకర్త జాదవ్ రవీందర్, గ్రామసమన్వయకర్తలు తెలంగారావు, ప్రశాంత్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

బురదలో కూరుకుపోయిన బస్సు..

ప్రయాణికులకు తప్పని పాట్లు

పెంచికల్‌పేట్ (బెజ్జూరు), న్యూస్‌టుడే : పెంచికల్‌పేట్ మండలంలోని బొంబాయిగూడ-మొట్లగూడ గ్రామాల మధ్యలో రోడ్డు పనులు సాగుతున్నాయి. రోడ్డుపై వేసిన మొరం చిరుజల్లులకు బురదగా మారింది. దీంతో వాహనాలకు ఇక్కట్లు తప్పటం లేదు. బెజ్జూరు నుంచి కాగజ్‌నగర్ వైపు వెళ్లే ఆర్టీసీ బస్సు మొట్లగూడ సమీపంలో బురదలో కూరుకుపోయింది. పక్క నుంచి వెళ్లిన బోలోరా వాహనం సైతం కూరుకుపోయింది. ట్రాక్టరు సహాయంతో బస్సు, బోలోరాలను బయటికి తీశారు.


కూరుకుపోయిన బస్సు

కదిలికి పెద్ద సంఖ్యలో భక్తులు

నేటితో ముగియనున్న శ్రావణ మాస ఉత్సవాలు

దిలావర్‌పూర్, న్యూస్‌టుడే: జిల్లాలోని కదిలి శ్రీమాతన్నపూర్ణ పాపహరేశ్వరాలయం ఆదివారం భక్తజనంతో కిటకిటలాడింది. ఆలయంలో శ్రావణ మాస ఉత్సవాలు సోమవారంతో ముగియనున్నాయి. గత నెల రోజులుగా కొనసాగుతున్న ఉత్సవాల్లో భాగంగా మాడేగాం, భైంసా ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయ పరిసరాల్లో ఏకతాళ భజనలు చేస్తూ అలరిస్తున్నారు. శ్రావణ మాసంలో నేడు చివరి సోమవారంతో పాటు అమావాస్య కావడంతో ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉంది. ఈ మేరకు ఆలయం వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు అన్ని ఏర్పాట్లు చేపట్టినట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు సంభాజిపటేల్ తెలిపారు.

అక్షరానికి పరీక్ష

(మొదటి పేజీ తరువాయి) లేదన్న విమర్శలు విని పిస్తున్నాయి. అభ్యాసకులను గుర్తించి పాఠ్యాంశాలను బోధించే పని ఎలా ఉన్నా అర్హత పరీక్ష పెట్టే విష యంలో మాత్రం అధికార యంత్రాంగం హడావుడి చేసింది.

జిల్లాలో ఇదీ పరిస్థితి..

కుమురం భీం జిల్లాలోని 12 మండలాల పరిధిలోని 176 పంచాయతీల్లో సుమారు 3 వేల మంది నిరక్షరా స్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడానికి గత ఏప్రిల్ మాసంలో సాక్షర భారత్ కేంద్రాలను ప్రారంభించారు. అభ్యాసకులకు ముద్రిత పాఠ్యాంశాలు పంపిణీ అయ్యాయి. నోటుపుస్తకాలు, పెన్సిళ్లు అందలేదు. నాలుగు మాసాల పాటు అభ్యాస కేంద్రాలను నిర్వ



ఆదివారం పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న రాష్ట్ర సమన్వయకర్తలు, ఏపీఓ తదితరులు

హించినట్లు సంబంధిత అధికారులు వివరిస్తున్నారు. అయితే ఈ కేంద్రాలు ఏ మేరకు నడిచాయి. ఎంతమే రకు అభ్యాసకులు అక్షరాస్యులయ్యారనే విషయంపై అనుమానాలు కలుగుతున్నాయి.

కేంద్రాల నిర్వహణకు వసతులు కరవు

ప్రతి పంచాయతీలో అక్షరాస్య కేంద్రాన్ని నిర్వహిం చాలి. ఇందుకోసం పంచాయతీ ఒక కోఆర్డినేటర్(సమ న్వయకర్త)ను నియమించారు. వీరు అభ్యాసకులకు ప్రతిరోజు సాయంత్రం వేళలో ఆగ్రామంలో గుర్తించిన కేంద్రంలో బోధించాలి. పంచాయతీ కార్యాలయంలోనే ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని అధికారులు సూచి స్తున్నప్పటికీ చాలాచోట్ల పంచాయతీ భవనాలు, కమ్యూనిటీ భవనాలు అందుబాటులో లేవు. దీంతో కేంద్రాల నిర్వహణ ఇబ్బందికరంగా మారింది. ఈ క్రమంలో జిల్లాలోని చాలా చోట్ల సాక్షర భారత్ కార్య క్రమం కాగితాలకే పరిమితమైందన్న ఆరోపణలు వెల్లు వెత్తాయి. పర్యవేక్షణ లోపం, సమన్వయ కర్తలకు వేత నాలు లేక పోవడం, వసతులు, అభ్యసన సామాగ్రి కొరతలు ఇందుకు ప్రధాన కారణాలుగా మారాయి.

వేతనాల కోసం సమన్వయకర్తల ఆందోళన

జిల్లాలో సాక్షర భారత్ పని చేస్తున్న మండల కోఆ ర్డినేటర్లకు పది మాసాలుగా, గ్రామ సమన్వయకర్త లకు 15మాసాలుగా వేతనాలు అందలేదు. దీంతో వీరు విధుల పట్ల శ్రద్ధ వహించలేదు. గత మార్చి మాసంలో జరిగిన అభ్యాసకుల పరీక్షల సంద ర్భంలో వేతనాల కోసం వీరు పరీక్షల విధులను బహిష్కరించారు. అనంతరం కొన్ని నెలలకు సంబంధించిన వేతనాలు విడుదలయ్యాయి. మిగి లిన ఇప్పటికీ బకాయిలు రాలేదని వాపోతు న్నారు. మండల సమన్వయకర్తకు రూ.6 వేలు, గ్రామ కోఆర్డినేటర్‌కు రూ.2000 గౌరవ వేతనం ఇవ్వాల్సి ఉంది. ఈ కార్యక్రమ అమలుకు కేంద్ర ప్రభుత్వం 75శాతం, రాష్ట్ర ప్రభుత్వం 25శాతం నిధులను కేటాయిస్తోంది. నిధుల విడుదలతో ఈ రెండు ప్రభుత్వాల మధ్య సమన్వయం కొరవ డంతో కార్యక్రమ నిర్వహణ ఓ ప్రహసనంలా మారింది. సంపూర్ణ అక్షరాస్యత కార్యక్రమం లక్ష్యా నికి దూరంగా నడిచింది. పరీక్షల సమయంలో తప్ప అభ్యాసకులు కేంద్రాల్లో కని పించారు.

పరీక్ష ఓ ప్రహసనం

15 నుంచి 45ఏళ్ల మధ్య వయసున్న నిరక్షరాస్యులను గుర్తించి అక్షరాస్యులుగా మార్చడానికి చేపట్టిన సాక్షర భారత్ కార్యక్రమంలో అభా సుపాలవుతోంది. సుమారు నాలుగు నెలల పాటు అభ్యాసకులకు వారి గ్రామాల్లో ఏర్పాటు చేసే కేంద్రంలో సమన్వయక ర్తలు అక్షరాలు నేర్పించి పాఠాలు బోధించాలి. మూడో తరగతి స్థాయి విద్యను అందించేందుక ఏర్పాటు చేసిన ఈ బోధన కార్యక్రమం అంతమున నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూల్(ఎన్ఐఓ ఎస్)పరీక్షను నిర్వహించాలి. ఈ పరీక్ష ఉత్తీర్ణులైన అభ్యాసకులకు ధ్రువీకరణ పత్రం అందజేస్తారు. ఇది మూడో తరగతికి సమానం. దీంతో డ్రైవింగ్ లైసెన్సు పొందవచ్చని అధికారులు చెబుతున్నారు. జిల్లాలో ఆదివారం నిర్వహించిన ఈ పరీక్షకు సుమారు 3 వేల మంది హాజరు కావాల్సి ఉండగా 2600 మంది వరకు హాజరైనట్లు అధికారులు వివరిస్తున్నారు. పరీక్షకు ఎంతమంది హాజరైందనేది సంబంధిత అధి కారులు స్పష్టంగా చెప్పలేక పోవడం పట్ల సందే హాలు వ్యక్త మవుతున్నాయి.



బూరుగూడలో పరీక్షలు రాస్తున్న అభ్యాసకులు

కొన్ని చోట్ల కేంద్రాల నిర్వహణ ఇబ్బందికరంగా ఉంది

– శ్రీనివాస రెడ్డి, ఏపీవో, సాక్షరభారత్

గ్రామ పంచాయతీ భవనాలు, ఇతర వసతి లేని చోట్ల అభ్యాస కేంద్రాల నిర్వాహణ కొంత ఇబ్బందికరంగా ఉన్నమాట వాస్తవమే. సమన్వయ కర్తలు వేతనాల బకాయిల్లో కొద్ది నెలలకు సంబంధించి నిధులు ఇటీవల విడుదల య్యాయి. వారి ఖాతాలో వేయాల్సి ఉంది. జిల్లాలో 3 వేల మంది అభ్యాస కుల కోసం ఆదివారం పరీక్ష నిర్వహించగా రాత్రి 9 గంటల వరకు కూడా ఎంత మంది హాజరయ్యారనే కొన్ని మండలాల నుంచి సమాచారం రాలేదు. చరవాణుల సిగ్నల్ లేక పోవడం కారణం. సుమారుగా 2600 మంది పరీక్షకు హాజరైనట్లు తెలుస్తోంది.

బాల్యం.. బలహీనం

(మొదటి పేజీ తరువాయి) శిబిరాలు నిర్వహించారు. 76,755 మంది విద్యార్థు లకు వైద్య పరీక్షలు చేశారు. వీరిలో చర్మ, వినికిడి లోపం, దంత, కంటి, రక్తహీ నత వంటి పలు ఆరోగ్య సమస్యలతో 5215 మంది విద్యార్థులను గుర్తించి రిమ్స్‌కు రిఫర్ చేశారు. బాల్యంలో చలాకీగా తిరగాల్సిన రేపటి పౌరులు ఆరోగ్య సమస్య లతో సవాళ్లను ఎదుర్కోవడం తల్లిదండ్రుల్లో ఆందోళన కలిగిస్తోంది. రిఫర్ చేసినా చాలా మంది ఆర్థిక ఇబ్బందులు, దూరభారం కావడం ఇతరాత్ర కారణాలతో వైద్యా నికి దూరం అవుతున్నారన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. కొత్తగా జిల్లా ఏర్పాటు కావడంతో ఇక్కడి ప్రభుత్వ ఆసుపత్రిలోనే డీఈఐసీ(డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్ వెన్షన్ సెంటర్)ను ఏర్పాటు చేయించేలా ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు దృష్టి సారించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

బాల్యంలోనే గుర్తించేందుకు..

– డా.సునీల్‌రావు, ఆర్‌బీఎస్‌కే జిల్లా సమన్వయకర్త

బాల్యంలోనే విద్యార్థుల ఆరోగ్య సమస్యలు తెలుసుకుని వారికి అవసరమైన వైద్య సేవలు అందిస్తే భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తకుండా ఉంటాయి. ఇదే ఉద్దేశంతో ప్రభుత్వం పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించేలా ఆర్‌బీఎస్‌కేను ఏర్పాటు చేసింది. తల్లిదండ్రులు కూడా విద్యార్థులకు పౌష్టికాహారం అందించడం, వారి ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారిం చాలి. జిల్లాలో 5215 మంది విద్యార్థులు వివిధ రుగ్మతలతో బాధపడుతున్నట్లు వైద్య పరీక్షల్లో వెల్లడైంది. వీరిని ఆదిలాబాద్ రిమ్స్‌లోని డీఈఐసీకి రిఫర్ చేశాం.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ప్రభుత్వ సలహాదారు జి.వివేక్

బెల్లంపల్లి పట్టణం, న్యూస్‌టుడే: పేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని ప్రభుత్వ సలహాదారు జి.వివేక్ అన్నారు. ఆదివారం గంగపుత్రుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల జాతరకు ఆయన ముఖ్యఅతిథిగా హాజ రయ్యారు. బెల్లంపల్లికి చేరుకున్న ఆయనకు గంగపుత్ర సంఘం నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం టేకులబస్తీ ఆక్స్‌ఫర్డ్ పాఠశాల ఆవరణలో గంగమ్మ తల్లికి వివేక్ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, మాజీ ఎమ్మెల్యే ఎ.శ్రీదేవి, జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ రేణికుంట్ల ప్రవీణ్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ నర్సింగంలతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లా డారు. ప్రభుత్వం గంగపుత్రుల కోసం చేపలను ఉచితంగా పంపిణీ చేస్తుందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ చేపల పెంపకాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారన్నారు. బెల్లంపల్లిలో అధునాతన ఆసుపత్రి కోసం త్వరలోనే ముఖ్యమంత్రిని కలిసి కోరతామన్నారు. ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య మాట్లాడుతూ.. గతంలో ఇచ్చిన హామీ మేరకు గంగపుత్రుల సంఘానికి



బోనమెత్తిన మహిళలతో ప్రభుత్వ సలహాదారు జి.వివేక్, ఎమ్మెల్యే చిన్నయ్య

స్థలాన్ని కేటాయిస్తానన్నారు. తెలంగాణ ప్రభుత్వం బడుగు,బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందన్నారు. బెల్లంపల్లి ప్రజలకు పట్టాల మంజూరు ప్రక్రియ కొనసాగుతుందన్నారు. అనంతరం బోనాల జాతరను వారు ప్రారంభిం చారు. తిలక్ క్రీడామైదానం నుంచి సింగరేణి కళావేదిక వరకు మహిళలు నెత్తిన బోనమెత్తి కదిలారు. డప్పుచప్పుళ్ల మధ్య బోనాలతో మహిళలు పోచమ్మ ఆలయం వరకు ప్రదర్శన చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పొట్లపల్లి సుభాష్‌రావు, గంగ పుత్ర సంఘం కన్వీనర్ మునిమంద రమేష్, అధ్యక్షుడు పోతరాజు, మహిళా అధ్య క్షురాలు స్వరూపరాణి, ఉపాధ్యక్షులు వి.చక్రపాణి, రమేష్, నాయకులు మహేందర్ రావు, సత్తిబాబు, జడ్పీటీసీలు, ఎంపీపీలు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

వివేక్‌కు సన్మానం

బెల్లంపల్లి పట్టణం: రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు జి.వివేక్‌ను తెలంగాణ మాలమహానాడు సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. బెల్లంపల్లి లోని రైల్వేస్టేషన్ వద్ద వివేక్‌ను పూల మాలలు, శాలువలతో సత్కరించారు. అనంతరం ద్విచక్రవాహన ర్యాలీ చేప ట్టారు. ఈ కార్యక్రమంలో మాలమ హానాడు సంఘం పట్టణ అధ్యక్షుడు కాసర్ల యాదగిరి, రాష్ట్ర ప్రధానకార్య దర్శి సబ్బని రాజనర్సు, నియోజకవర్గ అధ్యక్షుడు శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి తీగల శ్రీనివాస్, అధికార ప్రతినిధి బత్తుల మధుకర్, నాయకులు కొండయ్య, నర్సయ్య, రెడ్డి ప్రభాకర్, పోశం, తిరుమల, అమృత, శారద, సంజీవ్‌లు పాల్గొన్నారు.

వసతులు కరవు.. సమస్యల దరువు

(మొదటి పేజీ తరువాయి) కొన్ని రైళ్లు మాత్రమే ఆగుతుంటాయి. నియోజకవర్గంలోని ఏకైక స్టేషన్. జిల్లా కేంద్రానికి 20 కిలో మీటర్ల దూరంలోనే ఉంది. బెల్లంపల్లి ఏరియా సింగరేణి జీఎం కార్యా లయం సైతం రెబ్బెన మండలంలోని గోలేటిలో ఉంది. రోజు జిల్లా కేంద్రంతో పాటు సింగరేణి ఉద్యోగుల కుటుంబాలు రాకపోకలు కొనసాగిస్తుం టారు. ఇక్కడ కొన్ని రైళ్లు మాత్రమే ఆగనుండ టంతో ఇతర ప్రాంతాలకు వెళ్లి ప్రయాణించాల్సి వస్తోందని, దీనికి తోడు సరైన వసతులు లేక ప్రయాణికులు వాపోతున్నారు.



తెరుచుకోని మూత్రశాలలు

సమస్యలతో స్వాగతం..

ఆసిఫాబాద్ రోడ్ రైల్వే స్టేషన్ ప్రయాణికులకు సమస్యలతో స్వాగతం పలుకుతోంది. స్టేషన్‌లో ఫుట్ ఓవర్ వంతెన లేకపోవడంతో ప్రయాణికులకు ఇబ్బందిగా మారింది. రైలు అవతలి ట్రాకు వైపు వచ్చి ఉన్న సమయంలో మరో రైలు ఇటు వైపు వచ్చి ఉంటే ప్రయాణికులు రైలు కింద నుంచి వీగి పోవాల్సిన పరిస్థితి. ఆ సమయంలో రైలు కదిలితే ప్రమాదం సంభవించే అవకాశం ఉందని ప్రయాణి కులు జంకుతున్నారు. వృద్ధులు, గర్భిణులు, చిన్న పిల్లలు ఇబ్బందులు పడుతూనే ప్రయాణం చేయా ల్సిన పరిస్థితి. స్టేషన్‌లో రైలు వచ్చే వరకు కాసేపు విశ్రాంతి తీసుకుందామంటే విశ్రాంతి గదులు లేవు. దీంతో చలికి వణుకుతూ, ఎండకు ఎండుతూ, వర్షా నికి తడుస్తూ ప్లాట్‌ఫాంపై నిలబడి రైలు కోసం వేచిచూస్తుంటారు.

ఉన్నా.. లేనట్లే..!

ప్రయాణికుల కోసం నిర్మించిన మరుగుదొడ్ల తలు పులు తెరుచుకున్న దాఖలాలు లేవు. అత్యవసర పరి స్థితిలో మహిళలు సైతం ఆరు బయటకే పరుగులు తీయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ స్టేషన్‌లో భాగ్య నగర్ ఎక్స్‌ప్రెస్, ఇంటర్‌సిటీ, రామగిరి ప్యాసింజర్, పుష్పుల్, సింగరేణి ప్యాసింజర్, నాగ్‌పూర్ రైళ్లు మాత్రమే ఆగుతుంటాయి. మిగితా ఎక్స్‌ప్రెస్ రైళ్లకు నిలుపుదల లేకపోవడంతో ప్రయాణికులు ఇతర ప్రాంతాలకు వెళుతున్నారు.



విశ్రాంతి గదులు లేకపోవడంతో ప్లాట్‌ఫాంపై కూర్చున్న ప్రయాణికులు

అమలుకు ఆమడ దూరంలో హామీలు..

రైల్వే స్టేషన్‌లో కనీస వసతులు కల్పించాలని పలు మార్లు ప్రయాణికులు ఎంపీల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయింది. పలువురు ఎంపీలుగా ఉన్న సమయంలో రెబ్బెన వచ్చినప్పుడు హామీలు ఇచ్చారు. ఫుట్‌ఓవర్ వంతెన మంజూరు చేయిస్తా మని, ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపిస్తామని, కనీస వసతులు కల్పిస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు ఏళ్లు గడుస్తున్నా అమలుకు నోచుకోలేదు.

ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలి

– మల్లాజు శ్రీనివాసరావు



రైల్వేస్టేషన్‌లో ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మిం చకపోవడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అవతల వైపు రైలు వచ్చి ఉన్న సమయంలో ప్లాట్‌ఫాం నుంచి దిగి పట్టాలపై నుంచి నడుచుకుంటూ వెళ్లాల్సి వస్తోంది. ప్లాట్‌ఫాం నుంచి కిందికి దిగేటప్పుడు మరీ కిందికి ఉండటంతో వృద్ధులు, గర్భిణులు ఇబ్బందులు పడుతు న్నారు. ఇప్పటికే పలుమార్లు జరిగిన ప్రమాదంలో ప్రయాణి కులు పలువురు మృతి చెందిన సంఘటనలు ఉన్నాయి. అధి కారులు స్పందించి ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలి.

మరుగుదొడ్లను వినియోగంలోకి తేవాలి

– వి.జగ్గయ్య



స్టేషన్‌లో మరుగుదొడ్లు ఉన్నప్పటికీ ప్రయాణికులకు ప్రయోజనం లేకుండా పోయింది. ఎప్పుడు చూసిన మరుగుదొడ్లకు తాళాలు వేసి ఉంటున్నాయి. అత్యవసర పరిస్థితుల్లో మహి ళలు ఆరు బయటకు పరుగులు తీయాల్సిన పరి స్థితి నెలకొంది. సమీపంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద సైతం మూత్రశాలలు లేకపోవడంతో మహిళల పరిస్థితి మరీ దయనీయంగా మారింది.

ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపాలి

– చిరంజీవిగౌడ్



జిల్లా కేంద్రం, నియోజక వర్గానికి ఒకే ఒక స్టేషన్, ఆసి ఫాబాద్ రోడ్ రైల్వే స్టేషన్. రోజు వందల సంఖ్యలో ప్రయాణికులు రాకపోకల కొనసాగిస్తుంటారు. కనీసం కాగజ్‌నగర్, జనతా ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపాలి. ప్రయాణికులు విశ్రాంతి తీసుకునేందుకు గదులు నిర్మించాలి. చిన్న పిల్లలతో గంటల తరబడి ప్లాట్‌ఫాంపై నిల్చోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఈ గృహాలు హరితమయం

● ఇంటి ఆవరణ నుంచే హరితహారం
● మొక్కల పెంపకంపై పెరుగుతున్న మక్కువ

నిర్మల్ గ్రామీణం,న్యూస్‌టుడే

వాతావరణ సమతుల్యాన్ని కాపాడటానికి ప్రభుత్వం హరితహారంలో మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని ఖాళీ స్థలాలతో పాటు ప్రభుత్వ, ప్రభుత్వేతర కార్యాలయాల్లో విరివిగా మొక్కలు పెంచేలా చర్యలు తీసుకుంది. నిజానికి ప్రతి యజమాని తన ఇంటి ఆవరణలో మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తే హరితహారం లక్ష్యం 50 శాతం ఇంటి ఆవరణ నుంచే పూర్తవుతుంది. ఇక సామాజిక ప్రాంతాల్లో చేపడుతున్న హరితహారం మొక్కలు నాటి సంరక్షిస్తే నూరుశాతం లక్ష్యం నెరవేరడం సులువవుతుంది. స్వచ్ఛమైన ప్రాణవాయువుతో పాటు మనస్సుకు ఆహ్లాదాన్నిచ్చే మొక్కలు ప్రతి ఇంటి ముందు నాటాలి. గ్రామీణ ప్రాంతంలో ఖాళీ స్థలానికి కొదువలేనప్పటికీ, పట్టణ ప్రాంతాల్లో స్థల భావం ఉంటుంది. ఉన్న స్థలంలోనే గుమ్మంలోకి అడుగుపెట్టగానే గుబాళించే మొక్కలను పెంచుతూ కొందరు ఆదర్శంగా నిలుస్తున్నారు. తమ ఇంటికే పచ్చ తెచ్చే విధంగా ఆ మొక్కలను ప్రాణంగా చూసుకుంటున్నారు. ఇంటి హంగులకు ఎంత ప్రాధాన్యం కల్పిస్తున్నారో రకరకాల పూల మొక్కలు, అందాన్నిచ్చే పెంచడంలో ప్రత్యేక ఆసక్తి కనబరుస్తున్నారు. నిర్మల్ పట్టణంలోని ప్రియదర్శినినగర్, విజయనగర్‌కాలనీ, ఆదర్శనగర్, ఇందిరానగర్, శాస్త్రీనగర్‌తో పాటు పలు కాలనీల్లో ఇంటి ఆవరణలో పెంచుతున్న మొక్కలపై ప్రత్యేక కథనం



ఆహ్లాదం... అందమైన పూలు

ప్రియదర్శినగర్‌కు చెందిన గిరిధర్‌సునీత దంపతులు తమ ఇంటి ఆవరణలో అందమైన పూలమొక్కలను పెంచుతున్నారు. వివిధ మందారం జాతి, మల్లె, తులసి మొక్కలు, గులాబీ... ఆనందాన్ని కలిగిస్తాయి. ప్రతి రోజు ఈ మొక్కలకు నీరందిస్తూ వాటిని బాధ్యతతో సంరక్షిస్తున్నారు. ఉదయం లేవగానే మొక్కలకు నీళ్లు పట్టడం, వాటిని అందంగా కత్తిరించడం వంటి పనులు దంపతులు ఇద్దరు చేస్తారు.



ఈ మొక్కల ఎదుగుదలకు సేంద్రియ ఎరువులను వినియోగిస్తున్నారు. ఇంటి నర్సరీలో కొత్త తరహా మొక్క కన్పించినా ఆ వారి ఇంటి ఆవరణలో మొక్కగా మారిపోవాల్సిందే. ఈ పూదోటలో పూసిన గులాబీ పూలను తోట ... ప్రతి రోజు ... జేసి వారు మన్ననలు అందుకుంటున్నారు.

నీడనిచ్చే మొక్కలు...



నిర్మల్ మండలం మంజులాపూర్ గ్రామ శివారులోని విజయనగర్ కాలనీ చెందిన కందూర్ గణేష్, సుగుణలు తమ ఇంటి ఆవరణలో పర్యావరణ పరిరక్షణ తమ బాధ్యత అనుకున్నారు. ఇద్దరు ప్రభుత్వ ఉపాధ్యాయులు కావడంతో ముందు చూపుతో కొంత భాగాన్ని మొక్కల కోసం కేటాయించారు. నీడనిచ్చే వేప, కానుగ, నెమలి మొక్కలు చిన్న పాటి వృక్షాలుగా మారాయి. దానిమ్మ, సీతాఫలం, మామిడి, నిమ్మ వంటి పండ్ల మొక్కలు, సన్నజాజి, వీరజాజి, మల్లె వంటి పూల మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తున్నారు. అంతేకాక పక్కను ఉన్న తనతోటి వీదిలో ఇరువైపుల మొక్కలు 28 మొక్కలు నాటారు. పక్కవారిని ప్రోత్సహించారు. అంతేకాదు వేసవిలో ఆ మొక్కలకు నీరు పట్టి వాటిని సంరక్షించడంలో గణేష్ ఉపాధ్యాయుడు ప్రత్యేక శ్రద్ధచూపడంతో మంజులాపూర్ సర్పంచి చెనిగరపు నరేష్ ఇటీవల అభినందించారు. హరితహారంలో భాగస్వాములవుతూ ఐదేళ్లుగా ఈ ఉపాధ్యాయ దంపతులు ఆదర్శంగా నిలుస్తున్నారు.

మినీ ఉద్యాన వనమే



ప్రియదర్శినినగర్‌లో నివాసముంటున్న పుప్పాల సబిత రమేష్ దంపతులు ఇంటి ఆవరణలో మినీ ఉద్యాన వనాన్ని సంరక్షిస్తున్నారు. వీరి ఇంటికి వచ్చే బంధువులు, స్నేహితులు ఈ ఉద్యాన వనాన్ని చూసి ముచ్చటపడుతున్నారు. మరో వైపు అందమైన పూలమొక్కలు ఆకట్టుకుంటున్నాయి. తనివితీరా చూస్తినే అక్కడి నుంచి కదులుతాం. పచ్చదనం రకరకాలు పూలమొక్కలు అహ్లాదకరంగా ఇంటి వాతవరణం ఉంది. సబిత ఈ ఉద్యాన వనంపై ప్రత్యేక శ్రద్ధతీసుకుంటున్నారు. ముఖ్యంగా మహిళలకు పూలమొక్కలంటే చాల ఇష్టంగా ఉంటుంది. సబిత రమేష్‌లు ఉదయం లేవగానే మొక్కలకు నీళ్లు పడుతారు. వాటిని ఎంతో అపరూపంగా చూసుకుంటున్నారు. ప్రహారి గోడ పక్కను అందమైన మొక్కలు కన్పిస్తాయి.

మొక్కలతో విరివిగా ప్రాణవాయువు



ప్రియదర్శినగర్‌కు చెందిన పద్మనాభగౌడ్, భవతి దంపతులు ఉపాధ్యాయులు కావడం చేత విరివిగా స్వచ్ఛమైన ప్రాణవాయువు కోసం ఇంటి ఆవరణలో చిన్నపాటి ఉద్యానవనంగా తీర్చిదిద్దారు. అందమైన గడ్డి, పూల మొక్కలు ఆ ఇంటికే అందాన్ని తెచ్చి పెట్టాయి. ఆక్సిజన్ తగిన మోతాదులో లభించడానికి కొద్దిగా ఏపుగా పెరిగే మొక్కలను నాటారు. ఈ మొక్కలతో అందంతో పాటు ఆరోగ్యానికి ఉపకరించే స్వచ్ఛవాయువు దొరుకుతుందని వారన్నారు.

మనసు దోచే అందం



ప్రియదర్శనగర్‌కు చెందిన జోసఫ్‌బాబు రావు, సూర్యకాంత దంపతులు వారి ఇంటి ఆవరణలో అందమైన పూల మొక్కలు నాటారు. ఎంతో ఎత్తుకు ఎదిగి అందమైన పూలు పూస్తున్నాయి. అలంకరణతో పాటు ఓ మాదిరిగా ఎదిగిన మొక్కలు నీడను ఇస్తున్నాయి. మొక్కలంటే వీరికి ప్రాణం ఎంతో అల్లారు ముద్దుగా పెంచుతున్నారు. నిత్యం పూల మొక్కల మధ్య కలుపుతీస్తూ అందంగా ఈ క్షేత్రాన్ని తీర్చిదిద్దుతున్నారు.

పూల మొక్కలు ఇంటికి కళ



ప్రియదర్శినినగర్ లోని హనుముల శ్యామల-శంకర్‌ల ఇంటిముందు పూదోట ఆ ఇంటికి ఎంతో అందాన్నిస్తుంది. మొక్కలంటే వారికి ఎంతో ఇష్టమని పూల మొక్కలను చూస్తే తెలుస్తుంది. ఇంటి స్థలం తీసుకునే ముందు పూలమొక్కలు, అందాన్నిచ్చే పలురకాల మొక్కలు పెంచడానికి అనువుగా ఉండాలని నిర్ణయించుకొని తీసుకున్నామన్నారు. పూల మొక్కలు చల్లదనం, ఆహ్లాదం అందుకే ప్రతి ఇంటికి పూల మొక్కలు ఇలా ఉండాల్సిందే కదూ..

అందమైన పూలకే ప్రాధాన్యం

శాస్త్రీనగర్‌కు చెందిన కిషన్, పుష్ప దంపతుల ఇంటి ఆవరణలో అందమైన మొక్కలు అబ్బురపరుస్తాయి. వివిధ ప్రాంతాల్లో తన మనుస్సుకు నచ్చిన అందమైన పూలను ఆయన ఇంటి ఆవరణలో పెంచుతారు. వృత్తిరీత్యా జిల్లా అధికారి అయినప్పకి వాటి సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధతీసుకుంటారు. పుష్ప గృహిణి కావడంతో ఎక్కువ సమయాన్ని ఆసక్తిగా పూల మొక్కల పెంపకంలో చొరవచూపుతారు.

ఖాళీ స్థలాలను హరితహారంగా తీర్చిదిద్దాలి

ఎం.స్వామిదయానంద్, విశ్రాంత ఉద్యోగి



మొక్కల పెంపకంపై అవగాహన పెరిగింది. ఇంటి ఆవరణలో ఉన్న ఖాళీ స్థలాలను హరితహారానికి కేటాయించాలి. స్థలాన్ని బట్టి మొక్కలను ఎంపిక చేసుకోవాలి. ప్రతి ఒక్కరు మొక్కల పెంపకంపై ఆసక్తి చూపితే గృహాలన్ని నందనవనాలుగా దర్శనమిస్తాయి. ఇంటి నిర్మాణ సమయంలో మొక్కల పెంపకం తప్పని సరి చేస్తూ, ఇంటి నిర్మాణ అనుమతులు ఇచ్చే ఆలోచన పురపాలక సంఘాలు, గ్రామపంచాయతీలు నిర్ణయం తీసుకుంటే మంచిది. దీంతో విదిగా మొక్కలు నాటడానికి ప్రతి ఒక్కరు ఆలోచన చేస్తారు.

లెక్కలు.. ఇక పక్కా



● ప్రభుత్వ పథకాల్లో పారదర్శకత
● అన్ని శాఖలకు విస్తరిస్తున్న జియోట్యాగింగ్
● అక్రమాలకు అడ్డుకట్ట

ఆదిలాబాద్ వ్యవసాయం, న్యూస్‌టుడే

ప్రభుత్వ పథకాలను పకడ్బందీగా అమలు చేసేందుకు తాజాగా 'జియోట్యాగింగ్' విధానం అమలు చేస్తోంది. పథకాలను పారదర్శకంగా నిర్వహించేందుకు ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తోంది. గతంలో పథకాల అమలులో అనేక అక్రమాలు జరిగేవి. కాగితాల్లోనే మంజూరు చేసి నిధులు కాజేసిన సంఘటనలు ఉన్నాయి. పాలనలో సాంకేతికతను వినియోగించుకునేందుకు అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు పలు శాఖలు జియోట్యాగింగ్‌ను అనుసరిస్తున్నాయి. తొలుత మిషన్ కాకతీయ పథకంలో ప్రారంభించిన విధానం అన్నింటికి విస్తరిస్తున్నారు. ఈ నేపథ్యంలో జియోట్యాగింగ్ విధానం, అమలుతో కలిగే ప్రయోజనాలపై 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం.



జిల్లా అభివృద్ధికి ప్రభుత్వం పలు పథకాలు అమలు చేస్తోంది. అయితే వాటిలో అక్రమాలు, అవినీతి చోటు చేసుకోవడంతో ఆశించిన లక్ష్యం నెరవేరడం లేదు. ఒకే లబ్ధిదారుడు పలు సార్లు ప్రభుత్వం నుంచి రాయితీలు పొందడం, ఇళ్లు, మరుగుదొడ్లు, తదితర నిర్మాణాలు చేయకుండానే బిల్లులు తీసుకోవడం, ప్రభుత్వ స్థలాలు కబ్జా చేసి అమ్ముకోవడం.. ఇలా అనేక అక్రమాలు జరుగుతున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. వీటన్నింటికి అడ్డుకట్ట వేసేందుకు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ రూపొందించిన భువన్‌యాప్‌ను ఉపయోగించుకోవాలని నిర్ణయించింది. మిషన్ కాకతీయ పథకంలో భాగంగా రికార్డులో ఉన్న చెరువుల మరమ్మతుల కోసం నిధుల మంజూరుకు ప్రతిపాదించారు. తీరా క్షేత్రస్థాయికి వెళ్తే అక్కడ చెరువుల ఆనవాళ్లు కూడా కన్పించడం లేదు. దీంతో అవి ఎప్పుడో ఆక్రమణకు గురయ్యాయని ప్రభుత్వం గుర్తించింది. భవిష్యత్తులో అక్రమాలు చోటుచేసుకోకుండా తొలుత మిషన్ కాకతీయ పథకంలో జియోట్యాగింగ్ విధానం అమలు చేశారు. సత్ఫలితాలివ్వడంతో తాజాగా అన్ని శాఖల్లో చేపడుతున్నారు

జియోట్యాగింగ్ అంటే?



శాటిలైట్ ఆధారంగా భూగోళంలో ఏదీ ఎక్కడ ఉందనేది తెలిసిపోతున్న నేపథ్యంలో ప్రభుత్వ పథకాల అమలును పకడ్బందీగా చేపట్టేందుకు భువన్‌యాప్‌ను ఉపయోగించుకోవాలని తెరాస ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వ ఆస్తులను ఛాయాచిత్రం తీసి భువన్‌యాప్‌లో పొందుపర్చడం ద్వారా వాటిని ఎక్కడి నుంచైనా ఉన్నతాధికారులు పరిశీలించవచ్చు. రాయితీపై ఇచ్చే పథకాల వినియోగం తదితర వాటిని కూడా చిత్రం తీసి నమోదు చేస్తే క్షేత్రస్థాయిలో లబ్ధిదారులకు చేరినట్లుగా తెలుస్తోంది. భవిష్యత్తులో వాటిని తనిఖీ చేయడానికి ఎవరి సాయం అవసరం లేకుండా నేరుగా సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించడానికి వీలుంది. ఛాయాచిత్రంతో పాటు, వాటికి సంబంధించిన పూర్తి వివరాలు అందులో నమోదు చేయాల్సి ఉంటుంది. దీంతో మారుమూల గ్రామాల్లో సైతం ప్రభుత్వం అమలు చేసే పథకాలు, ఇతర ఆస్తుల వివరాలు అంతర్జాలంలో నిక్షిప్తమై ఉంటుంది. మళ్లీ వాటికే నిధుల కోసం ప్రతిపాదిస్తే సులువుగా తెలిసిపోతుంది. దీంతో చేసిన పని మళ్లీ చేయడానికి అవకాశముండదు.



చెరువును జియోట్యాగింగ్ చేస్తున్న ఏఈ

మిషన్‌కాకతీయ
లక్ష్యం: 3,171
పూర్తి: 2,945

చెరువులు ఇక భద్రం

రాజుల కాలంతోపాటు గత ప్రభుత్వాల హయాంలో నిర్మించిన చెరువుల సమాచారం మొత్తాన్ని అంతర్జాలంలో నిక్షిప్తం చేస్తున్నారు. ఉపగ్రహ మ్యాపింగ్ ద్వారా చెరువులు ఉన్న స్థలం, విస్తీర్ణం తదితర వాటిని అక్షాంశ, రేఖాంశాలతో సహా ఇప్పటికే నిర్ధరించారు. ప్రతి చెరువుకు యూనిక్‌ఐడీని కేటాయించారు. మిషన్ కాకతీయ వెబ్‌సైట్‌లోకి వెళ్లి వారికి కేటాయించిన యూజర్ పేరు, పాస్‌వర్డ్‌ను ఉపయోగించి జియోట్యాగింగ్ చేయాలి. మిషన్ కాకతీయ యాప్‌లో జీపీఎస్‌ను తెరిచి అక్షాంశాలు, రేఖాంశాల ఆధారంగా చెరువును చూపిస్తుంది. ఆ చెరువుపై క్లిక్ చేసి అలుగు, తూము, చెరువు కట్ట, ఆయకట్టు తదితర వాటిని ఫొటో తీసి వివరాలను నమోదు చేస్తారు. ఉమ్మడి జిల్లా మొత్తంలో ఇప్పటివరకు 3,171 చెరువుల వివరాలు అంతర్జాలంలో పొందుపర్చారు.



ఆదిలాబాద్ పురపాలక అధికారులు ఇంటిని జియోట్యాగింగ్ చేస్తున్న చిత్రం

ఇళ్లు (పురపాలక సంఘాలు)
లక్ష్యం: 1.12(లక్షలు)
పూర్తి: 9.96

ఇళ్ల లెక్క తేలనుంది

పట్టణ పురపాలక సంఘాల పరిధిలో ఉన్న ఇళ్ళ లెక్క తేల్చే పనిలో పురపాలక సంఘాలు ఉన్నాయి. ఇళ్లు, ఖాళీ స్థలాలు తదితర వాటిని జియోట్యాగింగ్ పరిధిలోకి తీసుకువస్తున్నారు. ఈ మేరకు ఇప్పటికే ఈ ప్రక్రియను ప్రారంభించారు. ఉమ్మడి జిల్లాలో పన్నుల నిర్ధరణ అస్తవ్యస్తంగా ఉంది. ఇళ్ల నిర్మాణానికి తగ్గట్టుగా లేకపోవడం వల్ల పురపాలక సంఘాలు ఆదాయాన్ని కోల్పోతున్నాయి. కొన్ని కాలనీల్లో కొత్తగా నిర్మించిన ఇళ్లు అసలు లెక్కల్లోనే లేవు. మరో వైపు రూ.కోట్ల విలువైన ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురవుతున్నాయి. ప్రస్తుతం ప్రతి ఇంటి చిత్రం తీసి, వాటి వివరాలు, యాజమాని వివరాలు అంతర్జాలంలో పొందుపర్చనున్నారు. దీంతో అన్ని విషయాలు నిక్షిప్తమై ఉంటాయి.

మొక్కలకు కూడా

హరిత హారం (మొక్కలు)
లక్ష్యం: 4.00(కోట్లు)
పూర్తి: 2.12



హరిత హారం పథకం కింద అనేక మొక్కలను ఇటు రైతులకు అటు ప్రభుత్వ సంస్థలకు ఇస్తున్నారు. ఏటా నాటుతున్నారే తప్ప క్షేత్రస్థాయిలో అవి కనబడం లేదు. దీంతో ఈ ఏడాది మొక్కలన్నింటిని ఛాయాచిత్రం తీసి అంతర్జాలంలో పొందుపర్చాలని సూచించారు. గత ఏడాది పాఠశాలల్లో హరితహారం పథకం కింద ఎవరైనా చూసుకోవచ్చు. ఉమ్మడి జిల్లాలో ఏటా 4 కోట్ల మొక్కలు నాటాలన్నది లక్ష్యం. గత రెండేళ్లలో నాటిన మొక్కలలో ఎన్ని బతికి ఉన్నాయనేది లెక్కలేదు. పైగా గతంలో నాటిన స్థలంలో తిరిగి నాటుతున్నారు. ఈ ఏడాది అలా గాకుండా ఎక్కడ నాటుతున్నారనేది జియోట్యాగింగ్ ద్వారా తెలిసిపోతుంది. ఉపాధిహామీ కింద రైతులకు ఇచ్చే టేకు మొక్కలతో పాటు, రహదారికి ఇరువైపులా నాటిన మొక్కలు జియోట్యాగింగ్ చేస్తున్నారు. వేల మొక్కలు చేయాల్సి రావడంతో సిబ్బంది తలలుపట్టుకుంటున్నారు

ఉపాధి హామీ పనులకు

ఉపాధి హామీ
లక్ష్యం: 1.16 (లక్షలు)
పూర్తి: 0.91

ఉపాధిహామీ పథకం అక్రమాలకు అలవాలంగా మారింది. కొన్ని చోట్ల మొక్కుబడిగా, మరి కొన్ని ప్రాంతాల్లో పనులు చేయకుండానే చేసినట్లు నిధులు కాజేయడం, గతంలో చేసిన పనులనే తిరిగి కొత్తవాటి కింద చూపి నిధులు స్వాహా చేయడం సామాజిక తనిఖీల్లో వెల్లడయ్యాయి. పథకంలో అవకతవకలను అరికట్టేందుకు ప్రభుత్వం అనేక మార్గాలను ప్రవేశపెట్టిన నిధుల దుర్వినియోగాన్ని అడ్డుకోలేకపోయారు. దీంతో తాజాగా కేంద్ర ప్రభుత్వం ఉపాధి పనులకు జియోట్యాగింగ్ విధానం అమలు చేసేందుకు నిర్ణయించింది. ఉపాధి పథకం కింద చేపట్టే ప్రతి పనిని చిత్రం తీసి అంతర్జాలంలో భద్రపర్చాల్సి ఉంటుంది. దీంతో నిధుల దుర్వినియోగం తగ్గుతుందని ప్రభుత్వం భావిస్తోంది. భువన్‌యాప్ ద్వారా తీసుకునే చిత్రాలను నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్ మెంట్(ఎన్ఐఆర్‌డి) వెబ్‌సైట్‌లోకి అప్‌లోడ్ చేయనున్నారు. ఉమ్మడి జిల్లా మొత్తంలో 50 వేల పనులను జియోట్యాగింగ్ చేయాల్సి ఉంది. 60 శాతానికి పైగా పనులకు సంబంధించిన చిత్రాలు తీసి అప్‌లోడ్ చేశారు. ఉపాధిహామీ పథకం కింద చేపడుతున్న ఇంకుడు గుంతలు, నీటికుంటల నిర్మాణాలు పొలంగట్లపై మొక్కలు నాటడం, మామిడి తోటల పెంపకం, భూమిని చదును చేయడం, చెరువుల్లో పూడికతీత, రహదారుల నిర్మాణం, మరుగుదొడ్ల తదితర అన్ని రకాల పనుల చిత్రాలు తీసి అంతర్జాలంలో నమోదు చేయాల్సి ఉంటుంది.





ఉద్యాన పథకంలో రాయితీ ఇచ్చిన పందిరి సాగు చిత్రం తీస్తున్న ఉద్యాన అధికారి

వ్యవసాయ, ఉద్యాన శాఖలు
లక్ష్యం: 5,327
పూర్తి: 4,117

వ్యవసాయ, ఉద్యాన పథకాల్లో

వ్యవసాయ, ఉద్యానశాఖల అధ్వర్యంలో రైతలకు పలు పరికరాలు రాయితీపై ఇస్తున్నారు. ఏటా రూ.లక్షల వ్యయంతో రాయితీ పరికరాలు అందిస్తున్నా.. అవి ఎంత వరకు అందుతున్నాయి.. ఎవరెవరు లబ్ధి పొందుతున్నారనేది లెక్క కేవలం కాగితాలకే పరిమితమవుతున్నాయి.. అయితే గతేడాది నుంచి రైతులకు అందించే ప్రతి పరికరంతో పాటు లబ్దిదారుని చిత్రం తీసి అంతర్జాలంలో నమోదు చేశారు. ఉద్యాన శాఖ పరిధిలో పాలీహౌజ్‌లు, పందిరి తీగలు, పండ్ల తోటల మొక్కలు తదితర వాటిని జియోట్యాగింగ్ చేస్తున్నారు. దీంతో వాటిని ఏయే గ్రామాల్లో ఎవరెవరికి ఇచ్చారనేది ఉన్నతాధికారులు సైతం తెలుసుకునే అవకాశముంది.

అక్రమాలకు అడ్డుకట్ట

జిల్లా పరిధిలో ఉన్న వ్యవసాయ భూములతో పాటు ప్రభుత్వ భూముల లెక్కను తేల్చేందుకు ప్రభుత్వం అత్యంత అవినీతి శాఖగా ముద్రపడ్డ రెవెన్యూశాఖ కూడా జియోట్యాగింగ్‌పై ఆసక్తి కనబరుస్తున్నారు. ఈ మేరకు వీఆర్వోలకు ట్యాబ్‌లు అందించారు. సర్వే నంబర్ల వారీగా ప్రభుత్వ, ప్రైవేట్ భూములు లెక్కలు తేల్చే పనిలో ఉన్నారు. జిల్లాలవారీగా సమగ్ర సర్వేలో 1బీ ప్రకారం రెవెన్యూ రికార్డులో ఉన్న భూములకు, సర్వేలో భూముల లెక్కలకు తేడా ఉన్నట్లు తేలింది. దీంతో భూముల ప్రక్షాళనకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. ఇందులో భాగంగా ఈ విధానం అనుసరించాలని ప్రభుత్వం భావిస్తోంది.



జియోట్యాగింగ్ తర్వాత అంతర్జాలంలో ఇలా

ఇలా చేస్తారు

- జియోట్యాగింగ్ చేస్తే అంతర్జాలం ద్వారా ఎక్కడి నుంచైనా గ్రామంలో జరిగిన పనులు చిత్రాలు, వాటి వ్యయం వివరాలు తెలుసుకోవచ్చు.
- సంబంధిత శాఖ సిబ్బంది పని జరిగిన ప్రాంతానికి వెళ్లి అక్షాంశాలు, రేఖాంశాల ద్వారా చేపట్టిన పనిని రెండు చిత్రాలు తీస్తారు. ఆ తరువాత వాటిని భువన్‌యాప్ ద్వారా వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తారు. దీని ద్వారా ఏ గ్రామంలో ఏ పనులు చేశారనేది స్పష్టంగా తెలుస్తుంది. గతంలో చేసిన పనిని తిరిగి చేసే అవకాశముండదు.
- చిత్రం తీసిన తరువాత లెవల్-1లో పని ఐడితో పాటు పని పేరు, దేని కింద నిర్మించారు. వాటికి సంబంధించిన వివరాలు నమోదు చేయాలి. తరవాత లెవల్-2లో పని ఎప్పుడు మంజూరైంది. ఎప్పుడు పూర్తయింది. మంజూరు మొత్తం ఎంత, లబ్ధిదారుడికి ఎంత చెల్లించారు. గ్రామం, మండలం తదితర వివరాలు పొందుపర్చాలి. ఏదో ఒక చిత్రం తీసి పెట్టడానికి కుదరదు. పని దగ్గరికి వెళ్లిన తరువాత ఐడీ నంబర్‌ను బట్టి అక్షాంశాలు, రేఖాంశాల ఆధారంగా అక్కడికి వెళ్లేనే ఆ చిత్రం తీయడానికి కుదురుతుంది.
- పథకాలకు చెందిన వివరాలను గ్రామాల వారీగా ఛాయచిత్రాలతో భువన్ యాప్‌లో పొందుపర్చడం వల్ల అక్రమాలకు తావుండదు.
- ప్రభుత్వ పథకాల్లో పారదర్శకత పెరిగే అవకాశముంది.

అలుపెరుగని 'యోగి' గుండేటి



● జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి ఎంపిక
● జిల్లా ఖ్యాతిని చాటుతున్న కళాతపస్వి

ఏసీసీ, న్యూస్‌టుడే

ఆయన ప్రభుత్వ ఉపాధ్యాయుడు. . కవి, రచయితగా జిల్లా ప్రజలకు సుపరిచితుడు. వ్యాఖ్యాతగా చాలామందికి తెలుసు. పర్యావరణ హితుడిగా రాష్ట్ర వ్యాప్తంగా తెలిసిన వ్యక్తి. పాఠాలు చెప్పడం వృత్తిగా.. పర్యావరణాన్ని కాపాడటం బాధ్యతగా భావిస్తారు. ఆయనే మంచిర్యాల జిల్లా కేంద్రానికి చెందిన గుండేటి యోగేశ్వర్. రచనలు చేస్తారు. సామాజిక చైతన్యాన్ని నింపే కవితలను రచిస్తారు. రంగస్థల నటుడిగా అలరిస్తారు. వ్యాఖ్యతగా ఆకట్టుకుంటారు. సామాజిక అంశాలపై ప్రజల్లో చైతన్యం కలిగిస్తారు. ఈ సేవలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం ఈసారి జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడి పురస్కారానికి ఆయన్ను ఎంపిక చేసింది. వచ్చె నెల గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రపతి చేతులమీదుగా ఈ పురస్కారం స్వీకరించనున్నారు. ఈ సందర్భంగా వివిధ రంగాలలో యోగేశ్వర్ చేస్తున్న సేవలపై 'న్యూస్‌టుడే' కథనం..

జిల్లాలోని చెన్నూర్‌లో జన్మించిన గుండేటి యోగేశ్వర్ మంచిర్యాలలో నివసిస్తున్నారు. ఎమ్మెస్సీ (వృక్షశాస్త్రం, పర్యావరణ శాస్త్రం, సైకాలజీ), ఎంఈడీ పూర్తిచేసి జిల్లా కేంద్రంలోని బాలుర పాఠశాలలో జీవశాస్త్రం ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. 24 ఏళ్లకే ప్రభుత్వ కొలువు సాధించిన ఆయన ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్, ఎన్‌సీసీ అధికారిగా, గ్రీన్‌కోర్, హెచ్‌ఐవీ ఏయిడ్స్ శిక్షకుడిగా సేవలందించి రాష్ట్ర, జాతీయస్థాయిలో పురస్కారాలు అందుకున్నారు. విద్యారంగమే కాకుండా కళారంగంలో సైతం ఎంతో అనుభవజ్ఞుడిగా గుర్తింపు తెచ్చుకున్నారు. కవితలు రాస్తారు. పర్యావరణంపై ఆయన రాసిన రచనలు రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందాయి. సామాజిక సంస్థల్లో స్వచ్ఛందంగా పాల్గొంటూ సేవలందిస్తున్నారు. ఉమ్మడి జిల్లా సాంస్కృతిక సమాఖ్యకు ఏన లేని సేవలందించారు. జిల్లా కళారంగం, కళాకారులు రాష్ట్రవాప్తంగా తెలిసేలా కృషి చేశారు. పర్యావరణ పరిరక్షణకు ఆయన చేసిన కృషికి రాష్ట్రస్థాయిలో ప్రశంసలు, బహుమతులు అందుకున్నారు.



అంతర్జాతీయ జీవ వైవిధ్య సదస్సులో...



రంగస్థల నటుడిగా...

ఆయన గురించి కొంత..

- అంతర్జాతీయ జీవ వైవిధ్య సదస్సులో రాష్ట్ర ప్రతినిధి
- ఇండియన్ సైన్స్ కాంగ్రెస్‌లో భాగస్వామ్యం
- ముంబయిలో జరిగిన చిల్డ్రన్స్ సైన్స్ కాంగ్రెస్‌లో బహుమతి
- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎన్‌సీసీ ఉత్తమ అధికారిగా పురస్కారం
- 2008లో రాష్ట్ర స్థాయి ప్రభుత్వ ఉత్తమ ఉపాధ్యాయుడిగా పురస్కారం
- ముఖ్యమంత్రి నుంచి రాష్ట్ర ఉత్తమ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ అవార్డు
- ప్రపంచ తెలుగు మహాసభల్లో భాగస్వామ్యం
- పర్యావరణ మిత్ర పురస్కారం
- ఎన్‌సీసీలో బంగారు పతకం
- ఇటీవల మన టీవీ ద్వారా పర్యావరణపై ఆకట్టుకునే ప్రసంగం

కవితలతో ప్రజల్లో చైతన్యం

సామాజిక అంశాలపై తన కలంతో ప్రజలను చైతన్య వంతులను చేయడంలో యోగేశ్వర్‌ది అందవేసిన చేయి. ప్రభుత్వం చేపట్టే అనేక పథకాలను తనవంతు బాధ్యతగా కవితల రూపంలో అవగాహన కల్పిస్తారు. 15 ఏళ్లుగా పర్యావరణ శిక్షకుడిగా సేవలందిస్తున్నారు. జన విజ్ఞాన వేదిక ద్వారా మూఢనమ్మకాల నిర్మూలనకు కృషి చేశారు. ఉమ్మడి తూర్పుజిల్లాలో బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించడంలో పాలుపంచుకున్నారు. జిల్లా విద్యాశాఖ రూపొందించిన బాలసాహిత్యంలో తన రచనలతో ఆకట్టుకున్నారు.



సాధించిన పతకాలు, జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలతో...

సేవలకు గుర్తింపు..

జాతీయస్థాయి సామాజిక, సాంస్కృతిక సాహిత్య సేవాసంస్థ 2012లో యోగేశ్వర్‌కు లైఫ్ టైం అచీవ్‌మెంట్ పురస్కారాన్ని ప్రకటించింది. నటుడిగానూ రంగస్థలంలో చెరగని ముద్ర వేసుకున్నారు. 'అమ్మ' స్వచ్ఛంద సంస్థకు గౌరవ అధ్యక్షుడిగా కొనసాగుతూ రక్తదానం చేసేలా యువతను ప్రోత్సహిస్తున్నారు.

తుదిశ్వాస వరకు సమాజసేవకు అంకితం

- యోగేశ్వర్

సమాజిన్ని పర్యావరణ హితంగా మార్చేందుకు తుదిశ్వాస వరకు పోరాడుతాను. సేవలకు జాతీయ స్థాయిలో గుర్తింపు రావడం చాలా సంతోషంగా ఉంది. నాకు తోడ్పాటు అందించిన ఉపాధ్యాయులు, జిల్లా అధికారులు, కళాకారులకు, రుణపడి ఉంటాను.



నేడు కార్మిక సంఘాలతో ఎన్నికలపై చర్చ

శ్రీరాంపూర్, న్యూస్‌టుడే: సింగరేణిలో కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికలపై కార్మిక సంఘాలు, యాజమాన్యంతో కేంద్ర కార్మిక శాఖ డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ శ్యాంసుందర్ సోమవారం చర్చలు జరపనున్నారు. ఈనెల 14న కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికలపై సమావేశం నిర్వహించినప్పటికీ ఒప్పంద కార్మికులు ఉదయం నుంచి సాయంత్రం వరకు తమ డిమాండ్లపై ఆందోళన చేయడంతో గుర్తింపు ఎన్నికల అంశంపై ప్రతిష్ఠంభన ఏర్పడిన విషయం తెలిసిందే. ఒప్పంద కార్మికులకు కనీస వేతనాలను అమలు చేస్తూ యాజమాన్యం ఈనెల 18న ఉత్తర్వులు జారీ చేయడంతో, సోమవారం జరిగే చర్చలకు ఎలాంటి ఆటంకం లేకుండా సాగనున్నాయి. 2012 జూన్ 28న జరిగిన ఎన్నికల్లో తెరాస అనుబంధ తెబొగకాసం విజయం సాధించింది. ప్రస్తుత గుర్తింపు కార్మిక సంఘం తెబొగకాసం కాలపరిమితి ముగిసి ఏడాది గడిచిపోయింది. ప్రవర్తనా నియమావళిని మార్చాలని డిమాండ్ చేసిన ప్రధాన కార్మిక సంఘాలు, ఇప్పుడు ఆ అంశాన్ని మరచిపోయినట్లు కనిపిస్తోంది. సింగరేణిలో 1998 నుంచి అమలవుతూ వస్తున్న ప్రవర్తనా నియమావళినే కొనసాగించాలని యాజమాన్యం భావిస్తోంది. ప్రవర్తనా నియమావళిని మార్చుతారా? పాత పద్ధతిలోనే ఎన్నికలకు వెళ్తారా? అనేది సోమవారం జరిగే చర్చల్లో తేలనుంది. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడుతుందని ఇటు యాజమాన్యం, అటు ప్రధాన కార్మిక సంఘాలు మాత్రం ధీమాతో ఉన్నాయి.

ప్రవేశాల కోసం దరఖాస్తుల ఆహ్వానం

రెబ్బెన, న్యూస్‌టుడే: సింగరేణిలో స్కూల్, నర్సింగ్‌లో 2017-18 సంవత్సరానికి జీఎన్ఎమ్ మూడేళ్ల కోర్సుల కోసం ప్రవేశాలు ప్రారంభమయ్యాయని బెల్లంపల్లి ఏరియా డీజీఎం(పర్సనల్) జె. కిరణ్ తెలిపారు. స్కూల్ ఆఫ్ నర్సింగ్‌లో ఉచితంగా 20 సీట్లు ఉన్నాయని, దీని కోసం ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 24 వరకు రూ. 200 చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు కోసం ఈ నెల 28వ తేదీ వరకు గడువు ఉందన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకున్న తర్వాత డౌన్‌లోడ్ చేసిన దరఖాస్తులను కొత్తగూడెంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో వచ్చే నెల 23 వరకు సమర్పించాల్సి ఉంటుందన్నారు. ఆసక్తి, అర్హత కలిన అభ్యర్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

మెరుగైన వేతన ఒప్పందం చేసుకోవాలి

రెబ్బెన: దేశంలోని బొగ్గు గనుల్లో పని చేసే ఉద్యోగులకు మెరుగైన వేతన ఒప్పందం చేసుకోవాలని తెబొగకాసం కేంద్ర కార్యదర్శి మల్రాజు శ్రీనివాస్‌రావు అన్నారు. ఆదివారం గోలేటిలోని తెలంగాణ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 10వ వేతన సంఘం ఒప్పందం విషయంలో జాతీయ సంఘాలు తప్పుడు ఒప్పందానికి సిద్ధపడి కార్మికులను మోసం చేయడానికి ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. గతంలో 50 శాతానికి పైగా వేతన ఒప్పందం సాధిస్తామని ప్రగల్భాలు పలికిన జాతీయ సంఘాలు యాజమాన్యం ముందు 21 శాతానికి ఒప్పుకోవడానికి సిద్ధం కావడం శోచనీయమన్నారు. సమావేశంలో తెబొగకాసం కేంద్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి అబ్బు శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.


కార్మికుడి విగ్రహానికి పూలమాలవేస్తున్న ఒప్పంద కార్మికులు

శ్రీరాంపూర్‌లో ఒప్పంద కార్మికుల సంబరాలు

శ్రీరాంపూర్ గ్రామీణం: సింగరేణిలో పనిచేస్తున్న ఒప్పంద కార్మికులకు వేతనాలు పెంచుతూ యాజమాన్యం జీవో విడుదల చేయడాన్ని స్వాగతిస్తూ ఆదివారం శ్రీరాంపూర్‌లో ఒప్పంద కార్మికులు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీరాంపూర్ ఉపరితల గని ఓసీపీ, ఓబీల్లో పనిచేస్తున్న ఒప్పంద కార్మికులు శ్రీరాంపూర్ ప్రయాణ ప్రాంగణంలోని కార్మికుడి విగ్రహానికి పూలమాల వేసి బాణసంచా పేల్చుతూ మిఠాయిలు పంచిపెట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ గౌరవ వేతనాల కోసం తాము చేసిన పోరాటాల ఫలితంగానే యాజమాన్యం వేతనాలు పెంచేందుకు ముందుకు వచ్చిందన్నారు. ఎంపీటీసీ సభ్యుడు బండారి సుధాకర్, శ్రీరాంపూర్ ఒప్పంద కార్మిక సంఘం అధ్యక్షుడు గుమ్మడి శ్రీనివాస్, తెరాస గ్రామ కమిటీ అధ్యక్షుడు బండి తిరుపతి, వార్డు సభ్యుడు రమణాచారి, నాయకులు అబ్రహం, కిరణ్, పుల్ల రమేష్, సంగె శ్రీనివాస్, ఐతె శేఖర్, ఎం. శ్రీనివాస్, ఎస్‌కే నియాజోద్దీన్, క్రిష్ణ, నవీన్, కర్ర శ్రీనివాస్, లింగయ్య పాల్గొన్నారు.

'కార్మికులను మోసం చేస్తున్న జాతీయ సంఘాలు'

శ్రీరాంపూర్ గ్రామీణం, న్యూస్‌టుడే: పదో వేతన సంఘం చర్చల్లో ఎలాంటి పురోగతి సాధించకుండా, ఒప్పందాలు చేసుకోకుండా జాతీయ సంఘాలు బొగ్గు గని కార్మికులను మోసం చేస్తున్నాయని తెబొగకాసం ఏరియా ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం సీసీసీ నస్పూర్ కాలనీలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికులకు 50 శాతం వేతనాలు పెంచుతామన్న జాతీయ సంఘాలు 21 శాతానికే ఒప్పుకోవడం విచారకరమన్నారు. ఈ 21 శాతం పెరుగుదల ఏవిధంగా ఉంటుందో జాతీయ సంఘాల నాయకులు కార్మికులకు వివరించాలన్నారు. గత వేతన సంఘంలో సాధించిన 4 శాతం అలవెన్సును ప్రస్తుత వేతన సంఘం చర్చల్లో సాధించకపోవడం వారి వైఫల్యానికి నిదర్శనమన్నారు. ఈ సమావేశంలో తెబొగకాసం నాయకులు బంటు సారయ్య, మంద మల్లారెడ్డి, బండి రమేష్, సీహెచ్. అశోక్, లెక్కల విజయ్, పానుగంటి సత్తయ్య, మోతె రాఘవరెడ్డి, కాశీరావు తదితరులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి ఏరియా సింగరేణి ప్రైవేటు డ్రైవర్ల కమిటీ ఎన్నిక

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియా గోలేటిలో ఆదివారం రాత్రి సింగరేణి కంపెనీ ప్రైవేటు డ్రైవర్ల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాత కమిటీని రద్దు చేసి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. బెల్లంపల్లి ఏరియా సంఘం అధ్యక్షుడుగా దుర్గం శ్రీనివాస్, ఉపాధ్యక్షుడుగా మంద కిషన్, ప్రధాన కార్యదర్శి బొమ్మెల్ల వెంకటస్వామి, సంయుక్త కార్యదర్శిగా ముస్కు రవి, కోశాధికారి జర్పుల తిరుపతి, సలహా కార్యదర్శి కొంగ రాజు, మల్లేష్‌లను ఎన్నుకొన్నట్లు సంఘం దుర్గం శ్రీనివాస్ తెలిపారు.

అలవెన్సు 4 శాతం ఒప్పుకోకపోతే సమ్మెలోకి వెళ్తాం

ఏఐటీయూసీ సింగరేణి విభాగం ప్రధాన కార్యదర్శి వి.సీతారామయ్య


మాట్లాడుతున్న వాసిరెడ్డి సీతారామయ్య

శ్రీరాంపూర్ గ్రామీణం, న్యూస్‌టుడే: ఈ నెల 24న దిల్లీలో జరిగే వేతన సంఘం చర్చల్లో బొగ్గు గని కార్మికులకు 4 శాతం అలవెన్సులు చెల్లించేందుకు యాజమాన్యాలు ఒప్పుకోకపోతే తాము సమ్మెలోకి వెళ్తామని ఏఐటీయూసీ సింగరేణి విభాగం ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య పేర్కొన్నారు. ఆదివారం సీసీసీ నస్పూర్ కాలనీలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇటీవల రాంచీలో జరిగిన వేతన సంఘం సమావేశాల్లో అన్ని అంశాలపై ఒప్పందం జరగలేదని, కేవలం మూలవేతనం 21 శాతం పెంచేందుకు మాత్రమే అవగాహన కుదిరిందన్నారు. గత వేజిబోర్డులో ఇచ్చిన అలవెన్సు 4 శాతాన్ని ఇందులో కలుపుకోవాలని ప్రతిపాదన చేయగా దాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకించినట్లు తెలిపారు. ఈ నెల 24న దిల్లీలో జరిగే వేతన సంఘం చర్చల్లో 4 శాతం అలవెన్సు ఇచ్చేందుకు యాజమాన్యం అంగీకరిస్తేనే తాము ఒప్పందంపై సంతకం చేస్తామన్నారు. లేకపోతే జాతీయ సంఘాలన్నీ సమ్మెలోకి వెళ్తాయన్నారు. 2016-17 ఆర్థిక సంవత్సరంలో సింగరేణి సంస్థ సాధించిన లాభాలపై తప్పుడు లెక్కలు చూపిస్తోందని ఆయన ఆరోపించారు. గత సంవత్సరం సంస్థకు రూ. 1063 కోట్లు లాభాలు వస్తే కేవలం రూ. 395 కోట్లు వచ్చాయని ప్రకటించడం సరికాదన్నారు. యాజమాన్యం పేర్కొన్న రూ. 395 కోట్ల లాభాల్లో సింగరేణి విద్యుత్తు కేంద్రం నుంచే 235 కోట్లు వచ్చినట్లు తెలిపిందని, బొగ్గు గనుల నుంచి వచ్చిన లాభాలు ఎంతో కార్మికులకు తెలియజేయాలని ఆయన డిమాండు చేశారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ కేంద్ర కార్యదర్శి ముస్కె సమ్మయ్య, బ్రాంచి కార్యదర్శులు కొట్టె కిషన్‌రావు, ల్యాగల శ్రీనివాస్, నాయకులు వేణుమాదవ్, భీంరాజు, రాంచందర్, అశోక్‌రెడ్డి, బాల్‌రెడ్డి, బియ్యాని శ్రీనివాస్, పెసరి రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఒప్పంద కార్మికులకు హైపవర్ కమిటీ వేతనాలు చెల్లించాలి

సీసీసీ(శ్రీరాంపూర్ గ్రామీణం): సింగరేణిలో పని చేస్తున్న ఒప్పంద కార్మికులకు హైపవర్ కమిటీ వేతనాలు అమలుచేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య డిమాండు చేశారు. ఆదివారం సీసీసీలోని నర్సయ్య భవన్‌లో ఏఐటీయూసీ అనుబంధ సంఘం కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఒప్పంద కార్మికుల హక్కులను యాజమాన్యాలు, ప్రభుత్వాలు కాలరాస్తున్నాయన్నారు. ఒప్పంద కార్మికులకు కనీస వేతనాలు, హైపవర్ కమిటీ వేతనాలు, సమాన పనికి సమాన వేతనాలు చెల్లించకుండా యాజమాన్యం శ్రమదోపిడీకి పాల్పడుతోందన్నారు. సింగరేణిలో పనిచేస్తున్న ఒప్పంద కార్మికులకు కనీస వేతనాలు రూ. 18 వేలు ఇప్పించేలా తమవంతు కృషి చేస్తామన్నారు. ఏఐటీయూసీ సింగరేణి విభాగం కేంద్ర కార్యదర్శి ముస్కె సమ్మయ్య అధ్యక్షతన వహించిన ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పి. భానుదాసు, కార్యనిర్వాహక కమిటీ సభ్యుడు ఎం. నారాయణ, నాయకులు సునిల్, దాగాం మల్లేష్, ప్రభాకర్, రవి, పిట్టల రాంచందర్, కొమురయ్య, రామస్వామి, సూర్యప్రకాష్, సతీష్, బి. మొగిలి, మహేందర్, తిరుపతి, రాజేష్, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్మిక చట్టాలు అమలు చేయాలి


కేంద్ర మంత్రి బండారు దత్తాత్రేయకు వినతిపత్రం అందజేస్తున్న ఒప్పంద కార్మిక సంఘాల నాయకులు

మందమర్రి, న్యూస్‌టుడే: తమకు కార్మిక చట్టాలు అమలు చేయాలని కోరుతూ సింగరేణి ఒప్పంద కార్మికులు.. కేంద్ర కార్మిక, ఉపాధి కల్పనశాఖ మంత్రి బండారు దత్తాత్రేయకు వినతిపత్రం అందజేశారు. హైదరాబాద్‌లో ఆదివారం ఆయనను కలిసిన వివిధ ఒప్పంద కార్మిక సంఘాల నాయకులు కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను విన్నవించారు. పదిహేను ఏళ్లుగా సింగరేణిలో 23 వేల మంది ఒప్పంద కార్మికులు పనిచేస్తున్నారని, వీరికి కనీస వేతనాలు, కార్మిక చట్టాలను అమలు చేయడంలేదని ఆరోపించారు. ఇటీవల జాతీయ వేతన సలహా మండలి ఛైర్మన్ ఆవుల గోవర్ధన్ సింగరేణి ప్రాంతాల్లో పర్యటించిన సమయంలో కార్మికుల నుంచి విన్న సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. కార్మికులకు ఈఎస్ఐ సౌకర్యం, హైపవర్ వేతనాల అమలు చేయడం, బోనస్, జాతీయ, పండగ సెలవుల వర్తింపు, క్యాంటీన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. మహిళ కార్మికులకు ప్రసూతి సెలవులు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎ. వెంకన్న, సత్యనారాయణ, పులి రాజారెడ్డి, కె. శంకర్, రఘు, యుకుబ్‌షావాలి, రఘు తదితరులు పాల్గొన్నారు.

ఆర్కే-5బీ గని ప్రమాదంలో కార్మికుడికి గాయాలు

శ్రీరాంపూర్ గ్రామీణం: శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే-5బీ గనిలో శనివారం రాత్రి బదిలీలో జరిగిన ప్రమాదంలో దాసరి లచ్చన్న అనే కోల్‌ఫిల్లర్ కార్మికుడు తీవ్రంగా గాయపడ్డారు. తోటి కార్మికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్కే-5బీ గనిలోని అంతర్భాగంలో లచ్చన్న 10వ లెవల్‌లో 4 నుంచి 3వ సీమ్ వరకు మరొక్క ట్రామర్ కార్మికుడితో కలిసి టన్నల్ పనులు నిర్వహిస్తున్నారు. ఆదివారం తెల్లవారుజామున సుమారు 5:30 గంటల ప్రాంతంలో గనిలో టబ్బులు భర్తీ అయిన తర్వాత అండర్‌మేనేజర్ సూచన మేరకు ట్రామర్ కింద పని చేసే కార్మికులు సమాచారం ఇవ్వకుండా వాటిని విడిచిపెట్టడంతో ఆ టబ్బులు లచ్చన్నను ఢీకొట్టాయి. ఈ ప్రమాదంలో లచ్చన్న తలకు తీవ్రంగా గాయమవ్వడంతో అతన్ని రామకృష్ణాపూర్‌లోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ లచ్చన్నను పరిశీలించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. తెబొగకాసం నాయకులు ఇచ్చిన సమాచారం మేరకు హైదరాబాద్‌లోని కామినేని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న లచ్చన్నను శాసనసభ్యుడు నడిపెల్లి దివాకర్‌రావు కలుసుకొని పరామర్శించారు. వైద్యులను సంప్రదించి లచ్చన్న ఆరోగ్య పరిస్థితిని ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తెబొగకాసం నాయకులు మాట్లాడుతూ ఆర్కే-5బీ గనిలో అండర్ మేనేజర్ నిర్లక్ష్యం కారణంగా ప్రమాదం జరిగి లచ్చన్న తీవ్రంగా గాయపడ్డాడని ఆరోపించారు. గనిలో పని స్థలాల్లో తక్కువ మంది కార్మికులతో పనిభారం మోపుతున్నారన్నారు. గనిలో జరిగిన ప్రమాదానికి అండర్ మేనేజర్‌ను బాధ్యుడిని చేసి అతన్ని తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండు చేశారు.


గాయపడిన దాసరి లచ్చన్న

పెట్టుబడిదారీ విధానాలతో సంక్షోభం

ఇఫ్టూ జాతీయ ఉపాధ్యక్షుడు డీవీ కృష్ణ ● సీసీసీలో ముగిసిన ఇఫ్టూ రాజకీయ శిక్షణ తరగతులు

శ్రీరాంపూర్ గ్రామీణం, న్యూస్‌టుడే: పెట్టుబడిదారీ విధానాల్లోని లోపాల వల్ల దేశం ఆర్థిక సంక్షోభంలోకి కూరుకుపోతుందని భారత కార్మిక సంఘాల సమాఖ్య(ఇఫ్టూ) జాతీయ ఉపాధ్యక్షుడు డీవీ కృష్ణ పేర్కొన్నారు. సీసీసీలోని మల్లారెడ్డి ఫంక్షన్‌హాల్‌లో గత రెండు రోజులుగా జరిగిన ఇఫ్టూ రాష్ట్రస్థాయి రాజకీయ శిక్షణ తరగతులు ఆదివారంతో ముగిశాయి. రెండో రోజు జరిగిన రాజకీయ శిక్షణ శిబిరానికి ఇఫ్టూ రాష్ట్ర సహాయ కార్యదర్శి కె. రాజన్న అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఇఫ్టూ జాతీయ ఉపాధ్యక్షుడు మాట్లాడుతూ ప్రజలందరూ కష్టపడి సంపాదించుకున్న డబ్బులను బ్యాంకుల్లో దాచిపెట్టుకొంటే బ్యాంకులు ఆ సొమ్మును పెట్టుబడిదారులు, కార్పొరేట్ సంస్థల చేతుల్లో పెడుతుందన్నారు. దీనివల్ల ప్రజల సొమ్ములు కొద్దిమంది పెట్టుబడిదారుల చేతుల్లోనే కేంద్రీకృతం కావడంతో దేశ ఆర్థిక ప్రగతి కుంటుపడుతోందన్నారు. దేశంలోని కార్మికశక్తి అంతా సంఘటితంగా ఏర్పడి తమ న్యాయమైన డిమాండులను సాధించుకునేందుకు పోరాటాలు చేయాలని ఆయన సూచించారు. ఆదివారం జరిగిన రాజకీయ శిక్షణ తరగతుల్లో పాల్గొన్న వక్తలు భారత దేశ, ప్రపంచ కార్మికవర్గ స్థితి గతులపై కార్యకర్తలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఇఫ్టూ రాష్ట్ర కార్యదర్శి కె. సూర్యం, అధ్యక్షుడు వి. కృష్ణ, ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు ఎండీ చాంద్‌పాషా, నాయకులు డి. బ్రహ్మానందం, ఎండీ జాఫర్, మైసూర్ సింగ్, దేవరాజు, జ్యోతి, నర్సయ్య, పోషం, రాజకళ, శోభ, మంగ, అరుణోదయ కళాకారులు మల్లయ్య, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఇఫ్టూ జాతీయ ఉపాధ్యక్షుడు డీవీ కృష్ణ



అర్లి(కె) వదద్ద ద్భుతంగా ప్రవహిస్తున్న సుద్దవాగు



అందకూరు అలుగు నుంచి దిగువకు వెళ్తున్న వరద నీరు



వెంకూర్‌లో నీట మునిగిన పత్తి పంట



గుండేగాం వద్ద పల్సీరంగారావు జలాశయం వరదనీటితో మునిగిన తాత్కాలిక వంతెన

జోరు వాన



లింగాపూర్ ప్రాజెక్టు మత్తడి పైనుంచి పొంగుతున్న వరద నీరు

ఆదిలాబాద్ వ్యవసాయం, న్యూస్‌టుడే: జిల్లాలోని అన్ని మండలాల్లో భారీ వర్షం కురిసింది. శనివారం రాత్రి నుంచి ఆదివారం రాత్రి వరకు ఎడతెరిపి లేకుండా జిల్లా అంతటా వర్షాలు కురుస్తునే ఉన్నాయి. ఆదివారం జిల్లాలో 58.6 మిమీల వర్షపాతం నమోదైంది. దీంతో పలు మండలాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కొన్ని గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. అత్యధికంగా నేరడిగొండ మండలంలో 160.4 మిమీల వర్షం కురిసింది. ఈ ఏడాదిలో ఇదే అత్యధికం. మండలంలో ఏకధాటిగా వర్షం కురవడంతో వాగులు, వంకలు ఉద్ధృతంగా ప్రవహించాయి. కుంటాల, పొచ్చెర జలపాతాల్లోకి నీరు భారీగా చేరాయి. అనేక చోట్ల పంటలు నీట మునిగి నష్టం వాటిల్లింది. సేవాదాస్‌నగర్ వాగు ఉద్ధృతంగా ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఉట్నూర్‌లో 92.2, సిరికొండ మండలంలో 84.3 మిమీ, ఇంద్రవెల్లిలో 73.2, నార్నూర్‌లో 56.4 ఇతర మండలాల్లో 20-40 మిమీల వర్షపాతం నమోదైంది.

మత్తడివాగు ప్రాజెక్టుకు భారీగా వరదనీరు

తాంసి: గత రెండు రోజులుగా తాంసి, తలమడుగు మండలాల్లో కురుస్తున్న వర్షాలకు మత్తడివాగు ప్రాజెక్టులోకి భారీగా వరదనీరు వచ్చి చేరింది. నెల రోజుల క్రితం కురిసిన వర్షాలకు 275 మీటర్ల వద్ద నిలకడగా ఉన్న నీటి మట్టం, ఆదివారం సాయంత్రం వరకు 276.1 మీటర్లకు చేరుకుందని ఏఈ శ్రీనివాస్ తెలిపారు. మరో రెండు మీటర్ల వరకు వరద నీరచ్చి చేరితే ప్రాజెక్టు పూర్తిగా నిండుతుందని తెలిపారు. మరో రెండు భారీ వర్షాలు కురిస్తే ప్రాజెక్టు పూర్తిగా నిండుతుంది. గతేడాది ఇదే సమయానికి ప్రాజెక్టు పూర్తిగా నిండిపోగా, ఈ ఏడాది మాత్రం ఇంకా రెండు మీటర్ల వరకు వరద నీరు చేరవాల్సి ఉంది. ప్రాజెక్టులోకి క్రమక్రమంగా నీరు చేరుతుండడంతో తాంసి, బండల్‌నాగపూర్, వడ్డాడి, జామిడి, గోట్కురి, కప్పర్ల, జందపూర్, సావర్‌గామ్, కప్పర్ల తదితర గ్రామాల ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ఉప్పొంగి ప్రవహిస్తున్న సేవాదాస్ నగర్ వాగు

వాగు పొంగే.. రాకపోకలు నిలిచే..

నేరడిగొండ: మండలంలోని బోరిగాం గ్రామ పంచాయతీ పరిధిలోని సేవాదాస్ నగర్ గ్రామ సమీపంలోని వాగు ఉప్పొంగి ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. గ్రామస్థులు నిత్యం మండలకేంద్రానికి వస్తుంటారు. శనివారం అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు కురిసిన భారీ వర్షానికి వాగు ప్రవహిస్తోంది. గ్రామానికి ఉన్న ప్రధాన రహదారి వద్ద వాగుపై వంతెన నిర్మించకపోవడంతో ఏటా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గ్రామస్థులు వాపోతున్నారు. అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

నేరడిగొండ: మండలంలోని నేరడిగొండ, వాగ్దారి, తేజాపూర్, వెంకటాపూర్, బుగ్గారాం, వాంకిడి, కొర్టికల్, రాజురా, వడూర్, బోందిడి, రోల్‌మామడ, బోరిగాం, తర్నం, కుమారి గ్రామపంచాయతీల పరిధిలోని అన్నిగ్రామాల్లో దాదాపు 250 ఎకరాలకుపైగా పంటనష్టం వాటిల్లింది. బుగ్గారాం గ్రామపంచాయతీ పరిధిలోని కుంటాల గ్రామానికి చెందిన ఆడె ప్రేంసింగ్ ఇల్లు నేలమట్టం కావడంతో ఇంట్లో సామగ్రి, ఆహార ధాన్యాలు తడిసిపోయాయి.

నిర్మల్: నిర్మల్ జిల్లాలోని స్వర్ణ, గడ్డెన్నవాగు జలాశయాల్లోకి వరదనీరు వచ్చి చేరుతోంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా రికార్డుస్థాయిలో వర్షపాతం నమోదైంది. ఎడతెరిపిలేకుండా భారీ వర్షం కురియడంతో అన్ని మండలాల్లోని పంటపొలాలు నీట మునిగాయి. చెరువు అలుగుల ద్వారా నీటి ప్రవాహం కిందకు దూకుతోంది. భైంసాలో అత్యధికంగా వర్షపాతం నమోదైంది. జిల్లాలోని కుంటాల, భైంసా, ముథోల్ మండలాల్లో పంటలు నీట మునగడంతో రైతులు ఆర్థికంగా నష్టపోయారు.



లోకేశ్వరం-కిష్టాపూర్ రహదారిలో నూతనంగా వంతెన వద్ద వేసిన తాత్కాలిక రహదారి తెగిపోయి ప్రవహిస్తున్న నీరు



కత్తెరశాల వాగుపై నిర్మించిన తాత్కాలిక రహదారి కొట్టుకుపోగా రాకపోకలు సాగించేందుకు వేచిచూస్తున్న ప్రయాణికులు

వరుణుడు కరుణించాడు.. 'కడెం' నిండింది

కడెం, న్యూస్‌టుడే: కడెం జలాశయం కింది ఆయకట్టు రైతుల ఆశలు ఫలించేలా వరుణుడు కరుణించాడు. ఎప్పుడెపుడు నిండుతుందా అని ఎదురుచూస్తున్న కడెం జలాశయం శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు కురిసిన వర్షానికి వచ్చిన వరదతో నిండుతోంది. ఖరీఫ్ సీజన్ ప్రారంభం అయి రైతులు వరినాట్లు వేసుకుంటూనే కడెం ఎపుడు నిండుతుందా అని నిన్నమొన్నటివరకు ఎదురుచూశారు. నాట్లు వేసుకుంటున్నాం కాని కడెం నిండుతుందా.. పంటలు పండుతాయా.. అనే సంశయం మధ్యనే వరినాట్లు వేసుకుంటున్నారు రైతులు. రైతాంగం ఎదురు చూపులు ఫలించేలా వరుణుడు కరుణించాడు. జలాశయం ఎగువ ప్రాంతాల్లో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వరదనీరు భారీగానే వచ్చి చేరుతోంది. దీంతో జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకుంటోంది. జలాశయం పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 700అడుగులు కాగా వర్షాకాలం ప్రారంభం అయ్యాక గతనెలలో నీటిమట్టం కేవలం 690.1 అడుగులకే చేరుకుంది. 13రోజులుగా కాల్వలకు నీటిని విడుదల చేస్తుండడంతో నీటిమట్టం రెండు రోజుల కిందట 685 అడుగులకు పడిపోయింది. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్న తరుణంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో జలాశయంలో నీటి మట్టం ఆశాజనకంగా పెరిగింది. ఆదివారం సాయంత్రానికి నీటిమట్టం 697అడుగులకు చేరుకోగా ఇన్‌ఫ్లో 14వేల క్యూసెక్కులుగా వస్తోంది.

ఎగువన వర్షపాతం ఆశాజనకం

కడెం జలాశయంలో ఒక్కరోజులోనే 12 అడుగుల మేర నీటిమట్టం పెరిగింది. శనివారం సాయంత్రానికి నీటిమట్టం 685 అడుగులు ఉంటే ఆదివారం సాయంత్రానికి నీటిమట్టం 697అడుగులకు చేరుకుంది. రెండు రోజుల క్రితం వరకు నీటిమట్టం తగ్గుతూ పోతుంటే కలవరపడిన ఆయకట్టు రైతాంగం ఇపుడు సంబరపడుతున్నారు. ఒక్కరోజులోనే నీటిమట్టం పెరగడానికి జలాశయం ఎగువప్రాంతంలో ఉన్న మండలాల్లో ఆశాజనకంగా వర్షపాతం నమోదవడమే కారణం. కడెం జలాశయం ఎగువ ప్రాంతాల్లోని మండలాల్లో వర్షాలు బాగా కురిస్తేనే జలాశయం నిండుతుంది.



కడెం ఇన్‌టేక్ వెల్ వద్ద పూర్తిస్థాయికి చేరువలో నీటిమట్టం



కామోల్‌లో భారీ వర్షానికి ప్రవహిస్తున్న పోచమ్మ చెరువు అలుగు



నిన్నటి వరకు నీరు లేదు... వర్షానికి దండేపల్లి చెరువులోకి చేరిన నీరు



ఆదివారం మధ్యాహ్నం ప్రవాహంతో ఉరకలెత్తుతున్న గోదావరి



నేరడిగొండలో నేలకొరిగిన పత్తిపంట



వాంకిడిలో నేలకొరిగిన సోయాపంట



కుంటాలలో ఈదురుగాలులతో కురిసిన వర్షానికి నేలమట్టమైన ఇల్లు



ఉద్ధృతంగా ప్రవహిస్తున్న బిద్రెల్లివాగు

TENTH English

ప్రతిభ

It goes without saying that language is the dress of thought. As such, we express our feelings and thoughts through words. The words we use in a sentence need to be precise, accurate and forceful. So to say, prepositions are such forceful, nay powerful words which govern the entire sentence. Therefore, a thorough practice of using correct prepositions is needed for the learner.

Nithin is fond *of* eating..

PREPOSITIONS

A Preposition is a word such as in, on, at or beside that is used before a noun or a noun phrase or a pronoun to show a link with another word or phrase.

★ Study the prepositions under lined in the following sentences:

1. Vaccination protects us from many diseases.
2. A man is known by the company he keeps.
3. Foundation of a house lies below the ground level.
4. Srinidhi has no appetite for sweets.

The words from, by, below and for are prepositions.

Kinds Of Prepositions

Prepositions have different functions: to indicate time, place, movement, direction, means, manner, purpose, source, concession, etc.

Examples: 1. The train arrived on time. (Time)
2. I met Sahithi at the theatre. (Place)
3. Shirisha went to the market for fruits. (Purpose)
4. Rishita drove along the main road in a hurry. (Direction)

A. Simple Prepositions: in ★ on ★ at ★ to ★ for ★ from ★ of ★ off out ★ by ★ till ★ with ★ through, etc.

Study the following sentences and observe the prepositions used in each sentence and note the function of the prepositions given in the brackets.

1. Vaishnavi waited for the doctor till he returned. (Time)
2. Naveen left Boath for Dubai. (Place)
3. Inspite of the hurdles, Kavya succeeded in her efforts. (Concession)

B. Compound Prepositions

about ★ above ★ across ★ along ★ amidst ★ among ★ around ★ before ★ behind ★ below ★ beneath ★ beside ★ between ★ beyond ★ inside ★ out side ★ within ★ with out

Examples: 1. A narrow path ran in between the two houses.
2. The moon moves around the Earth.
3. Inside the box was a diamond studded watch.
4. I cannot allow the work to continue beyond the end of December.

Exercise - 1

✪ *Fill in the blanks with suitable Simple Prepositions.*

1. Nithin is fond .... eating sweets.
2. English is quite different .... Telugu.
3. Malavika fell ... her bicycle and broke her leg.
4. Ashwini drove her car .... the side gate.
5. I'll return your book .... a week.

Exercise - 2

✪ *Fill in the blanks with suitable Compound prepositions.*

1. Apple and banana are .... the most popular fruits.
2. Moiz usually sits .... Saikumar in the class.
3. There is something special .... our Headmaster.
4. A new bridge is being built .... the river.
5. She looks nice .... make-up.

C. Compound Prepositional Phrases

Compound Prepositional Phrases consist of two or more words, such as due to, because of, together with, etc,

Examples:

1. The rowdy was arrested according to IPC 420.
2. I cannot see the film because a tall man is sitting infront of me.
3. Vijayendra Prasad goes to school along with Vamsi Krishna daily.
4. Ring the alarm bell in case of emergency.

✪ *Study the following compound Prepositional Phrases and note the meanings given to each of them*

Comp.Prep.Phrases	Meanings
along with	together with
on account of	because of
by means of	through the agency of
apart from	separate from
ahead of	earlier than something/ somebody
in front of	located before
in place of	as a substitute for
inspite of	disregarding the difficulty
in case of	in the event of
by way of	via
due to	on account of
for the sake of	for the good of
in addition to	added to
in accordance with	in agreement with

Examples: The thief entered the house by means of a broken window.
2. Shruthi attends special classes on Sundays in addition to regular practice.
3. We postponed our trip to Ramoji Film City due to bad weather.
4. Inspite of being rich, my neighbour is not happy.

Exercise - 3

✪ *Fill in each blank with the correct Compound Prepositional Phrases from those given under each sentence.*

1. .... his injury, Umesh will play in Sunday's match.
a) Due to b) For the sake of c) In spite of

2. He sent me some flowers .... an apology.
a) by way of b) in case of c) apart from

3. Is there parking space .... the hotel?
a) ahead of b) in front of c) along with

4. She lost her way when she went into the jungle .... firewood.
a) for the sake of b) in addition to c) in search of

Answers

Ex-1: 1) of 2) from 3) off 4) through 5) in
Ex-2: 1) among 2) beside 3) about 4) across 5) without
Ex-3: 1-c 2-a 3-b 4-c.



రచయిత
డి.నారాయణ,
విషయ నిపుణులు

జనరల్ స్టడీస్

ఫిజిక్స్

గాలిలో ధ్వని వేగం దేనిపై ఆధారపడదు?

1. ఒక వాహనం తన ప్రయాణ దూరంలోని మూడు సమ దూరాలను వరుసగా 80, 60, 30 కి.మీ. / గంట వేగంతో ప్రయాణిస్తే దాని సగటు వేగం ఎంత? (కి.మీ./గంటల్లో)
1) 60 2) 50 3) 48 4) 24

2. ఖగోళశాస్త్రంలో 'పార్‌సెక్' దేనికి ప్రమాణం?
1) దూరం 2) కాలం 3) వేగం 4) పౌనఃపున్యం

3. ట్రాన్స్‌ఫార్మర్ మార్చలేని AC విద్యుత్‌కి సంబంధించిన అంశం?
1) వోల్టేజీ 2) కరెంట్ 3) పౌనఃపున్యం 4) పైవన్నీ

4. భూస్థావర (జియోస్టేషనరీ) ఉపగ్రహం భూమి కేంద్రం నుంచి సుమారు ఎంత ఎత్తులో ఉంటుంది?
1) 36000 కి.మీ. 2) 6,400 కి.మీ.
3) 21,000 కి.మీ. 4) 42,400 కి.మీ.

5. రేడియో రిసీవర్లలో ఉపయోగించే వలయం ఏది?
1) శుద్ధ నిరోధ వలయం 2) LC - ట్యాంక్ వలయం
3) శుద్ధ ప్రేరక వలయం
4) శుద్ధ కెపాసిటర్ వలయం

6. టెఫ్లాన్ పూత పూసిన లోహ పరికరాలను ఉపయోగించి అధిక వోల్టేజీ విద్యుత్ ప్రసారాలను నిలిపివేయకుండానే వాటిని తీసుకుని వెళ్లే తీగలను ముట్టుకుంటారు. ఎందుకంటే టెఫ్లాన్ ఒక...
1) విద్యుత్ బంధకం 2) అర్ధ వాహకం
3) విద్యుత్ వాహకం 4) అతివాహకం

7. గాలిలో ధ్వని వేగం దేనిపై ఆధారపడదు?
1) పీడనం 2) ఆర్ద్రత
3) గాలి (పవన) వేగం 4) ఉష్ణోగ్రత

8. ప్రతిపాదన **(A):** పాలీవినైల్ క్లోరైడ్‌తో తయారైన రెయిన్ కోట్లను వర్షం నీరు తడపదు.
కారణం **(R):** పాలీవినైల్ క్లోరైడ్, నీటి మధ్య స్పర్శ కోణం 90° కంటే ఎక్కువ.
1) A, R రెండూ సరైనవి. A కి R సరైన వివరణ.
2) A, R రెండూ సరైనవి. A కి R సరైన వివరణ కాదు.
3) A, R రెండూ సరైనవి కావు.
4) A సరైంది. కానీ, R సరైంది కాదు.

9. శక్తి నిత్యత్వ నియమానికి ప్రతిరూపం -
1) లెంజ్ నియమం
2) ఉష్ణగతిక శాస్త్ర మొదటి నియమం
3) కిర్కాఫ్ రెండో నియమం 4) పైవన్నీ

10. శూన్య కెల్విన్ ఉష్ణోగ్రతకు సంబంధించి కిందివాటిలో సరైంది ఏది?
1) శూన్య కెల్విన్ ఉష్ణోగ్రతను చేరిన వాయువు ఘన పరిమాణం శూన్యం అవుతుంది.
2) శూన్య కెల్విన్ ఉష్ణోగ్రతను చేరిన వాయువు పీడనం శూన్యం అవుతుంది.
3) శూన్య కెల్విన్ ఉష్ణోగ్రతను పొందడం అసాధ్యం.
4) పైవన్నీ సరైనవే

11. కేంద్రక బలాలు....
1) ఆకర్షణ బలాలు 2) స్వల్ప అవధి బలాలు
3) అత్యంత బలమైన బలాలు 4) పైవన్నీ

12. రాకెట్ ఏ సూత్రం ఆధారంగా పని చేస్తుంది?
1) ద్రవ్యరాశి నిత్యత్వ నియమం
2) శక్తి నిత్యత్వ నియమం
3) ద్రవ్యవేగ నిత్యత్వ నియమం 4) పైవన్నీ

13. ఉష్ణశక్తిని విద్యుత్‌శక్తిగా మార్చేది ఏది?
1) థర్మోకపుల్ 2) ఎలక్ట్రిక్ హీటర్
3) ఎలక్ట్రిక్ బల్బు 4) ఫొటో సెల్

14. స్వేచ్ఛగా కిందపడే వస్తువు...
1) మొత్తం యాంత్రిక శక్తి స్థిరం
2) స్థితిజ శక్తి క్రమంగా పెరుగుతుంది



రచయిత
డి. అనంత రామకృష్ణ
విషయ నిపుణులు

3) గతిజ శక్తి క్రమంగా పెరుగుతుంది
4) 1, 3

15. ఎత్తయిన ప్రదేశం (విమానం) నుంచి చూస్తే ఇంద్రధనస్సు ఏ ఆకారంలో కనిపిస్తుంది?
1) అర్ధ వృత్తం 2) వృత్తం
3) పరావలయం 4) ఏదీకాదు

16. 40°C వద్ద ఉన్న 500 మి.లీ. నీటిని అంతే పరిమాణంలో, 70°C వద్ద ఉన్న నీటికి కలిపితే ఫలిత ఉష్ణోగ్రత విలువ ఎంత?
1) 110° C 2) 55°C 3) 40°C 4) 65°C

17. ఒక వ్యక్తికి సరైన దృష్టి కోసం డాక్టర్ +2D కటకం వాడమని సలహా ఇచ్చారు. అది ఏ రకమైన కటకం? దాని నాభ్యాంతరం ఎంత?
1) కుంభాకార, 100 సెం.మీ.
2) పుటాకార, 10 సెం.మీ.
3) కుంభాకార, 50 సెం.మీ.
4) పుటాకార, 50 సెం.మీ.

18. కాంతి విరళ యానకం నుంచి సాంద్రతర యానకంలోకి ప్రసరిస్తే, దాని తరంగదైర్ఘ్యం (λ), పౌనఃపున్యం (υ) విలువలు ఏ విధంగా ఉంటాయి?
1) λ, υ రెండూ పెరుగుతాయి
2) λ పెరుగుతుంది, υ స్థిరం
3) λ తగ్గుతుంది, υ స్థిరం
4) λ, υ రెండూ తగ్గుతాయి

19. వస్తువు గతిజ శక్తి వేటిపై ఆధారపడుతుంది?
1) ద్రవ్యరాశి, ఎత్తు 2) వేగం, కాలం
3) ఎత్తు, త్వరణం 4) ద్రవ్యరాశి, వేగం

20. సమ వేగంతో వెళ్లే వస్తువు ....
1) చలన దిశ స్థిరం, వడి అస్థిరం
2) వడి స్థిరం, చలన దిశ అస్థిరం
3) వడి, చలన దిశ రెండూ అస్థిరం
4) వడి, చలన దిశ రెండూ స్థిరం

21. మానవుడి గుండె సగటున నిమిషానికి 75 సార్లు కొట్టుకుంటుంది. అయితే దాని స్పందన పౌనఃపున్యం ఎంత? (హెర్ట్జ్‌లలో)
1) 1.25 2) 3.25 3) 4.25 4) 2.25

22. R నిరోధం ఉన్న n నిరోధాలను సమాంతరంగా కలిపితే, ఫలిత నిరోధం...
1) nR 2) n^2 R 3) $\frac{R}{n^2}$ 4) $\frac{R}{n}$

23. వర్షాకాలంలో రోడ్లపై నూనె పొరలు రంగుల్లో కనిపించడానికి కారణం?
1) ధ్రువణం 2) వ్యతికరణం
3) పరిక్షేపణం 4) విక్షేపణం

24. పౌనఃపున్య మాడ్యులేషన్‌లో (FM) వాహక తరంగం పౌనఃపున్యం దేనికి అనుగుణంగా మారుతుంది?
1) సంకేత తరంగ తక్షణ పౌనఃపున్యం
2) సంకేత తరంగ తక్షణ దశ
3) సంకేత తరంగ తక్షణ కంపన పరిమితి
4) సంకేత తరంగ తక్షణ వేగం

25. నక్షత్రం నుంచి వెలువడే కాంతి క్రమంగా ఎరుపు రంగుకి మారితే, అది దేన్ని సూచిస్తుంది?
1) నక్షత్రం భూమి వైపు రావడాన్ని
2) నక్షత్రం విరామ స్థితిలో ఉండటాన్ని
3) నక్షత్రం భూమికి దూరంగా వెళ్లడాన్ని
4) నక్షత్రం ఉష్ణోగ్రత క్రమంగా తగ్గడాన్ని

జవాబులు

1-3	5-2	9-4	13-1	17-3	21-1	25-3
2-1	6-1	10-4	14-4	18-3	22-4	
3-3	7-1	11-4	15-2	19-4	23-2	
4-4	8-1	12-3	16-2	20-4	24-1	

కరెంట్ అఫైర్స్

ప్రతిభ

జాతీయం

ఆగస్టు 13: కీలక బిల్లులకు రాష్ట్రపతి ఆమోదం

రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ బాధ్యతలు చేపట్టిన మూడు వారాల్లో ఆరు కీలక బిల్లులపై సంతకాలు చేశారు. ఆయన ఆమోదం లభించడంతో ఇకపై అవి చట్టాలుగా రూపుదాల్చనున్నాయి.

★ బ్రిటిష్ కాలంనాటి రెండు చట్టాల స్థానంలో రూపొందించిన ది అడ్మిరాలిటీ (పరిధి, మారిటైమ్ క్లెయిమ్‌ల చెల్లింపు) బిల్లు; బాలల ఉచిత, నిర్బంధ విద్యాహక్కు (సవరణ) బిల్లు; జమ్మూ-కశ్మీర్‌కు వర్తించే గణాంకాల సేకరణ (సవరణ) బిల్లు; ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం) బిల్లు; నేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ టెక్నాలజీ, సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్ (సవరణ) బిల్లు; ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ బిల్లులపై రామ్‌నాథ్ సంతకాలు చేశారు.

ఆగస్టు 14: భారతీయ భాషల్లో గూగుల్ వాయిస్ సెర్చ్

టెక్నాలజీ దిగ్గజ సంస్థ గూగుల్ తన వాయిస్ సెర్చ్ ఫీచర్‌కు కొత్తగా 8 భారతీయ భాషలను జోడించింది. ఇప్పటి వరకు హిందీ, ఇంగ్లిష్ భాషల్లోనే గూగుల్ వాయిస్ సెర్చ్ సౌలభ్యం అందుబాటులో ఉంది. ఇప్పుడు తెలుగు, బెంగాలీ, మలయాళం, తమిళం, గుజరాతీ, కన్నడ, మరాఠీ, ఉర్దూ భాషల్లోనూ దీన్ని అందించనున్నామని సంస్థ తెలిపింది.

★ గూగుల్ యాప్‌లో వాయిస్ సెట్టింగ్స్‌లో కావాల్సిన భాషను ఎంచుకోవాలని సూచించింది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 149 భాషలకు ఈ వెసులుబాటు ఉంది.



క్రీడలు టెస్ట్ సిరీస్ నెగ్గిన భారత్ ఆగస్టు 14

శ్రీలంకలో శ్రీలంకతో జరిగిన మూడు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్‌ను టీమిండియా 3-0 తో క్లీన్‌స్వీప్ చేసింది. విదేశీ గడ్డపై మూడు టెస్టుల సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసిన తొలి భారత జట్టుగా కోహ్లి సేన ఘనత సాధించింది. మ్యాన్ ఆఫ్ ద సిరీస్‌గా శిఖర్ ధావన్ నిలిచాడు.

జీవించదగిన అత్యుత్తమ నగరం ఏది..?

ఆగస్టు 15: 71వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

దేశవ్యాప్తంగా 71 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ ఎర్రకోటపై జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం జాతినుద్దేశించి చేసిన ప్రసంగంలో ఆధార్ నుంచి అంతరిక్షం దాకా అన్ని అంశాలను స్పృశించారు.

★ 75 ఏళ్ల స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకునే 2022 నాటికి ప్రతి పేద వ్యక్తికి పక్కా ఇల్లు నిర్మించేలా పని చేయాలని పిలుపునిచ్చారు. పెద్దనోట్ల రద్దు, జీఎస్‌టీ అమలు, నల్లధనంపై కొరడా సహా తన ప్రభుత్వం చేపట్టిన అనేక సంస్కరణలు, పథకాలను ప్రస్తావించారు. స్వాతంత్ర్య సాధన కోసం 'భారత్ ఛోడో' అని నినదించినట్లు ఇప్పుడు 'భారత్ జోడో' నినాదంతో ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు.

★ సమష్టి సంకల్ప శక్తి ద్వారా 2022 నాటికి స్వాతంత్ర్య సమరయోధుల కలలను సాకారం చేసే దిశగా నవభారతాన్ని ఆవిష్కరించాలని మోదీ పేర్కొన్నారు.

★ ప్రధాని హోదాలో మోదీ చేసిన నాలుగు స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగాల్లో ఇదే అత్యంత చిన్న ప్రసంగం (సుమారు 56 నిమిషాలు) కావడం విశేషం.

ఆగస్టు 16: రికార్డు స్థాయిలో ఆహారధాన్యాల ఉత్పత్తి

గత జూన్‌తో ముగిసిన 2016-17 పంట సంవత్సరంలో దేశవ్యాప్తంగా రికార్డు స్థాయిలో 27.56 కోట్ల టన్నుల ఆహారధాన్యాల ఉత్పత్తి జరిగినట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. అంచనా వేసిన దానికంటే 20.30 లక్షల టన్నులు అధిక దిగుబడి వచ్చినట్లు పేర్కొంది.

★ 2015-16 (జులై - జూన్)లో 25.17 కోట్ల టన్నుల దిగుబడి వచ్చింది. 2013-14 లో వచ్చిన 26.50 కోట్ల టన్నుల దిగుబడే ఇంతవరకు రికార్డు.

★ వరి దిగుబడులు 10.41 కోట్ల టన్నుల నుంచి 11.01 కోట్ల టన్నులకు, గోధుమలు 9.29 కోట్ల టన్నుల నుంచి 9.83 కోట్ల టన్నులకు, తృణధాన్యాలు 3.85 కోట్ల టన్నుల నుంచి 4.41 కోట్ల టన్నులకు, పప్పుధాన్యాలు 1.63 కోట్ల టన్నుల నుంచి 2.29 కోట్ల టన్నులకు పెరిగాయి.

★ కంది, మినపప్పుల దిగుబడులు చాలా బాగుండటం గమనార్హం. పత్తి ఉత్పత్తి 3.01 కోట్ల బేళ్ల నుంచి 3.30 కోట్ల బేళ్లకు పెరిగింది. చెరకు ఉత్పత్తి 11.98 శాతం మేర పడిపోయింది.



ఆగస్టు 17: అమెరికా నుంచి అపాచీ హెలికాప్టర్లు

సైన్యం కోసం అమెరికా నుంచి ఆరు అధునాతన అపాచీ హెలికాప్టర్ల కొనుగోలుకు రక్షణ మంత్రి అరుణ్ జైట్లీ అధ్యక్షతన దిల్లీలో సమావేశమైన రక్షణ కొనుగోళ్ల మండలి (డీఏసీ) ఆమోదం తెలిపింది. రూ.4,168 కోట్ల విలువైన ఈ ప్రతిపాదన దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉంది. దీనికి తోడు అధునాతన గ్రిగోరివిచ్ శ్రేణి స్టెల్త్ యుద్ధనౌకలకు రూ. 490 కోట్లతో రెండు జోర్యా గ్యాస్ టర్బైన్ ఇంజిన్లు కొనుగోలు చేయడానికి కూడా డీఏసీ ఆమోదం తెలిపింది.

వార్తల్లో వ్యక్తులు

ఆగస్టు 11:

సెన్సార్ బోర్డు నూతన ఛైర్మన్ ప్రసూన్ జోషి



సెన్సార్ బోర్డు నూతన ఛైర్మన్‌గా కవి, పద్మశ్రీ ప్రసూన్ జోషి నియమితులయ్యారు. వచ్చే మూడేళ్ల కాలానికి ప్రసూన్ ఈ పదవిలో కొనసాగుతారు. పహ్లాజ్ నిహ్లానీ స్థానంలో ప్రసూన్ నియమితులయ్యారు. సెన్సార్ బోర్డు సభ్యులుగా విద్యాబాలన్, గౌతమి, జీవిత తదితరులు నియమితులయ్యారు.

✪ నాటి తరం పరుగుల వీరుడు మిల్కాసింగ్ ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) సౌహార్ద రాయబారిగా నియమితులయ్యారు. దక్షిణాసియా ప్రాంతంలో శారీరక శ్రమ పెంపుదల ఆవశ్యకతపై ప్రచారం చేయడానికి డబ్ల్యూహెచ్ఓ ఆయన్ను ఎంపిక చేసింది.

ఆగస్టు 14:

ఎంతోమంది పేదలకు ఉచిత వైద్య సేవలు అందించి, డాక్టర్ 'దీదీ'గా ప్రఖ్యాతిగాంచిన భక్తియాదవ్ (91) ఇండోర్‌లో మరణించారు. మధ్యప్రదేశ్ తొలి మహిళా వైద్యురాలిగా గుర్తింపు పొందిన భక్తియాదవ్ గైనకాలజిస్టుగా అందించిన సేవలకు కేంద్రం పద్మశ్రీతో సత్కరించింది.

అంతర్జాతీయం

ఆగస్టు 12: కెన్యా అధ్యక్షుడిగా మళ్లీ ఉహురు కెన్యట్టా



ఆఫ్రికా దేశమైన కెన్యా అధ్యక్షుడిగా ఉహురు కెన్యట్టా రెండోసారి ఎన్నికయ్యారు. తాజాగా జరిగిన ఎన్నికల్లో 54.27 శాతం ఓట్లు దక్కించుకున్న కెన్యట్టా విజయం సాధించినట్లు కెన్యా ఎన్నికల సంఘం ప్రకటించింది.

★ ప్రతిపక్ష నేత రైలా ఓడింగా 44.74 శాతం ఓట్లు పొందారు. అయితే ఎన్నికలు సక్రమంగా జరగలేదని, రిగ్గింగ్, ఓటింగ్ యంత్రాల ట్యాంపరింగ్ జరిగిందని ఓడింగా ఆరోపించారు. ఈ నేపథ్యంలో ప్రతిపక్ష పార్టీ మద్దతుదారులు నిర్వహించిన ఆందోళనలు హింసాత్మకంగా మారి, 11 మంది మరణించారు.


ఆగస్టు 14: కలరా బారిన యెమన్

యెమన్‌లో కలరా విజృంభిస్తున్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) వెల్లడించింది. 2017 ఏప్రిల్ నుంచి 5 లక్షలకుపైగా ప్రజలు దీని బారినపడగా 1975 మంది మృతి చెందినట్లు పేర్కొంది.

రాష్ట్రీయం - ఆంధ్రప్రదేశ్, తెలంగాణ

ఆగస్టు 17:

స్వచ్ఛ విద్యాలయ పురస్కారాలు



తెలుగు రాష్ట్రాల్లోని 35 ప్రభుత్వ పాఠశాలలు జాతీయ స్థాయి స్వచ్ఛ విద్యాలయ పురస్కారాలకు ఎంపికయ్యాయి. దేశవ్యాప్తంగా 24 రాష్ట్రాల నుంచి 172 పాఠశాలలు ఈ పురస్కారాలకు ఎంపికకాగా వీటిలో 35 పాఠశాలలు తెలుగు రాష్ట్రాలకు చెందినవి కావడం విశేషం (ఏపీ నుంచి 21, తెలంగాణ నుంచి 14 ప్రభుత్వ పాఠశాలలు).

★ స్వచ్ఛ భారత్‌లో భాగంగా కేంద్రం ఈ పురస్కారాలను అందిస్తోంది. పారిశుద్ధ్య నిర్వహణ, పరిసరాల పరిశుభ్రత, తాగునీరు, విద్యార్థులు చేతులు శుభ్రం చేసుకునేందుకు ఉన్న సౌకర్యం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని కేంద్రం వీటిని ప్రకటించింది.

★ తమిళనాడు నుంచి అత్యధికంగా 25 పాఠశాలలు ఈ పురస్కారాలకు ఎంపికయ్యాయి. అత్యుత్తమ ఆరోగ్య-పరిశుభ్రత ప్రమాణాలు పాటిస్తున్న ఒక్కో పాఠశాలకు రూ. 50 వేల చొప్పున నగదు బహుమతి అందిస్తారు.

రాష్ట్రీయం - ఆంధ్రప్రదేశ్

ఆగస్టు 15: తిరుపతిలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 71 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను తిరుపతిలోని తారకరామ మైదానంలో ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు జాతీయ జెండాను ఎగురవేశారు. రాష్ట్రంలోని నీటి ప్రాజెక్టుల కోసం రూ. 43 వేల కోట్లు ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమర యోధుల పింఛనును రూ. 7 వేల నుంచి రూ. 15 వేలకు పెంచుతున్నట్లు పేర్కొన్నారు. 2019 నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయాలని భావిస్తున్నట్లు ప్రకటించారు.

పురుషోత్త పట్నం ఎత్తిపోతల ప్రారంభం

✪ గోదావరి నదిని ఏలేరుతో అనుసంధానించే పురుషోత్త పట్నం ఎత్తిపోతల పథకాన్ని సీఎం చంద్రబాబు ప్రారంభించారు.

ఆగస్టు 16: ఐయూఐహెచ్ శంకుస్థాపన

రాజధాని అమరావతిలో ప్రతిష్ఠాత్మక ఇండో-యూకే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ (ఐయూఐహెచ్), అమరావతి మెడిసిటీ ప్రాజెక్టుకు సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టుపై ఐయూఐహెచ్ రూ. 1600 కోట్లు వెచ్చించనుంది.

సిద్దిపేటకు ఐఎస్‌ఓ 9001-2015 ధ్రువపత్రం

✪ అభివృద్ధి, సంస్కరణలతో దూసుకెళ్తున్న సిద్దిపేట పురపాలిక మరో ఘనత సాధించింది. ఐఎస్‌ఓ 9001-2015 ధ్రువపత్రానికి ఎంపికై, రాష్ట్రంలో ఈ ఘనత సాధించిన తొలి పురపాలికగా నిలిచింది.

ఆగస్టు 16: తెలంగాణ పదాలతో నిఘంటువు

పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం తెలంగాణ ప్రజల భాష, యాస చిరకాలం ఉండేలా లక్ష పదాలతో నిఘంటువు తయారీకి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా అరుదైన పదాలన్నింటినీ సేకరించి అక్షరబద్ధం చేయాలనేది ప్రణాళిక. పదాల అన్వేషణకు అమరేశం రాజేశ్వర్ శర్మ, కట్టా శేఖర్ రెడ్డి, రవ్వా శ్రీహరి, ఘంటా చక్రపాణి, డాక్టర్ నలిమెల భాస్కర్‌లతో కమిటీ ఏర్పాటు చేశారు.

'ఓడీఎఫ్'గా హైదరాబాద్

✪ హైదరాబాద్ మహా నగరాన్ని బహిరంగ మలమూత్ర విసర్జన రహితంగా (ఓడీఎఫ్) ప్రకటిస్తూ జీహెచ్ఎంసీ ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేసింది.

రాష్ట్రీయం - తెలంగాణ

ఆగస్టు 15: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

తెలంగాణ ప్రభుత్వం 71 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను హైదరాబాద్‌లోని గోల్కొండ కోటలో ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ జాతీయ జెండాను ఆవిష్కరించి, అనంతరం ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ ఏడాది కొత్తగా 84,876 ఉద్యోగ నియామకాలు చేపట్టనున్నట్లు కేసీఆర్ చెప్పారు.

★ 1936 లో నిజాం కాలంలో భూసర్వే జరిగిందని, ఆ తర్వాత మళ్లీ తమ ప్రభుత్వమే సమగ్ర భూ సర్వేను ప్రారంభించినట్లు పేర్కొన్నారు. బడ్జెట్‌లో సింహభాగాన్ని సంక్షేమానికే వెచ్చిస్తున్నట్లు చెప్పారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థలను పరిపుష్టం చేసేందుకు నడుం బిగించినట్లు చెప్పారు.

★ 2016-17 ఆర్థిక సంవత్సరంలో 21.7 శాతం ఆదాయ వృద్ధి రేటుతో తెలంగాణ దేశంలోనే అగ్రభాగాన నిలిచిందని పేర్కొన్నారు.

వార్తల్లో ప్రదేశాలు

ఆగస్టు 14:

హైదరాబాద్‌లో ప్రపంచ పారిశ్రామికవేత్తల సదస్సు

ప్రపంచ పారిశ్రామికవేత్తల (వ్యవస్థాపకుల) వార్షిక శిఖరాగ్ర సదస్సును 2017 నవంబరు 28 నుంచి 30 వరకు మూడు రోజులపాటు హైదరాబాద్‌లో నిర్వహించనున్నారు. ప్రధాని మోదీ చేతుల మీదుగా ప్రారంభం కానున్న ఈ సదస్సుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కుమార్తె ఇవాంకా ట్రంప్ హాజరుకానున్నారు. అగ్ర రాజ్యమైన అమెరికా ఈ సదస్సును నిర్వహిస్తుండటం విశేషం.

ఆగస్టు 16: అత్యుత్తమ నగరంగా మెల్‌బోర్న్

ఎకనమిస్ట్ ఇంటెలిజెన్స్ యూనిట్ రూపొందించిన గ్లోబల్ లివబిలిటీ నివేదిక ప్రకారం ప్రపంచంలో జీవించదగిన అత్యుత్తమ నగరంగా ఆస్ట్రేలియా రాజధాని మెల్‌బోర్న్ ప్రథమస్థానంలో నిలిచింది. తర్వాతి స్థానాల్లో వియన్నా (ఆస్ట్రియా), వాంకోవర్ (కెనడా) ఉన్నాయి.

అవార్డులు

ఆగస్టు 14:

శంకర్‌రావుకు రాష్ట్రపతి పోలీస్ శౌర్య పతకం

కేంద్ర ప్రభుత్వం 71వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ రాష్ట్రాల్లో ప్రతిభావంతమైన సేవలు అందించిన 990 మందికి అత్యున్నత పోలీసు పతకాలు ప్రకటించింది. వామపక్ష తీవ్రవాదులతో జరిగిన పోరులో ప్రాణాలర్పించిన ఛత్తీస్‌గఢ్ పోలీసు జవాను కమాండర్ శంకర్‌రావుకు మరణానంతరం రాష్ట్రపతి పోలీస్ శౌర్య పతకాన్ని ప్రకటించారు. కీర్తిచక్ర పురస్కారాన్ని ఐదుగురికి ప్రకటించారు. హవల్దార్ గిరిస్ గురుంగ్, మేజర్ డేవిడ్ మన్లుం, కమాండెంట్ ప్రమోద్ కుమార్ మరణానంతరం కీర్తిచక్రకు ఎంపికయ్యారు. మిగిలిన ఇద్దరిలో మేజర్ ప్రీతం సింగ్ కున్వార్, చేతన్ కుమార్ చీతా ఉన్నారు.



రచయిత
- సీహెచ్. కృష్ణప్రసాద్
విషయ నిపుణులు

హాయ్! బుజ్జీ!!

ఎదుటివారిని చూసి ప్రేమ పూర్వకంగా నవ్వగలిగితే అదే మనం వారికిచ్చే అందమైన బహుమతి

– మదర్ థెరెసా

పదసంపద!

రోజుకు రెండు పదాలు చదివితే పదసంపద మీదే!

- Produce = ఉత్పత్తిచేయు
- మధుకరం = తుమ్మెద


సరదా పదాలు

ఆధారాలతో తెలుగు పదాలు రాయండి

1. Summer	వే ☐☐	5. Pay	వే ☐☐
2. Flute	వే ☐☐	6. God	వే ☐☐
3. Speed	వే ☐☐	7. Function	వే ☐☐
4. Heat	వే ☐☐	8. Dawn	వే ☐☐

- డీ దయామతి, హన్మకొండ

దారేది?



చుట్టూ జంతువులు... మధ్యలో మనం!



హాయ్ నేస్తాలూ! బాగున్నారా? నేనీమధ్య ఓ జూ కాని జూకెళ్లొచ్చా. ఊపిరి బిగబట్టుకుని కాలం గడి పొచ్చా. తలుచుకుంటేనే ఈ పర్యటన ఎంతో వింతగా.. గమ్మత్తుగా.. అనిపిస్తోంది. ఆ భలే భలే విశేషాలన్నీ మీతో పంచుకోకుంటే ఎలా? అందుకే ఇలా వచ్చేశా.





చిన్నూ కబుర్లు

చుట్టూ పులులు తిరుగుతుంటే మధ్యలో కూర్చుని భోజనం చేశా. సింహం దగ్గరగా వస్తుంటే కాలు మీద కాలేసుకుని ఐస్‌క్రీంలు తింటూ ఆనందించేశా. జంతువులన్నీ భయంకరంగా అరుస్తుంటే రాత్రివేళ మెత్తని పక్కపై పడుకుని ఓ కునుకేసేశా. 'కోతల రాయుడు కోతలు కోస్తున్నాడు. అన్నీ అబద్ధాలే' అనుకుంటున్నారా? అదేం కాదు. ఇదంతా నిజంగా నిజమే.

* మామూలుగా మనం ఎప్పుడైనా జూకి వెళ్లామనుకోండి. జంతువులన్నీ బోనుల్లో ఉంటాయి. మనం బయట స్వేచ్ఛగా తిరుగుతూ వాటిని చూస్తుంటాం. అంతేకదూ!

* మరి నేనెళ్లిన చోటు మాత్రం దీనికి పూర్తిగా భిన్నం. యూకేలోని కెంట్ దగ్గరుందిది.

* ఓ అద్దాల ఇంట్లో తలుపులేసుకుని నేనుంటే ఆ బయట అంతా పులులు, బోలెడు అడవి జంతువులూ తిరుగుతున్నాయి. లోపల నుంచి దగ్గరగా వాటిని చూస్తూ నేను ఆనందించేసానన్నమాట. ఒక్కసారైతే నేనున్న అద్దం దగ్గరకి పెద్ద పులి వచ్చేసింది. అప్పుడు చాలా భయమేసి పక్క గదిలో ఉన్న అమ్మ దగ్గరికి పరిగెట్టేశా.

* అసలు ఈ చోటు ఏంటంటే..? ఇదో సఫారీ. మొత్తం 600 ఎకరాల్లో చిక్కగా చెట్లుంటాయి. వాటిలో రకరకాల జంతువులు స్వేచ్ఛగా తిరుగుతుంటాయి.

* మామూలుగా సఫారీల్లో వీటిని చూసేందుకు మనల్ని జీపుల్లాంటివాటిపై ఎక్కించుకుని తిప్పి తీసుకొస్తారంతే. ఇక్కడ అదొక్కటే కాకుండా అద్దాలతో ఉన్న ఓ చక్కని ఇల్లుంది. దాంట్లో రెండు పడకగదులు, వంటిల్లు, హాలూ ఉన్నాయి. ఎవరైనా అద్దెకు తీసుకుని కొన్ని రోజులక్కడ బస చేయొచ్చు. నాలా వింత అనుభవాల్ని ఆస్వాదించొచ్చు. కావాలంటే మీరూ ఓసారి వెళ్లిరండి మరి. బైబై.

నవ్వుల జల్లులు!

టీచర్: రాముా! ఎన్ని సార్లు పిలుస్తున్నా పలకవేంటి?

రాము: మీరే కదా టీచర్ అనవసరమైన విషయాలు పట్టించుకోవద్దన్నారు!

టీచర్: 30 + 30 ఎంత అవుతుంది?

రఘు: ఆరు టీచర్...

టీచర్: కాస్త బుర్ర పెట్టి చెప్పు!

రఘు: నా జవాబు సరైనదే టీచర్. 0కి విలువ లేదని మీరే కదా చెప్పారు!

- బరాటం రామారావు, నిజామాబాద్

చిలిపి ప్రశ్న

నీళ్లు ఎందుకు తాగుతాం?

- జీ రమేష్, పెనుబర్తి

ఏది భిన్నం?



పరివర్తన

కథ

'నాన్నా! రేపు మా తరగతిలోని పిల్లలంతా పరీక్ష ఫీజు చెల్లించాలని హెడ్మాస్టారు చెప్పారు.' ఇంట్లోకి అడుగు పెడుతూనే అన్నాడు రఘు.

అప్పుడే కూలి పని ముగించుకుని ఇంటికి వచ్చిన కేశవులు కొడుకు మాటలు విని 'అలాగా! ఫీజు ఎంతేమిటి?' అని అడిగాడు.

రెండు వందలని మెల్లగా చెప్పాడు రఘు.

'అవునా! రెండు వందలా? ఈ సారి బాగా పెంచేశారే! సర్లే. రేపు బడికి వెళ్లేప్పుడు ఇస్తాలే' అంటూ పెరట్లోకి నడిచాడు కేశవులు.


మరుసటి రోజు ఉదయం రఘు బడికి వెళ్లేందుకు తయారవుతుండగా కేశవులు అతని వద్దకి వచ్చి 'ఇది గోరా రెండు వందలు. జాగ్రత్త మరి. వెళ్లగానే టీచరుకి ఇవ్వు'. అంటూ జేబులో డబ్బులు పెట్టాడు. 'సరే నాన్నా!' అంటూ బయటకు నడిచాడు రఘు. రఘు కాస్తంత దూరం నడవగానే అతని స్నేహితుడు అమర్ ఎదురయ్యాడు.

'ఏరా మీ నాన్న ఫీజు డబ్బులిచ్చారా?' ఆత్రుతగా అడిగాడు అమర్.

'ఇచ్చార్రా. మరి మీ నాన్నా?' అమర్ కళ్లలోకి సూటిగా చూస్తూ అడిగాడు రఘు.

'నేను ఫీజు రెండు వందల యాభై రూపాయలని చెబితే మారు మాట్లాడకుండా ఇచ్చేశార్రా మానాన్న' గొప్పగా చెప్పాడు అమర్.

ఇంతకీ అసలు విషయం ఏమిటంటే వాళ్లు చెల్లించవలసిన ఫీజు వంద రూపాయలే. తమ తల్లిదండ్రుల నుంచి ఎక్కువ డబ్బు తీసుకుని, వాటితో సినిమాకి వెళ్లాలని పథకం వేసుకున్నారు రఘు, అమర్. ఇద్దరిదీ ఒకే తరగతి. ఒకే బెంచీలో కూర్చుంటారు. కలసి తిరుగుతుంటారు. తల్లిదండ్రుల్ని నమ్మించి భలేగా డబ్బులు తీసుకున్నామని ఇద్దరూ మురిసిపోయారు. చెరో వంద వారి తరగతి ఉపాధ్యాయుడికి ఫీజు చెల్లించారు.



మరునాడు ఆదివారం కావడంతో ఇద్దరూ ఆడుకోవడానికి వెళుతున్నామని చెప్పి టౌనుకు బయలుదేరారు. సినిమా చూసి, ఆ తర్వాత మిఠాయి దుకాణానికి వెళ్లి తమకు ఇష్టమైన తినుబండారాలెన్నో కొనుక్కుని తిన్నారు. ఆనందంగా గడిపారు. చీకటి పడే వేళకు ఇంటికి చేరుకున్నారు. రఘు ఆట నుంచి ఇంటికి వస్తున్నట్లుగా నమ్మించేందుకు ఒక క్రికెట్ బ్యాటు చేతిలో పట్టుకుని మెల్లగా ఇంట్లోకి అడుగు పెట్టాడు. అదే సమయంలో పక్క గదిలో తల్లిదండ్రులు మాట్లాడుకుంటున్న మాటలు విని ఆగిపోయాడు. కిటికీలోంచి లోపలికి చూశాడు. మంచం మీద కేశవులు జ్వరంతో వణికిపోతూ ఉన్నాడు. అతని భార్య సపర్యలు చేస్తూ 'వచ్చిన కూలి డబ్బులన్నీ పిల్లాడి ఫీజు కోసం ఇచ్చేశావు. మందులు తెద్దామంటే ఇంట్లో రూపాయి కూడా లేదు' అంది. అందుకు కేశవులు 'సమయానికి ఫీజు కట్టకపోతే రఘును పరీక్షలకు అనుమతించరు. నాకు మామూలు జ్వరమేగా వచ్చింది. రేపటికి తగ్గిపోతుందిలే' అన్నాడు మూలుగుతూ.

'అలా అంటే ఎలా? నేను పక్కింటి వాళ్ల దగ్గరకెళ్లి ఓ యాభై రూపాయలు అడిగి మందులు కొని తెస్తాను' అంటూ లేవబోయిన ప్రమీల చేయి పట్టుకుని ఆపి 'నా మాట విను రేపు చూద్దాంలే. ఇప్పుడు అప్పు చేయడం ఎందుకు?' అన్నాడు కేశవులు.

అదంతా చూస్తున్న రఘుకు బాధగా అనిపించింది. తన విలాసాల కోసం ఖర్చు చేసిన ఆ వంద రూపాయలు ఎంత విలువైనవో తెలిసి వచ్చింది. అదీగాక రోజు వారీ కూలికి వెళ్లి డబ్బు సంపాదించే తన తండ్రి శ్రమ విలువను అర్థం చేసుకోలేకపోయానని బాధపడ్డాడు. తన ఫీజు కోసం ఉన్న డబ్బులన్నీ ఇచ్చిన తండ్రి మంచితనాన్ని తలుచుకోగానే దుఃఖం తన్నుకు వచ్చింది. గదిలోకి పరుగున వెళ్లి తండ్రిని అమాంతం కౌగిలించుకున్నాడు. వెక్కివెక్కి ఏడుస్తూ జరిగిన సంగతంతా చెప్పాడు. తన తప్పును క్షమించమని విలపించాడు. వాస్తవాన్ని చెప్పినందుకు రఘును తల్లిదండ్రులు కోపగించుకోలేదు. పైగా 'చూడు రఘూ! నువ్వే మా సర్వస్వం. నీ కోసం, నీ చదువు కోసం ఏమైనా చేస్తాం. నువ్వు మాలా కూలి బతుకు బతక కూడదన్నదే మా కోరిక. జరిగింది మరిచిపో. చేసిన తప్పు తెలుసుకున్నావు కదా. అదే చాలు. ఇక మీదట నీకేం కావాలన్నా సంకోచం లేకుండా మమ్మల్ని అడుగు. మేం తెచ్చిపెడతాం. మళ్లీ ఇలాంటి పొరపాటు చేయకు' అంటూ అక్కున చేర్చుకున్నారు. ఆ ఘటన రఘులో గొప్ప మార్పు తెచ్చింది. ఎప్పుడూ మంచి ప్రవర్తనతో మెలుగుతూ, తన మిత్రుడిలోనూ అలాంటి పరివర్తన తీసుకొచ్చాడు.

- పెండెం జగదీశ్వర్

జవాబులు: ఏది భిన్నం: a చిలిపిప్రశ్న: తినలేం కాబట్టి! సరదా పదాలు: 1.వేసవి 2.వేణువు 3.వేగము 4.వేడిమి 5.వేతనం 6.వేలుపు 7.వేడుక 8. వేకువ



జన్నారంలో మాట్లాడుతున్న కె.వి.ప్రతాప్

మాటల్లో కాదు చేతల్లో కశ్మీరును చూపించండి

ప్రాణహిత ప్రాజెక్ట్ కన్వీనర్ కె.వి.ప్రతాప్

జన్నారం, న్యూస్‌టుడే: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను కశ్మీరుగా వర్ణిస్తున్న ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు మాటల్లో కాకుండా చేతల్లో కశ్మీరుగా మార్చి చూపిస్తే బాగుంటుందని ప్రాణహిత ప్రాజెక్ట్ పరిరక్షణ వేదిక కన్వీనర్ కె. వి. ప్రతాప్ డిమాండు చేశారు. జన్నారంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 24 టీఎంసీల సామర్థ్యం ఉన్న ఎల్లంపల్లి ప్రాజెక్ట్‌తో ఆదిలాబాద్ జిల్లాకు ఎలాంటి సంబంధం లేదని ఆ నీరంతా దూర ప్రాంతాలకు తరలిస్తున్నారని అన్నారు. 10 టీఎంసీల నీటి సామర్థ్యం ఉన్న కడెం నీటిని రెండు పంటలకు ఎప్పుడూ అందించలేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటు జరిగినప్పటికిని మన నీళ్లు మనకే దక్కని పరిస్థితి నెలకొందని ఆయన అన్నారు. రైతు ఆత్మహత్యల పరిష్కారానికి పోరాటాలే మార్గమని డిమాండు చేశారు. అనంతరం జలసాధన సమితి జిల్లా అధ్యక్షుడు నైనాల గోవర్ధన్ మాట్లాడుతూ.. కడెం జలాశయం ఎత్తును పెంచి కుప్టి ప్రాజెక్ట్‌ను నిర్మించాలని అన్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో సర్వేలు జరిగిన కుప్టి నేటికి కార్యరూపం దాల్చలేదని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు మిక్కిలినేని రాజశేఖర్, అల్లం లచ్చన్న, వెంకట్రాజం, నరేశ్, ప్రభుదాస్, అశోక్, లింగన్న తదితరులు పాల్గొన్నారు.

ఈటీవీలో ఈనాడు

ఉదయం

05-45: స్పెషల్ ఆరాధన, 06-30: అన్నదాత, 07-00: ఈటీవీ న్యూస్, 07-30: శుభమస్తు: శ్రీ మహాలక్ష్మి అనుగ్రహం కోసం పోలాల అమావాస్యరోజు ఏం చేయాలి? ఇంట్లో పూజించే విగ్రహాల ఎత్తు ఎంత ఉండాలి? 08-30: టాలీవుడ్ టైమ్, 09-00: ఈనాడు సినిమా: ఆమె (శ్రీకాంత్, ఊహ).

మధ్యాహ్నం

12-00: స్పెషల్ అభి'రుచి': ఘుమఘుమలు 'పుదీనా వాంగీబాత్', మీచేతివంట 'మునగాకు జీడిపప్పువేపుడు', 'పాలకూరపచ్చడి', జస్ట్ ఎమినిట్ 'ఉప్మాబోండా' తయారు చేసే విధానం. ఇంటింటి వంటింటి చిట్కాలు.., 01-00: స్టార్ మహిళ (మెగా గేమ్ షో), 02-00: అభిషేకం (డైలీ సీరియల్), 02-30: అత్తారింటికి దారేది (డైలీ సీరియల్), 03-00: సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు (విధి 2) (డైలీ సీరియల్), 03-30: ఆడదే ఆధారం (డైలీ సీరియల్).

సాయంత్రం

04-00:వసంతం(డైలీ సీరియల్), 04-30: ఢీ 10 (సుప్రీండాన్స్‌షో) (రిపీట్), 06-00: శ్రీభాగవతం (భక్తిరసాత్మక దృశ్యకావ్యం) (డైలీ సీరియల్), 06-30: ఒకరికి ఒకరు (డైలీ సీరియల్).

రాత్రి

07-00: సావిత్రి (డైలీ సీరియల్), 07-30: మనసు మమత (డైలీ సీరియల్), 08-00: స్వాతి చినుకులు (డైలీ సీరియల్), 08-30: నా పేరు మీనాక్షి (డైలీ సీరియల్), 09-00: ఈటీవీ న్యూస్, 09-30: ఆలీతో సరదాగా: క్రియేటివ్ డైరెక్టర్ కృష్ణవంశీతో.., 10-30: సినీవారం: (స్పెషల్ ప్రోగ్రాం).

ఈటీవీ ప్లస్

ఉదయం 11:00 కిక్ రిపీట్
మధ్యాహ్నం 12:00జబర్దస్త్ రిమిక్స్
01:00 మైకేల్ మదన్ కామరాజు రిపీట్
01:15 ది బ్రేకప్ కన్సల్టెంట్ రిపీట్
01:30 పటాస్ రిపీట్
02:00 అల్లరే అల్లరి రిపీట్
02:30 సరదాగా కాసేపు రిపీట్
03:00 తారక్ మామా అయ్యో రామ రిపీట్
03:30 హంగామా రిపీట్
సాయంత్రం
04:30 నా షో నా ఇష్టం
05:00 జిల్ జిల్ జిగా
06:00 అమృతం రిపీట్
06:30 ఎక్స్‌ప్రెస్ రాజా
రాత్రి
07:30 తారక్ మామా అయ్యోరామ
08:00 ఈ-జంక్షన్
09:00 పటాస్
09:30 అల్లరే అల్లరి
10:00 సరదాగా కాసేపు
10:30 తారక్ మామా అయ్యో రామ రిపీట్
11:00 పటాస్ రిపీట్
11:30 ఎక్స్‌ప్రెస్ రాజా రిపీట్

ఈటీవీ లైఫ్

- ★ మానస (ఉ. 6:00, సా. 6.00, రా. 11.00)
- ★ డా.ఈటీవీ – (ఉ. 6:30, 11:00, మ. 3:30, సా. 7:30)
- ★ యోగమంత్ర (ఉ. 7:00, సా.5:30, రా. 11:30)
- ★ గెట్‌సెట్‌ఫిట్ (ఉ. 7:30, సా. 5:00, రా. 10:30)
- ★ అమృతం (ఉ. 8:00, మ. 12:30, రా. 8:00)
- ★ హెల్దీ & టేస్టీ – (ఉ. 8:30, మ. 01:00, రా. 8:30)
- ★ ఆరోగ్యమస్తు (ఉ. 9:00, మ. 03:00, సా. 4:00, రా. 9:00)
- ★ ఆయుష్ (ఉ. 9:30)
- ★ లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్ (ఉ. 10:00)
- ★ అందరికి ఆరోగ్యం (ఉ.10:30)
- ★ విహారి (మ. 12:00, సా. 6:30, రా. 10:00)
- ★ హెల్దీ డయాబెటిక్ - (మ. 1:30)
- ★ జీవనరేఖ – విమెన్స్ హెల్త్ (మ. 2:00, రా. 7:00)
- ★ బాడీ మైండ్ & సోల్– అంతరంగం (మ. 2:30, రా. 9:30)

ఈటీవీ సినిమా

ఉదయం: 6-00: మధురిమలు, 7-00: సన్‌రైజ్ సినిమా: బందీ (కృష్ణంరాజు విజయశాంతి), 10-00: మార్నింగ్ షో: గృహప్రవేశం (ఎల్. వి. ప్రసాద్, భానుమతి), మధ్యాహ్నం: 1-00: మాట్నీ: సందడే సందడి (జగపతిబాబు, శ్రీకాంత్), సాయంత్రం: 4-00: ఈవినింగ్ షో: ఇందు (ప్రభుదేవా, రోజా), రాత్రి: 7-00: ఫస్ట్‌షో: పెద్దక్కయ్య (హరనాథ్, కృష్ణకుమారి), 10-00: సెకండ్‌షో: అసెంబ్లీ గూండా (దేవరాజ్, అరుంధతినాగ్).

ఈటీవీ అభిరుచి

ఉ.6.00: బ్రేక్ ఫాస్ట్ షో - చికెన్ మసాలా ఇడ్లీ సాండ్విచ్ & హార్స్‌గ్రామ్ ఫ్రైడ్ రైస్, ఉ.8.00, రా.9:00: బ్రేక్ ఫాస్ట్ షో – స్పినాచ్ & చీజ్ స్టఫ్డ్ క్రిప్స్ & తెలగపిండి రవ్వ పులిహోర, ఉ.9:30: వావ్ ఏమి రుచి – అఖిడీ టుకో అష్యక్ & బోహేమనియన్ డ్రెస్సింగ్, ఉ.10.00: పిండివంటలు, ప్రసాదాలు – జీలు & చిలకడదుంప గులాబ్ జామ్, ఉ.11.00: గోరు ముద్దలు – ఆప్రికాట్ చికెన్ బ్రౌన్ రైస్, ఉ.11.15, రా.8:30: డైట్ మెనూ – ఫ్రూటీ ఓట్స్, ఉ.11.30, రా.8:00: బాబాయ్ హోటల్ - పెసరట్టు ఉప్మా & అల్లం పచ్చడి, మ.12.00: టేస్ట్ ఆఫ్ ఇండియా - సార్సో బాత్ ఇర్షాన్ మచ్ (బెంగాలీ క్యూసైన్), మ.12.15, రా.10:15: మమ్మీస్ కిచెన్ – ఓట్స్ మసాల పూరీ, మ.12.30, రా.8.45: "కౌ అండ్ కాఫ్" సూపర్ చెఫ్ - ఫీ ఆనియన్ ఎగ్ ఫ్రైడ్ రైస్, మ.12.45, సా.6.15: సూప్స్ & స్టార్టర్స్ - డ్రమ్ స్టిక్ లీఫ్ & హార్స్ గ్రామ్ సూప్, మ.1.00, రా.7.00: వావ్ ఏమి రుచి – గ్రిల్డ్ ప్రాన్స్ విత్ యుజు సాస్ (జపాన్ క్యూసైన్), మ.1.30, రా.10.00: చటపట్ (అత్తమ్మ రుచుల స్పెషల్) - ఆ కాకరకాయ పుల్ల బెల్లం పెట్టిన కూర, మ.1.45, రా.7.30: ట్రెండీ ట్రీట్స్ – చాక్లెట్ కప్ కేక్ & ఫిష్ ఫింగర్స్, మ.2.15, రా.10.30: ఛెఫ్స్ స్పెషల్ – బీన్స్ ఉసిలి, మ.2.30, సా.6.00: చోటా షెఫ్ – సాబూదాన చుడ్వా, మ.2.45, రా.10.45: జిల్ – నట్టీ క్యారెట్ స్మూతీ & సిట్రస్ మింట్ ఫిజ్, మ.3.00: ఛాయ్ బిస్కెట్ – కాల్ జోన్స్ & చాక్లెట్ ఆల్మాండ్ కాఫీ, మ.3.15: సూప్స్ & స్టార్టర్స్ - ఎగ్ డ్రాప్ సూప్.

ఈటీవీ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాలు

ఉదయం: 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 ప్రార్థనా సమయం, 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360°, 08-30 యువ, 09-00 ఘంటారావం, 09-30 సుఖీభవ, 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతీ, **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30 కమర్షియల్ స్లాట్, 01-00 ఈటీవీ 360°, 02-00 సఖి, 02-30 ఘంటారావం, 02-35 సఖి, 03-00 ఘంటారావం, 03-30 సుఖీభవ: **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 తీర్థయాత్ర: శ్రీ భోగేశ్వర స్వామి ఆలయం, పామిడి, అనంతపురం జిల్లా, 05-00 ఘంటారావం, 05-30 అంతర్యామి, 06-00 ఘంటారావం, 06-30 జై కిసాన్, **రాత్రి:** 07-00 ఘంటారావం, 07-30 ఇదీ సంగతి, 08-00 ఈటీవీ 360°, 09-00 ప్రతిధ్వని, 09-30 యువ, 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి (రిపీట్)

ఈటీవీ తెలంగాణ కార్యక్రమాలు

ఉదయం: 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 యువ (రిపీట్), 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360°, 08-30 యువ, 09-00 ఘంటారావం, 09-30 ఈటీవీ టాకీస్, 10-00 ఘంటారావం, 10-30 సుఖీభవ, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతీ!, **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30 ప్రత్యేక వాణిజ్య కార్యక్రమం, 01-00 ఈటీవీ 360°, 02-00 సఖి, 02-30 ఘంటారావం, 02-35 సఖి, 03-00 ఘంటారావం, 03-30 తీర్థయాత్ర: శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం, కందూరు మహబూబ్‌నగర్ జిల్లా, **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 సుఖీభవ, 05-00 ఘంటారావం, 05-30 అంతర్యామి, 06-00 జై కిసాన్, **రాత్రి:** 07-00 ఘంటారావం, 07-30 ఇదీ సంగతి, 08-00 ఈటీవీ 360°, 09-00 ప్రతిధ్వని, 09-30 యువ, 10-00 ఘంటారావం,10-30 ఈటీవీ టాకీస్, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి (రిపీట్).

ఏ ఛానల్లో ఏముంది.. 21-08-2017

SVBC (TTD) — **ఉదయం:** 05-30 సుప్రభాత వైభవం, 06-30 శుభోదయం + నిత్య పూజలివిగో, 07-00 విష్ణు సహస్రనామ స్తోత్రం, 07-30 శ్రీవారి సేవలు (తోమాలసేవ), 08-00 శతమానం భవతి, 08-30 పూజకు వేళాయే - శివుడు, 09-00 ఆధ్యాత్మిక విశేషాలు, 09-30 భక్తిగీత మాలిక, 10-00 ఆధ్యాత్మిక విశేషగలు - కన్నడ, 10-30 లైవ్ పద్మావతి అమ్మవారి కల్యాణం - తిరుచానూరు, 11-30 ప్రత్యేక వార్తలు - ఆముక్తమాల్యద, **మధ్యాహ్నం:** 12-00 లైవ్ కల్యాణోత్సవం, 01-00 ఆధ్యాత్మిక విశేషాలు, 01-30 విష్ణు సహస్ర నామామృతం, 02-00 లైవ్ ఆర్జిత బ్రహ్మోత్సవం, 02-30 లైవ్ వసంతోత్సవం, 03-00 పంచభూత లింగాలు, 03-30 విష్ణుపురాణం, **సాయంత్రం:** 04-30 క్షేత్ర దర్శిని, 05-00 లైవ్ ఎస్. డి. సేవ - తిరుమల + ప్రత్యేక వార్తలు, అళ్వార్ శ్రీసూక్తి, 06-00 లైవ్ నాదనీరాజనం - తిరుమల, **రాత్రి:** 07-30 లైవ్ ఘంటానాదం + శ్రీనివాసగద్యం + శివపంచాక్షరి + లింగాష్టకం, 08-00 భక్తిచైతన్యం, 08-30 ధర్మసోపానాలు - శ్రీ చాగంటి, 09-00 ఆలయ దర్శనం - మహారాష్ట్ర, 09-30 దేవిసప్తసతి - శ్రీసామవేదం, 10-00 ఆధ్యాత్మిక విశేషాలు, 10-30 మహాభారతం - అనుశాసనికపర్వం.

భక్తి TV — **ఉదయం:** 06-00 శ్రీ శివ సహస్రం, 06-30 నమకంచమకం, 07-00 అర్చన, 07-30 శ్రావణలక్ష్మీ నమోస్తుతే, 08-00 పుణ్యక్షేత్రం, 08-30 శ్రావణసోమవార వైభవం (లైవ్), 09-00 సంపూర్ణ రామాయణం, 11-00 ధర్మసందేహాలు, **సాయంత్రం:** 04-30 పుణ్యక్షేత్రం, 05-00 శివస్తోత్రం, 05-30 శ్రీశివసహస్రం, 06-00 నమకంచమకం, **రాత్రి:** 07-00 భక్తివిశేషాలు, 07-30 అమృతకలశం, 08-00 పరిహారం, 08-30 రామాయణ తరంగిణి, 09-00 లక్ష్మీ కటాక్షం, 09-30 లక్ష్మీ వైభవం, 10-00 ధర్మసందేహాలు, 10-30 భక్తివిశేషాలు.

జీ తెలుగు — **ఉదయం:** 07-30 ఓంకారం, 08-00 సినిమా: కృష్ణ, 11-00 కామెడి ఖిలాడీలు రిపీట్, **మధ్యాహ్నం:** 12-00 గోల్డ్‌రష్, 01-00 బతుకు జట్కాబండి, 02-00 గృహప్రవేశం, 02-30 నా కోడలు బంగారం, 03-00 సూర్యవంశం రిపీట్, 03-30 వారెవా, **సాయంత్రం:** 04-00 కామెడి ఖిలాడీలు, 05-00 జై కృష్ణా ముకుంద మురారి, 05-30 కుంకుమభాగ్య, 06-00 పక్కింటి అమ్మాయి, 06-30 రామా సీతా.., **రాత్రి:** 07-00 అమెరికా అమ్మాయి, 07-30 ముద్ద మందారం, 08-00 దట్ ఈజ్ మహాలక్ష్మీ, 08-30 పున్నాగ, 09-00 కళ్యాణ వైభోగం, 09-30 ముత్యాల ముగ్గు, 10-00 సూర్యవంశం, 10-30 ఇన్‌స్పెక్టర్ కిరణ్, 11-00 సినిమా: రాక్షసుడు.

మా — **ఉదయం:** 06-30 సిల్వర్ స్క్రీన్, 07-00 మహాభారతం, 08-00 రాశి ఫలాలు, 08-30 శ్రీవినాయక చరితం, 09-00 సినిమా: బన్ని, **మధ్యాహ్నం:** 12-00 కోడలా కోడలా కొడుకు పెళ్లామా, 12-30 చిన్నారి పెళ్లికూతురు, 01-00 కుంకుమపువ్వు, 01-30 బిగ్‌బాస్, 02-30 బిగ్‌బాస్ రిపీట్, **సాయంత్రం:** 04-00 బిగ్‌బాస్ రిపీట్, 05-30 ఒకే జాను, 06-00 ఉయ్యాలా జంపాలా, 06-30 చిన్నారి పెళ్లికూతురు, **రాత్రి:** 07-00 లక్ష్మీ కళ్యాణం, 07-30 అష్టాచమ్మా, 08-00 కోయిలమ్మ, 08-30 కుంకుమ పువ్వు, 09-00 మల్లీశ్వరి, 09-30 బిగ్‌బాస్, 10-30 బిగ్‌బాస్ రిపీట్.

జెమిని — **ఉదయం:** 06-00 టెలీ షాపింగ్, 07-00 సకలసిద్ధి, 07-30 అనుగ్రహం, 08-00 శ్రీ ఆంజనేయం రిపీట్, 08-30 నాటు వైద్యం, 09-00 సినిమా: రాజాబాబు, **మధ్యాహ్నం:** 12-00 నువ్వు నాకు నచ్చావు (రిపీట్) 12-30 చక్రవాకం, 01-00 నందిని (రిపీట్), 01-30 మొగలి రేకులు, 02-00 అమ్మ నేను ఓ అమ్మాయి, 02-30 నాగిని 2 (రిపీట్), 03-00 సినిమా: రైడ్, **సాయంత్రం:** 06-00 ప్రతిఘటన, 06-30 శ్రీ ఆంజనేయం, **రాత్రి:** 07-00 నాతిచరామి, 07-30 నాగిని 2, 08-00 నువ్వునాకు నచ్చావ్, 08-30 శనీశ్వరుని దివ్య చరిత్ర, 09-00 నందిని, 09-30 అగ్నిపూలు. 10-00 సినిమా: కితకితలు.

HBO — **ఉదయం:** 06-00 ఆల్మోస్ట్ హీరోస్, 07-21 10,000 బీసీ, 09-20 ద గాడ్‌ఫాదర్, **మధ్యాహ్నం:** 12-29 ద హ్యాంగోవర్ పార్ట్-2, 2-15 ట్యాక్సీ 4, **సాయంత్రం:** 04-15 ద డార్క్ నైట్ రైజెస్, **రాత్రి:** 07-16 ఫైనల్ డెస్టినేషన్ 5, 9-00 టీనేజ్ మ్యూటెంట్ నింజ టర్టిల్స్: ఔట్ ఆఫ్ ది షాడోస్, 11-03 పారానార్మల్ ఆక్టివిటి 4.

రైతేరాజు

ఈటీవీ అన్నదాతలో... రేపు ఉదయం 6.30 గం.లకు.

1. పత్తిలో గులాబీరంగు పురుగు - సమగ్ర నివారణ
2. దక్షిణ మండలంలో సాగు చేసుకోదగ్గ ప్రత్యామ్నాయ పంటలు
3. డ్రమ్‌సీడర్ యంత్రంతో వరి నాట్లు, కలుపు నివారణ పద్ధతులు

ఉచిత హెల్ప్‌లైన్ నెం.1800-425-4085కు ఉ.10-11 గం.ల మధ్య ఫోన్ చేయవచ్చు.

ఈటీవీ తెలంగాణ జైకిసాన్‌లో... నేటి సాయంత్రం 6.30 గంటలకు.

1. పత్తిలో పెరుగుతున్న చీడపీడల ఉధృతి- ఆందోళనలో కరీంనగర్ కర్షకులు
2. రైతులకు దక్కని ఉల్లి గిట్టుబాటు ధర- సామాన్యులకు కన్నీరు తెప్పిస్తున్న ఉల్లిగడ్డ

జైకిసాన్ కార్యక్రమాన్ని www.youtube.com/etv2jaikisan ద్వారా కూడా వీక్షించవచ్చు.

పుదీనా సాగు వివరాలు



పుదీనా సాగు గురించి కంపసాగర్ కేవీకే ఉద్యాన శాస్త్రవేత్త హారిక సూచించారు. పుదీనా ఔషధ మొక్క. దీని ఆకులను ఎక్కువగా వంటలలో సువాసన కోసం సుగంధ ద్రవ్యం గాను వివిధ రకాల పచ్చళ్ల తయారి లోను, సలాడ్‌ల లోను వాడతారు. ఈ మొక్క 40 సె.మీ. ఎత్తు వరకు పెరుగుతుంది. ఆకులు గుండ్రంగా ఆకుల పైభాగం మందంగా ముదురాకుపచ్చ రంగులో ఉంటాయి. ఇందులో మెంథాల్ అనే సుగంధ నూనే చాలా తక్కువ పరిమాణంలో ఉంటుంది. కానీ కార్బోస్ అనే సుగంధ పదార్థం ఎక్కువగా ఉండి సువాసనను, ప్రత్యేకమైన రుచిని కలిగిస్తుంది. పుదీనా ఆకుల కాండం నుండి తీసే నూనెను మెంథాల్ అంటారు. మెంథాల్‌ను ఎక్కువగా ఔషధాల తయారిలో, షేవింగ్, టూత్‌పేస్ట్ తయారిలోను వాడుతుంటారు. మెంథాల్ నూనె శాతం ఆకుల్లో 0.3.నుండి 0.8 వరకు, కాండంలో 0.1 శాతం వరకు ఉంటుంది. అయితే ఈ మెంథాల్ నూనె కోసం సాగు చేసే పుదీనా జాతులు ప్రధానంగా నాలుగు రకాలుంటాయి.

★ జపనీస్ మెంట్, పిప్పర్ మెంట్, స్పియర్ మెంట్, బెర్గా మెంట్. వీటిలో గుర్తింపు పొందిన శివాలిక్, హిమాలయ, కోసి, సిక్టమ్ రకాలు మాత్రమే నూనె కోసం సాగు చేస్తారు.

వాతావరణం: ఆకుకూరగా సాగుకు సమశీతోష్ణ, ఉష్ణ ప్రాంతాలు అనువైనవి. ఉష్ణోగ్రత 20-25 డిగ్రీలు ఉంటే ఆకు పెరుగుదల ఉంటుంది. నూనె కోసం అయితే ఎత్తైన చల్లని ప్రాంతాలు సాగుకు అనుకూలం.

నేలలు: సారవంతమైన అధిక సేంద్రియ పదార్థాలు గల తేలికపాటి ఇసుక నేలలు, మురుగునీరు పోయే వసతి గల తేలికపాటి ఒండ్రు నేలలు అనుకూలం నీరు నిలిచే నల్లరేగడి నేలలు పనికిరావు.

విత్తనం: పుదీనాను కాండం ముక్కలు నాటుకోవడం ద్వారా సాగు చేయవచ్చు. 2-3 కణుపులు కలిగిన ముక్కలు ఎన్నుకోవాలి. ఎకరాకు 3-4 క్వింటాళ్ల తీగ ముక్కలు అవసరం అవుతాయి.

విత్తనశుద్ధి: కాండం ముక్కలను లీటర్ నీటికి కార్బండిజమ్ 1 గ్రా. లేదా కాప్టాన్ లేదా కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా. కలిపిన ద్రావణంలో పది నిమిషాలు ముంచి నాటుకోవడం వల్ల వేరుకుళ్లను అరికట్టవచ్చు.

నాటే విధానం: వరుసల మధ్య 30 లేదా 45 సె.మీ. వరుసల్లో మొక్కల మధ్య 10 సెం.మీ. ఎడంతో 1-2 సెం.మీ. లోతులో ఒక కణుపు తప్పనిసరిగా భూమిలో ఉండేలా నాటాలి.

నాటే సమయం: ఆకుకూర కోసం సంవత్సరం పొడవునా నాటుకోవచ్చు. నూనె కోసం సాగు చేస్తే నవంబర్ 15 నుంచి డిసెంబర్ 15 లోపు నాటుకోవాలి. లేదా నూనె దిగుబడి తగ్గుతుంది.

ఎరువులు: ఆఖరి దుక్కిలో 5 టన్నుల పశువుల ఎరువు, 50 కిలోల నత్రజని, 85 కిలోల భాస్వరం, 15 కిలోల పొటాష్ వేయాలి. నత్రజని 3 దఫాలుగా అనగా ఆఖరి దుక్కిలో సగం, మిగతా సగం 40 రోజులకు, 80-90 రోజులకు వేసుకోవాలి.

–న్యూస్‌టుడే, త్రిపురారం.

పంటమార్పిడి-అంతరపంటలు



కందిలో అంతరపంటగా పెసర

ఒకే పంటను ఒకే పొలంలో వరుసగా పండించడం వల్ల చీడపీడల ఉధృతికి అనుకూల పరిస్థితులు ఏర్పడుతాయని, తద్వారా దిగుబడులపై ప్రభావం పడుతుందని కనుక పంటల మార్పిడి పాటించాలని మండల వ్యవసాయ విస్తరణాధికారి శ్యాం సూచించారు. పురుగు జీవిత చక్రం ముగించుకొని హాని కల్గించే స్థితికి చేరుకుంటుంది. ఒక పంటపై ఆశించే పురుగులు మరో పంటను ఆశించడం తక్కువ. పంట మార్పిడి చేస్తే పురుగు జీవితచక్రం ఛేదింపపడుతుంది. అవి వృద్ధి చెందడానికి ప్రతికూల పరిస్థితులు ఏర్పడుతాయి.

సాధారణంగా పాటించే పంటల సరళి అంతరపంటలు: పప్పుధాన్యపు పంట ఆహారపంట-పప్పుధాన్యపు పైరు, చిరుధాన్యాలు ఆహారపంట-చిక్కుడు జాతి పచ్చిరొట్ట పైరు, వరి-పప్పుధాన్యపు పంట/వేరుశనగ/మొక్కజొన్న, పత్తి-జొన్న/మొక్కజొన్న, పొగాకు-మిరప/కూరగాయలు, చెరకు వరి/వేరుశనగ/కంది/ఆముదం/సజ్జ/జొన్న/

పంట మార్పిడి క్రమం: ఆహార వాణిజ్యపంటలు ఒకసారి, పప్పుజాతి పంటలు మరోసారి మార్పిడి చేయాలి. అవసరమైతే గడ్డిజాతి పైర్లు వేసుకోవాలి. భూసారాన్ని పెంచడానికి పచ్చిరొట్ట పైర్లు వేయాలి. పప్పుజాతి పంటల వేర్ల బుడిపెల్లో రైజోబియం సూక్ష్మజీవులు గాలి లోని నత్రజనిని స్థిరీకరించి మొక్కలకు అందిస్తాయి.

–న్యూస్‌టుడే, ఖానాపురం.



గాంధీచౌక్‌లో సామగ్రి కొనుగోలు చేస్తున్న రైతులు



బసవన్నల ముస్తాబుకు అలంకరణ సామగ్రి కొనుగోలు చేస్తున్న దృశ్యం

పొలాల పండగ.. జనం నిండుగ

పల్లెల్లో ఘనంగా నిర్వహించే పొలాల పండగ శోభ పట్టణంలో అప్పుడే కనిపిస్తోంది. బసవన్నలకు ముస్తాబు చేసే అలంకరణ పరికరాలు, వివిధ రంగులను ఆయా దుకాణాల వద్ద విక్రయానికి సిద్ధంగా ఉంచారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన రైతులు, ప్రజలు వీటిని కొనుగోలు చేస్తున్నారు. దీంతో ఆదిలాబాద్ పట్టణంలోని ప్రధాన మార్కెట్లు కళకళలాడుతున్నాయి. అవే ఈ చిత్రాలు.

- చిత్రాలు: ఈనాడు, ఆదిలాబాద్




దుకాణాల్లో రైతుల సందడి



మంచు కురిసే వేళలో..!!

మహబూబ్‌ఘాట్‌పై కశ్మీర్ వాతావరణం



నిర్మల్ సమీపంలోని మహబూబ్‌ఘాట్‌పై మంచు కురుస్తున్న దృశ్యాలు నిర్మల్ జిల్లా కేంద్రానికి సమీపంలోని మహబూబ్‌ఘాట్ మరో కశ్మీర్ అనడానికి నిదర్శనమే ఈ చిత్రాలు.. నిర్మల్‌కు తొమ్మిది కిలోమీటర్ల దూరంలోని మహబూబ్‌ఘాట్‌పై మంచుకురిసే సమయంలో ఏర్పడిన అందాలు చూపరులను ఆహ్లాదపరిచాయి. ఏడు మూలమలుపులు.. చుట్టూ పచ్చని చెట్లతో కనువిందు చేసే రమణీయత ఆకట్టుకుంది. ఆదివారం ఉదయం ఓ వైపు చిరుజల్లులు కురుస్తుంటే మరోవైపు మంచుకురిసి రహదారిపై ప్రయాణించేవారికి కనువిందు చేసిన చిత్రాలను 'న్యూస్‌టుడే' తన కెమెరాలో బంధించింది.

- న్యూస్‌టుడే, నిర్మల్



తెలంగాణ పర్యాటకశాఖ, భాష సాంస్కృతిక శాఖల సౌజన్యంతో తెలంగాణ ఫొటో జర్నలిస్టు అసోసియేషన్ నిర్వహించిన పోటీల్లో ఆదిలాబాద్ ఈనాడు ఫొటోగ్రాఫర్ కంది శివప్రసాద్ రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచారు. ఈమేరకు ఆయన హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం రాత్రి జరిగిన ఛాయాచిత్రం ప్రదర్శన బహుమతుల ప్రదానోత్సవంలో ఎంపీ కల్వకుంట్ల కవిత, మీడియా అకాడమీ ఛైర్మన్ అల్లం నారాయణ, సాంస్కృతికశాఖ, భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ, ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి సమక్షంలో పురస్కారాన్ని అందుకున్నారు.


తెలుగులో పేరు.. అక్రమాల అడ్డుకు 'మందు'

✦ సర్కారు మందులు పక్కదారి పట్టకుండా చర్యలు!

✦ ఔషధ డబ్బాలపై 'టీఎస్' అని ముద్ర

మంచిర్యాల పట్టణం, న్యూస్‌టుడే

ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స పొందే రోగులకు ఇచ్చే మందులు పక్కదారి పట్టకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. మందుల షీట్లపై ఆంగ్లంతో పాటు తెలుగులో పేర్లను ముద్రిస్తోంది. గతంలో వీటి పేర్లు ఆంగ్లంలో ఉండటంతో చాలా వరకు పక్కదారి పట్టేవి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో పని చేసే వైద్య సిబ్బంది వీటిని ప్రైవేట్ దుకాణాల్లో అమ్మి సొమ్ము చేసుకునేవారు. ఇప్పుడు వాటి పేర్లను షీట్లపై తెలుగులో ముంద్రించడం, వాటి డబ్బాలపై 'తెలంగాణ ప్రభుత్వ సరఫరా.. అమ్మడానికి కాదు' అని రాస్తున్నారు. దీని వల్ల ఇవి ఎక్కడున్నా తెలిసిపోతుంది. సామాన్యులకు సైతం అర్థమవుతాయి. ప్రభుత్వం తెచ్చిన ఈ మార్పు వల్ల కలిగే మేలుపై 'న్యూస్‌టుడే' కథనం..





మందుల కోసం వసరలో ఉన్న రోగులు



ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స పొందే రోగులకు ఉచితంగా మందులను పంపిణీ చేస్తారు. అనారోగ్యంతో వచ్చే బాధితులను వైద్యులు పరీక్షించి ఏవి వాడాలో సూచిస్తారు. వీటిని పంపిణీ కేంద్రంలో తీసుకోవాలి. అయితే అక్కడ ఇచ్చే మందులు అర్థం కాక రోగులు ఇబ్బంది పడేవారు. ఇప్పుడు ఆ సమస్య ఉండదు. తెలుగులో వాటిని చక్కగా చదువుకోవచ్చు.



మందుల పేర్లు ఇలా తెలుగులో ముద్రించడం వల్ల రోగులకు సులభంగా అర్థమయ్యే అవకాశం ఉంది. ఏ వ్యాధికి ఏది వాడాలో అర్థం అవుతుంది. మరో పక్క ప్రభుత్వం సరఫరా చేసేవి పక్కదారి పట్టకుండా ఉంటాయి.

ప్రభుత్వ ఆసుపత్రులకు సరఫరా చేసే మందుల పంపిణీలో అవకతవకలకు అడ్డుకట్ట వేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేసింది. నాలుగు జిల్లాలకు చెందిన రోగులు మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి వైద్యసేవల కోసం వస్తారు. రోజుకు 400 మంది సాధారణ చికిత్సలు, మరో 80 మంది రోగులు ఆసుపత్రిలో చేరి వైద్యం చేయించుకుంటున్నారు. ఇందులో మంచిర్యాల, కుమురంభీం, పెద్దపల్లి జిల్లాలు, ఉట్నూర్ డివిజన్, ప్రాణహిత సరిహద్దులో గల మహారాష్ట్రలోని సిర్వోంచ నుంచి వస్తుంటారు. జిల్లాల పునర్విభజన తర్వాత మంచిర్యాల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ప్రసూతి వైద్య సేవలు పెరిగాయి. గతంలో నెలకు 80 మంది రోగులు ప్రసూతి వైద్యం పొందితే ఇప్పుడు 300 మంది ఈ సేవలు అందుకుంటున్నారు. తాజాగా అత్యవసర చికిత్స రోగుల కోసం ఆసుపత్రిలో ఐసీయూ సేవలను సైతం ప్రారంభించారు. ఇక్కడికి వచ్చేవారిలో 90 శాతం మంది పేదలే ఉంటారు. వీరి కోసం ప్రతి మూడు నెలలకు దాదాపు రూ.10 లక్ష మందులు పంపిణీ చేస్తున్నారు. గతంలో వీటి షీట్లపై పేర్లు ఆంగ్లంలో రాసి ఉండటంతో వైద్య సిబ్బంది అక్రమంగా అమ్ముకునేవారు. ఇప్పుడు తెలుగులోనూ పేర్లు ముంద్రించడంతో మందులు నేరుగా ఈ రోగులకే చేరే అవకాశం ఉంటుంది. వీటిని అక్రమంగా కొనుగోలు చేయకుండా వీటి డబ్బాలపై తెలంగాణ పేరుతో ముద్ర కూడా వేశారు. ఇప్పుడు మందుల తెలుగులో పార్మాసీటమాల్ ట్యాబ్లెట్, పాంటాప్రజోన్ ట్యాబ్లెట్, బేల్మీసర్జాన్ ట్యాబ్లెట్, అని రాసి ఉంటుంది.

తెలుగు పేర్లు ఉంటే రోగులకు అర్థమవుతుంది..

-డాక్టర్ యశ్వంతరావు, ప్రభుత్వ ఆసుపత్రి నిర్వహణాధికారి

మందుల షీట్లపై తెలుగులో పేర్లు ముద్రించడం వల్ల రోగులు ఏ జబ్బుకు ఏ మందు గోళీలు వేసుకోవాలో సులభంగా అర్థమవుతుంది. పక్కదారి పట్టకుండా ఉంటాయి. తెలుగు పేర్లతో మందుల పేర్లు ముద్రించడం వల్ల రోగులకు చాలా మేలు జరుగుతుంది.

బైంసాలో రైతు సమస్యలపై 23న సమావేశం

బెల్లంపల్లి పట్టణం, న్యూస్‌టుడే: ఈ నెల 23న రైతు సమస్యలపై నిర్మల్ జిల్లా బైంసా పట్టణంలో అఖిల భారత కూలీ సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించనున్నట్లు ఆ సంఘం ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు రత్నం తిరుపతి, నాయకులు ప్రభాకర్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు తాళ్లపల్లి పాపారావులు తెలిపారు. బైంసా పట్టణంలోని ఎంఎన్ఆర్ గార్డెన్స్‌లో సమావేశం జరుగుతుందని చెప్పారు. సమావేశంలో రైతుల సమస్యలపై చర్చించనున్నట్లు చెప్పారు. రైతు కూలీల సమస్యలను ప్రభుత్వాలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశానికి, రైతులు, రైతు కూలీలు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.